ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
మహబూబ్‌నగర్ : fb.com/vaartha Digital
Published from Mahabubnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
6-8-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 187 పేజీలు: 10+4 వెల: 6.50

పార్లమెంటుకు గైర్హాజరు కావొద్దు: ఎంపీలతో ప్రధాని
ప్రెషర్ గ్రూప్‌గా మాత్రమే పనిచేస్తాం: కాక్రోచ్ పార్టీ 5

## చంపినా సరే.. ప్రజల మధ్యే

**అది విద్యార్థి ఉద్యమం కాదు..**

**ప్రభుత్వ మార్పు కోసం కుట్ర**

**రెండేళ్ల తర్వాత బహిరంగంగా షేక్ హసీనా ప్రసంగం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** బంగ్లాదేశ్‌లో జరిగిందిన విద్యార్థుల స్వచ్ఛంద ఉద్యమం కాదని, ముందే రూపొందించిన ప్రభుత్వ మార్పు కుట్ర అని ఆరోపించారు. రిజర్వేషన్ కోటా ఉద్యమాన్ని తనను అధికారంలో నుంచి తొలగించేందుకు ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమంగా మార్చి తనను అధికారంలో నుంచి తొలగించే ఉద్యమంగా మార్చారని ఆరోపించారు. ఉద్యమం మొదటి నుంచే శాంతియుతంగా లేదని హసీనా పేర్కొన్నారు. ప్రభుత్వం హైకోర్టు కోటా తీర్పుపై అప్పీల్ చేసిందని, విద్యార్థి నాయకులతో చర్చలకు సిద్ధమైందని కూడా ఆమె చెప్పారు. కొన్ని >>2

## సారీ!

**భారత్‌కు జుకర్‌బర్గ్ క్షమాపణ**

**డీప్‌ఫేక్ కంటెంట్‌పై విచారం వ్యక్తం చేసిన 'మెటా' సిఇఒ**



**ప్రధాని మోడీ ఫేస్‌బుక్ పోస్టును మెటా కొద్దిసేపు తొలగించడంపై కేంద్రం ఆగ్రహం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపారు. ప్రధాని మోడీ వీడియో తొలగింపు, తమ ప్లాట్ ఫామ్‌లపై చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్, డీప్‌ఫేక్ కంటెంట్ వ్యాప్తి చెందడంపై ఆయన చింతిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు, తమ ప్లాట్‌ఫామ్‌ల నిర్వహణలో జరిగిన లోపాలను కూడా అంగీకరిస్తూ ఆయన విచారం వ్యక్తం చేసినట్లు ప్రభుత్వ వర్గాలు >>2

## ఫైర్ ఎన్‌ఓసి ఫోర్జరీ




**హైడ్రా రంగనాథ్ ఫోర్జరీ సంతకంతో ఎన్‌ఓసికి ప్రైవేటు ఇంటర్ కాలేజీల యత్నం**

**142లో 52 నకిలీవేనని గుర్తించిన అధికారులు**

**హైడ్రా ఫిర్యాదులోని కాలేజీల గుర్తింపును నిలిపివేసిన ఇంటర్ బోర్డు**

**కఠిన చర్యలకు సిద్ధమవుతున్న ఉన్నతాధికారులు**

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 5:** ఇంటర్‌బోర్డులో ఫోర్జరీ ఫైర్‌ఎన్‌వోసీ కలకలంరేపింది. 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు కోసం కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు హైడ్రా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఫైర్ ఎన్‌వోసీని సమర్పించి అనుమతి పొందాలని చూశాయి. ఇంటర్ బోర్డు గుర్తింపు కోసం కొన్ని కాలేజీలు సమర్పించిన ఫైర్ ఎన్‌వోసీలపై అనుమానం వచ్చిన హైడ్రా అధికారులు వాటిని పరిశీలించగా.. హైడ్రా కమిషనర్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్టు గుర్తించారు. ఫోర్జరీ చేసినట్టు నిర్ధారించుకున్న తరువాత హైడ్రా అధికారులు ఇంటర్ బోర్డుకి లేఖ రాశారు. అంతేకాకుండా ఫైర్ ఎన్‌వోసీలో ఫోర్జరీ జరిగిందని పేర్కొంటూ హైడ్రా అధికారులు పోలీస్‌కేసు నమోదు చేశారు. ఫోర్జరీ ఫైర్ ఎన్‌వోసీలను సమర్పించిన ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపును ఇవ్వకుండా నిలుపుదల చేసినట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి తెలిపారు. 15 మీటర్ల కంటే ఎత్తైన భవనాల్లో కాలేజీలను కొనసాగించే ప్రైవేటు జూనియర్ కాలేజీలకు ఫైర్ ఎన్‌వోసీని తప్పనిసరిగా ఇంటర్‌బోర్డుకి సమర్పించాల్సి ఉంటుంది. గత రెండేళ్ల క్రితం >>2

# అనుమతి ఇప్పించండి

**తుమ్మిడిహెట్టి బ్యారేజి ఎత్తుపెంపు అవసరం**

**తెలంగాణ- మహారాష్ట్ర సమావేశం జరపండి**

**ప్రాజెక్టుతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి వసతి**

**చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని సిఎం రేవంత్‌కు కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ హామీ**

**పాలమూరు, సీతమ్మ సాగర్‌కు పర్యావరణ అనుమతులివ్వాలని కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్‌కు సిఎం రేవంత్ వినతి**



బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి సిఆర్ పాటిల్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు 5:** ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ ఎత్తు పెంపుతో మహారాష్ట్రలో ముంపు ప్రభావం పెద్దగా ఉండదని వివరించారు. జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యత, ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తాను రాసిన లేఖ, దానికి ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్ శక్తికి పంపిన లేఖ విషయాన్ని ముఖ్యమంత్రి జల్‌శక్తి మంత్రితో ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల నుంచి 152 మీటర్ల వరకు ఎత్తుతో బ్యారేజీ నిర్మించే అంశంపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (సిడబ్ల్యుపిఆర్‌ఎస్) అధ్యయనం నిర్వహించిందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. సిడబ్ల్యుపిఆర్‌ఎస్ అధ్యయనం ప్రకారం 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా, 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైందన్నారు. ముంపులోనూ 50 శాతం నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుందని కేంద్ర మంత్రి పాటిల్‌కు సీఎం వివరించారు. 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా కావల్సినంత నీరు సరఫరా చేయలేమని, కాబట్టి 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను సీఎం కోరారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరాకు అవకాశం ఉంటుందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. గ్రావిటీ ద్వారా నీటి >>2

## 112

**అత్యవసర సేవలకు కొత్త నంబర్**

**హైడ్రా, ఫైర్ సర్వీసు సహా 18 సంస్థల సేవలు**

**లాంఛనంగా ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్**




బుధవారం హైదరాబాద్‌లో డయల్ 112ను ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా అత్యవసర సేవలకు అందుబాటులో వున్న డయల్ 112 తెలంగాణలోనూ ప్రారంభమయ్యింది. బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఎఐ ఆధారిత డయల్ 112 సేవలను డిజిపి సి.వి ఆనంద్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. 112 నంబర్‌తో పోలీసుతో పాటు ఫైర్ సర్వీస్, హైడ్రా, బల్దియా సహా 18 సంస్థల సేవలను పొందవచ్చని ఈ సందర్భంగా డిజిపి తెలిపారు. 112 ప్రారంభంతో రాష్ట్ర వ్యాప్తంగా కీలక ప్రభుత్వ విభాగాలు సాంకేతికంగా వేగంగా స్పందించేందుకు అవకాశం ఏర్పడిందని, స్పందించే సమయం 30 శాతం >>2



బుధవారం జూరాల నుంచి నీటిని దిగువకు వదిలిన దృశ్యం

## ఉప్పొంగిన కృష్ణమ్మ

**శ్రీశైలం జలాశయానికి పోటెత్తిన వరద**

**జూరాల 40 గేట్లుఎత్తి నీటి విడుదల**

**ఎస్సారెస్పీలో 37.37 టిఎంసిల నీటి నిల్వ**

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న ఎడతెరిపి భారీ వర్షాల కారణంగా కృష్ణానది ఉప్పొంగి ప్రవహిస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి నిల్వ సామర్థ్యం 215.80 టిఎంసిలు కాగా ప్రస్తుతం 125.62 టిఎంసి ల నీరు ఉంది. జలాశయానికి 24,518.3 క్యూసెక్కుల ప్రవాహం నమోదవుతుండగా, 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్, విద్యుత్ ఉత్పత్తి, దిగువ ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా నీటి వినియోగం కొనసాగుతోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా కృష్ణ నదిపై నిర్మించిన గుర్జాపూర్, యాదగిరి జిల్లా గూడూరు భీమా నదిపై ఉన్న గుగ్గల్ బ్యారేజీ కి వరద నీరు పోటెత్తడంతో ఈ బ్యారేజీ 40 గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు మూడులక్షల క్యూసెక్కుల నీటిని దిగువనున్న శ్రీశైలంకు వదులుతున్నారు.జూరాల ఎగువన ఆరుయూనిట్లు దిగువన ఆరు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద >>2

# తప్పుడు ప్రచారాలొద్దు

**కట్టు కథలతో బట్టకాల్చి మీద వేయడమే హరీష్ పని**

**తొలుత కాళేశ్వరం ముడుపుల లెక్క చెప్పాలి**

**ఎపికి అమ్ముడుపోయి విమర్శలా?**

**నెలాఖరులో సమ్మక్క సాగర్‌కు ఎన్‌ఓసి**

**నీటి పారుదల మంత్రి ఉత్తమ్ కుమార్**



**హైదరాబాద్, ఆగస్టు 5 ప్రభాత వార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పన్నెండు సంవత్సరాలుగా ప్రతి బోర్డు సమావేశాల్లో తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తుందని, ఇది కొత్త విషయం కాదని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఢిల్లీ ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రాజెక్ట్ లకు పరోక్షంగా మద్దతు ఇచ్చిన బి ఆర్‌ఎస్ పార్టీ నేతలు అధికారం కోల్పోగానే కడుపు మంట తో బట్ట కాల్చి మీద వేస్తున్నారని మంత్రి విరుచుకు పడ్డారు. తెలంగాణ రైతాంగం ప్రయోజనాలు కాపాడే విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో తొమ్మిదిన్నరేళ్ల అధికారంలో బిఆర్ ఎస్ ఏ రోజు తెలంగాణ ప్రయోజనాలు కాపాడలేదు. బి ఆర్ ఎస్ అధికారంలో ఉన్న సమయంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు జరిగింది వాస్తవం కాదా..? అని అడిగారు.పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ పనులు ప్రారంభం అయింది బిఆర్ ఎస్ హయాంలోనే అని గుర్తుచేశారు. పట్టి సీమ ఎత్తిపోతల పథకం మీరు అధికారంలో ఉండగా పూర్తి కాలేదా అని ప్రశ్నించారు. తొమ్మిదినరేళ్ళు తెలంగాణ సొమ్మును లూటీ చేసి అధికారం కోల్పోగానే మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు.ఈ నెల 18వ తేదీన జరిగే జిఆర్ఎంబి మీటింగ్‌లో అజెండాలో చేర్చ బడిన అంశాలు కొత్తవేమి కాదు. ఇవే అంశాలను మునపటి మీటింగులలో కరెస్పాండన్స్ లలో కూడా ఆంధ్రప్రదేశ్ ప్రతి సారి ప్రస్తావిస్తూ వస్తున్నదనీ ఉత్తమ్‌అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం క్లియరెన్స్ విషయంలో కూడా ఎపి ప్రస్తావించింది. దీని పైన ఈ ప్రభుత్వం ధీటుగా స్పందించి అవన్నియు కూడా నిరాధారమైనవని గోదావరి రివర్ మేనెజ్‌మెంట్‌కి సిడబ్ల్యుసికి దృష్టికి తీసుకువెళ్లి ఎస్‌ఎస్‌ఎంపి ఎస్‌ఆర్‌ఎల్ ఐపి టిఎసి క్లియరెన్స్ వంటివి విజయవంతంగా గత సంవత్సరం ఏప్రిల్ 24న అనుమతులు సాధించామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత, ఎపి రాష్ట్రం నిరంతరం జిఆర్‌ఎంబి, సిడబ్ల్యుసి, జలశక్తి మంత్రిత్వ శాఖకు కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క, చిన్న కాళేశ్వరం, చనాకాకొరటా, మోదికుంట వాగు, గూడెం లిఫ్ట్ తదితర ఏడు ప్రాజెక్టుల అనుమతులు ఇవ్వరాదని కోరుతూ వచ్చింది. ఈ సందర్భంలో చెప్పదగ్గ విషయం ఏమిటంటే, ఎపి లేవనెత్తిన అటువంటి అంశాలను ఈ ప్రభుత్వం ధీటుగా ప్రతిఘటించి మన రాష్ట్ర నీటి హక్కులను కాపాడడంలో సఫలీకృతుమైనది.ఈ విషయంలో >>2

ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తేలేని కాంగ్రెస్ సర్కార్
7
సమ్మక్క- సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా?
హరీష్‌రావు ఘాటు వ్యాఖ్యలు

## సాగులో డిజిటల్ విప్లవం



**దేశ వ్యాప్తంగా కొత్త ఫెర్టిలైజర్ యాప్**

**ఇంటెగ్రేటెడ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో అనుసంధానం**

**పారదర్శకత, బ్లాక్‌మార్కెటింగ్ అరికట్టేందుకు చర్యలు**

**త్వరలో రైతులకు అందుబాటులోకి తెస్తున్న కేంద్రం**

**రద్దు కానున్న తెలంగాణ ప్రభుత్వ ఫెర్టిలైజర్ యాప్**

**హైదరాబాద్, అగస్టు 5, ప్రభాతవార్త:** దేశంలో ఎరువుల పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభంగా మార్చేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కీలక అడుగు వేస్తోంది. రైతులు ఎరువుల కోసం దుకాణాల వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితిని తగ్గిస్తూ, ముందుగానే అవసరమైన ఎరువులను బుక్ చేసుకునేలా కొత్త ఫెర్టిలైజర్ యాప్‌ను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. అయితే ఇప్పటికే ఇటువంటి యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు తాజాగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ దేశ వ్యాప్తంగా తెలంగాణతో సహా అన్ని రాష్ట్రాల్లోనూ ఫెర్టిలైజర్స్ యాప్‌ను అందుబాటులోకి తెస్తోంది. వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికవర్గాల వివరాలు ప్రకారం ఈ ఫెర్టిలైజర్స్ యాప్ వ్యవస్థ దేశవ్యాప్తంగా ఒకే విధానంలో అమలు చేయనుంది. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో రైతులు నేరుగా ఎరువుల దుకాణాలకు వెళ్లి అందుబాటులో ఉన్న స్టాక్ ఆధారంగా కొనుగోలు చేస్తున్నారు. అయితే కొత్త విధానంలో ముందుగా మొబైల్ యాప్‌లోనే ఎరువులను రిజర్వ్ చేసుకునే అవకాశం కల్పించనున్నారు. బుకింగ్ పూర్తయిన తర్వాత నిర్ణయించిన తేదీ, సమయానికి సంబంధిత డీలర్ వద్దకు వెళ్లి ఎరువులను పొందేలా వ్యవస్థ రూపొందిస్తున్నారు. దీంతో రద్దీ తగ్గడమే కాకుండా పంపిణీ మరింత క్రమబద్ధంగా జరిగే అవకాశం ఉంది. ఈ యాప్‌ను >>2

## మరో 3 రోజులు భారీ వర్ష సూచన



**19 జిల్లాలకు ఎల్లో అలర్ట్**

**హైదరాబాద్, అగస్టు 5, ప్రభాతవార్త:** ఉపరితల ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు ఒక మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణలోని 19 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రానున్న మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయి. అంతేకాకుండా వర్షం కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. ఈ భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నల్గొండ, నాగర్ కర్నూల్ జిల్లాలకు వాతావరణ కేంద్రం >>2



ప్రయాగ్‌రాజ్‌లో బుధవారం చెరువును తలపిస్తున్న రహదారిపై మోకాలిలోతు నీటిలో ప్రయాణికుల అవస్థలు

## సిఎం రేవంత్‌రెడ్డి విదేశ పర్యటనకు ఎసిబి కోర్టు గ్రీన్‌సిగ్నల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు5:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు హైదరాబాద్‌లోని ఏసిబి కేసుల ప్రత్యేక కోర్టు అనుమతి మంజూరు చేసింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి, అధికారిక పర్యటన నిమిత్తం తన పాస్‌పోర్ట్‌ను తిరిగి ఇవ్వాలని, విదేశాలకు వెళ్లేందుకు అనుమతించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం పలు షరతులతో ఆయన విదేశీ పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సిఎం రేవంత్ రెడ్డి ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యునైటెడ్ కింగ్‌డమ్ (యూకె), అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించనున్నారు. అయితే, ఈ పర్యటనకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఒకరి హామీని సమర్పించాలని ఆదేశించింది. పర్యటన ప్రణాళిక, ఆయా దేశాల్లో బస చేసే వివరాలను కోర్టుకు అందించాలని స్పష్టం చేసింది. వీటితో పాటు కేంద్ర విదేశాంగ శాఖ నుంచి రాజకీయపరమైన అనుమతి పొందాలని, పర్యటన ముగించుకుని తిరిగి వచ్చాక సెప్టెంబర్ 18 లోగా పాస్‌పోర్ట్‌ను తిరిగి కోర్టులో జమ చేయాలని ఆదేశాల్లో పేర్కొంది.

## ఫైర్‌ఎన్‌ఓసి ఫోర్జరీ

>> వరకు ఫైర్ ఎన్‌వోసీని అగ్నిమాపక శాఖ అధికారులు జారీ చేసేవారు. హైడ్రా ఏర్పాటైన తరువాత హైడ్రా అధికారులే ఫైర్ ఎన్‌వోసీలను జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సమర్పించిన ఫైర్ ఎన్‌వోసీల్లో ఫోర్జరీ సర్టిఫికెట్లు ఉన్నట్టు హైడ్రా గుర్తించింది. అనుబంధ గుర్తింపు కోసం కాలేజీలు నకిలీ ఫైర్ ఎన్‌వోసీని సమర్పించాయి. హైడ్రా అధికారులు చెప్పేంత వరకు కూడా ఇంటర్ బోర్డు అధికారులు ఫోర్జరీ ఫైర్ ఎన్‌వోసీని గుర్తించలేకపోయారు. హైడ్రా సూచన మేరకు బోర్డు అనుమతి కోసం ఇప్పటికే ఫైర్ ఎన్‌వోసీ సమర్పించిన కాలేజీలకు సంబంధించిన ఎన్‌వోసీలను సైతం పునః పరిశీలన చేయాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారు(డీఐఈవో)లను ఇంటర్ బోర్డు సెక్రటరీ ఆదేశించారు. ఫోర్జరీ ఎన్‌వోసీలు సమర్పించిన 8 కాలేజీలకు ఈ ఏడాది అనుబంధ గుర్తింపును ఇవ్వకుండా నిలుపుదల చేయడమే కాకుండా ఇతర శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి ఇంటర్ బోర్డు సిద్ధమైనట్టు బోర్డు సెక్రటరీ తెలిపారు. రాష్ట్రంలో ఫైర్ ఎన్‌వోసీ అవసరం ఉన్న కాలేజీలు సుమారు 60 వరకు ఉంటాయని, వాటిలో ఇప్పటికే ఫైర్ ఎన్‌వోసీ సమర్పించిన వాటిని పరిశీలించి, స్పష్టత కోసం హైడ్రా అధికారులతో సంప్రదించిన అనంతరం వారికి గుర్తింపుపై నిర్ణయం తీసుకోనున్నట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది.

## 112 అత్యవసర సేవలకు కొత్త నంబర్

>> ఆదా అవుతుందని డిజిపి తెలిపారు. సాంకేతిక ఆధారిత పోలీసింగ్, పౌర కేంద్రిక అత్యవసర సేవల దిశగా రాష్ట్రం వేస్తున్న అడుగుల్లో 112 ప్లాట్ ఫాం ఒక మైలురాయిగా ఆయన అభివర్ణించారు. అత్యవసర సమయాల్లో బాధితులకు 112 కచ్చితంగా ఉపయో గపడుతుందని ఆయన అన్నారు. ఈ విభాగంలో పనిచేసే అధికారులు, సిబ్బంది బాధితులు చేసే ఫోన్ కాల్స్‌కు వెంటనే స్పందించాలని, వారి కి సహాయం అందించాలని డిజిపి ఆదేశించారు. ఈ విభాగం బాధితులకు అందించే సహాయంపైనే పోలీసు వ్యవస్థపై వున్న నమ్మకం బలపడు తుందని ఆయన తెలిపారు. ఏకీకృత సేవల్లో భాగంగా పోలీసు, ఫైర్ సర్వీస్, అంబులెన్స్, మహిళా భద్రత, శిశు సంక్షేమం, విపత్తు నిర్వహణ సేవలను 112లో అనుసంధానం చేశామని, ఇది జాతీయ నంబర్‌కు కలపబడిందని ఆయన వెల్లడించారు. ఈ వ్యవస్థకు ఎఐ ఆధారిత సాంకేతికను జోడించామని దీనివల్ల బాధితులకు సాయం అందించడంలో స్పందన వేగంగా వుంటుందని డిజిపి తెలిపారు. కాల్ రౌటింగ్, దీనిని బదిలీ చేయడం ఇక మరింత వేగంగా జరుగుతుందని ఆయన తెలిపారు. వాయిస్ టు టెక్స్ మాట్లాడే సంభాషణను ఆటోమేటిక్ గా పాఠ్యరూ పంలో మారడం ఇందులో ప్రత్యేకతగా ఆయన వెల్లడించారు. బాధితులు వున్న ప్రాంతాన్ని మరింత కచ్చితంగా గుర్తించే అవకాశం వుంటుందని ఆనంద్ తెలిపారు. కాల్ టేకర్ సమయం ఇదివరకు 100 సెకన్లు వుండగా ఇది 69 సెకన్లకు తగ్గుతుందని, డిస్పాచర్ సమయం 90 సెకన్ల ను ంచి 64 సెకన్లకు తగ్గుతుందని ఆయన తెలిపారు. కాల్ సెంటర్‌లో జరిగే ప్రక్రియ సమయం 190 సెకన్ల నుంచి 133 సెకన్లకు తగ్గిందని ఆ యన తెలిపారు. ప్రస్తుతం బాధితుల వద్దకు చేరుతున్న సమయం ఆరు నిమిషాలు వుండగా గ్రామీణ ప్రాంతాలలో 15 నిమిషాలుగా వుందని, రాష్ట్ర సగటు 10 నిమిషాల 30 సెకన్లుగా వుందని డిజిపి తెలిపారు. ఈ విషయంలో జాతీయ సగటు 18 నిమిషాలుగా వుందని ఆయన వెల్ల డించారు. కమాండ్ కంట్రోల్‌లో రెండు బ్లాకుల్లో పనిచేసే ఈ విభాగం నిరంతరంగా సేవలందిస్తుందని, ఇందుకోసం 164 మంది సుశిక్షుతుల తో పాటు 900 ఎస్ఐపి ఆధారిత ఛానళ్ల సేవలను వాడుకుంటుందని ఆయన తెలిపారు. నిత్యం 14 లక్షల కాల్స్ ఐవిఆర్‌కు చేరుతుండగా 18000 అత్యవసర కాల్స్ ను సిబ్బంది స్వీకరి స్తున్నారని, ప్రతిరోజు ఏడున్నర వేల ఘటనలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సిబ్బంది హాజరవు తూ బాధితులకు సేలందిస్తున్నారని డిజిపి తెలిపారు. రాష్ట్రంలోని 31 పోలీసు యూనిట్లలో గల 1860 గస్తీ వాహనాలను ఈ విభాగంలో అ నుసంధానించామని డిజిపి తెలిపారు. కొంపల్లిలో ఇప్పుడున్న డయల్ 100 సేవలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కమాండ్ కంట్రోల్‌లో సొంతంగా మౌలిక వసతులను ఏ ర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఇకముందు ప్రజలు అత్యవసర సేవలకు 112కు ఫోన్ చేయాలని డిజిపి కోరారు.కాగా రాబోయే రోజుల్లో డ్రోన్ టెక్నాలజిని విస్తరిస్తామని డిజిపి తెలిపారు.
ఇందుకోసం డ్రోన్ విభాగాన్ని ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. ఇందుకోసం పైలట్ ప్రాజెక్టు కింద హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్లలో డ్రోన్లను ఏరియల్ ఫస్ట్ రెస్పా ండర్లుగా ఉపయోగిస్తామని డిజిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్‌తో పాటు శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, టెక్నికల్ విభాగం డిజి శ్రీనివా సరావు, సిటీ కొత్వాల్ సజ్జన్నర్, సిఐడి డిజి చారుసిన్హా, ఫైర్ సర్వీస్ డిజి విక్రం సింగ్ మాన్, సైబరాబాద్ కొత్వాల్ రమేష్, మల్కాజిగిరి కమిషనర్ సుమతి, మల్టీజోన్ ఐజి చంద్రశేఖర్‌రెడ్డి, కమాండ్ కంట్రోల్ ఓఎస్ డి కమలాసన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సారీ!

>> బుధవారం వెల్లడించాయి. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీకి చెందిన ఓ ఫేస్‌బుక్ పోస్ట్‌ను కొద్దిసేపు తొలగించడంపై పార్లమెంటరీ కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ వివాదంపై చర్చించేందుకు మెటా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఢిల్లీలో ఐటీ కార్యదర్శి ఎస్. కృష్ణన్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా, అభ్యంతరకర, తప్పుడు కంటెంట్ వ్యాప్తిపై భారత ప్రభుత్వం లేవనెత్తిన ఆందోళనలను మెటా ప్రతినిధులు అంగీకరించారని, ప్లాట్‌ఫామ్ నిర్వహణలో జరిగిన పొరపాట్లపై జుకర్‌బర్గ్ క్షమాపణలు చెప్పారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. యూజర్లకు ఏ కంటెంట్ చేరాలనేది ప్లాట్‌ఫామ్‌లే ఎంపిక చేసి పంపిణీ చేస్తున్నప్పుడు, వాటిని కేవలం మధ్యవర్తులుగా పరిగణించలేమని భారత అధికారులు మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో ఐటీ చట్టం కింద లభించే సేఫ్ హార్బర్ రక్షణ వర్తించదని తేల్చిచెప్పారు. కొన్ని రకాల కంటెంట్‌ను ప్రోత్స హించేందుకు (బూస్టింగ్) భారీగా డబ్బులు చెల్లించినట్లు మెటా అంగీకరించిందని, ఈ తప్పులకు విచారం వ్యక్తం చేసిందని కూడా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రధాని మోడీ పోస్ట్ తొలగింపుపై మూడు రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని పార్లమెంటరీ ప్యానెల్ మెటాను ఆదేశించింది. గడువులోగా స్పందించకపోతే మెటా సేఫ్ హార్బర్ రక్షణను కోల్పోతుందని ఐటీ మంత్రిత్వ శాఖ వర్గాలు హెచ్చరించాయి.

## వర్ష సూచన

>> అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అలాగే హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. ఉరుములు, పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున, అలాగే బలమైన ఈదురు గాలుల నేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని, చెట్ల కింద ఆశ్రయం పొందకూడదని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. ప్రజలంతా అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. కాగా, గడచిన 24 గంటల్లో రాష్ట్రంలో చిరు జల్లుల నుండి స్వల్ప వర్షం కురిసింది. ఇది రాష్ట్రవ్యాప్తంగా సగటున 4.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రం లోనే అత్యధికంగా మెదక్ జిల్లా పాపన్న పేటలో 89 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే సిరిసిల్లా జిల్లాలో 23.7 మిల్లీమీటర్లు, నిజాబాద్‌లో 20.8 మిల్లీమీటర్లు, మెదక్‌లో 14.3 మిల్లీమీటర్లు, నిర్మల్‌లో 15.8 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

### వారం - వర్జ్యం

**06-08-2026, గురువారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**ఆషాఢ మాసం, దక్షిణాయణం,**
**గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,**
తి.అష్టమి సా.6.49 న.భరణి రా.8.10
వ.ఉ.6.24-ఉ.7.56
దు.1. ఉ.10.05-ఉ.10.56
దు.2. మ.3.12-సా.4.03
రాహు. మ.1.30-మ.3.00 శుభ లేదు.

### వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా వుంటుంది. పెద్ద స్థాయిని కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**వృషభం :** ఇచ్చిన ఋణాలను తిరిగి వసూలు అవ్వటం కష్టమవుతుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. ఆరోగ్యం జాగ్రత్త

**మిథునం :** మిత్రులతో చేయు నూతన కార్యక్రమములు ఉత్సాహకరముగా, లాభకరముగా ఉంటాయి. వస్త్ర లాభం.

**కర్కాటకం :** మీరు చెబితేనే గాని అభివృద్ధి పనులు మీ కార్యాలయములోని వారికి తెలియవు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**సింహం :** శత్రువుల మూలకముగా కొంత మానసిక ఆందోళనకు గురౌవుతారు. వాహన యోగం. మిత్రులను కలుస్తారు.

**కన్య :** స్త్రీలతో విభేదాలు ఏర్పడకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోండి. మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

**తుల :** అనేక లాభదాయక వ్యవహారములు మీకు అనుకూలముగా మారుట వలన అసూయ పెరుగుతుంది.

**వృశ్చికం :** కొన్ని త్యాగముల కొరకు నిర్బంధములను అతిక్రమించ వలసి వస్తుంది. ప్రయోషన్లకు అవకాశం ఉంది.

**ధనుస్సు :** సహోదర, సహోదరీ వర్గియులు కొన్ని కారణముల వలన దూరముగా వుంటారు. గృహనిర్మాణ యత్నాలు ఫలించవు. వాహన సౌఖ్యం.

**మకరం :** స్వజనుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు. విక్రయ ప్రదర్శనలు కలిసి వస్తాయి. ఇంటా బయటా అనుకూలం.

**కుంభం :** విద్యా సారస్వత, రాజకీయ రంగాలలో కొన్ని వివాదాలు రావచ్చు. వ్యాపార ప్రకటనలు ఆకర్షిస్తాయి.

**మీనం :** రహస్య విరోధులపై విచారణలు, అభియోగాలు సంభవం. ఉమ్మడిగా సాగించే కృషికి ప్రతిఫలం వస్తుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# తప్పుడు ప్రచారాలొద్దు

>> రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ఉదాసీనత ప్రదర్శించుట లేదు. ఈ సందర్భంగా ప్రస్తావంచడం ఏమిటి అనగా గత బిఆర్ఎస్ ప్రభుత్వమే 3వ జిఆర్ఎంబి మీటింగ్ నందు రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీకి సంబంధించి, ఆయా రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదరాలి లేదా ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలి అని తన వైఖరి ద్వార స్పష్టం చేసింది. ఈ రెండు రాష్ట్రాలకు నీటి సరఫరా నియంత్రణను జిఆర్ఎంబి ప్రారంభించే ముందే ఈ షరతులలో ఏదో ఒకటి నెరవేరాలని ఆ ప్రభుత్వం పేర్కొంది.ఇదే విషయాన్నీ పునర్ఘటిస్తూ, గత బిఆర్ ఎస్ ప్రభుత్వం రెండవ శిఖర కౌన్సిల్ 2020 అక్టోబర్ 6న జరిగిన మీటింగ్‌లో ట్రిబ్యునల్ ఏర్పాటు కొరకు ఎపిరాష్ట్రం తో పోటీ పడి కోరడం జరిగింది.ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తి తో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకుందన్నారు. ఇది ఈ ప్రభుత్వం యొక్క నిబద్ధత.అంతర్రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ క్లియరెన్స్ మరియు ఐపి క్లియరెన్స్ పొందడంలో గత ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేయలేదు.
ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ముంపు సమస్యకు సంబంధించి కూడా గత ప్రభుత్వం ఆ రాష్ట్రంతో ఎలాంటి సంప్రదింపులు జరపలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని చాలాసార్లు సంప్రదించి / సందర్శించి, ఐఎస్ఎం డైరెక్టరేట్ క్లియరెన్స్ పొందడం కోసం ముంపు సమస్యకు సంబంధించి ఛత్తీస్‌గఢ్ నుండి నిరభ్యంతర పత్రం పొందేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ఎన్ ఒసి కోసం మూడుసార్లు ఛత్తీష్ గడ్ సిఎం ను కలిసి ఎన్ ఒసి కోసం విజ్ఞప్తి చేశాం. నెలాఖరులో ఎన్ ఒసి ఇస్తామని సీఎం చెప్పారు. మీరు అధికారం లో ఉండగా ఒక్క సారి అయినా ఛత్తీష్ గఢ సీఎం ను కలిశారా అని ప్రశ్నించారు.ఈ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అభ్యంతరాలను సమర్థవంతంగా ప్రతిఘటించి రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్ట మొదటి బహులార్థ సాధక సీతమ్మ సాగర్ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు టిఏసి అనుమతులు 24.ఏప్రిల్ 2025 సాధించామని న్నారు తొమ్మిదినారేళ్లలో చేయలేని పని చేసాం. 67 టిఎంసి ల నీటి కేటాయింపులు సాధించాం . ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించినట్టుగా ట్రిబ్యునల్ ఏర్పరిచే విషయంలో కూడా ఈ ప్రభుత్వం సమయస్ఫూర్తి తో అడుగులు వేసి కేంద్ర ప్రభుత్వం జలశక్తి మంత్రిత్వ శాఖ ద్వారా ట్రిబ్యునల్ ఇప్పటివరకు ఏర్పడకుండా అడ్డుకుంది . ఇది ఈ ప్రభుత్వం యొక్క నిబద్ధత.పిడిఎఫ్ పి ప్రతిపాదన గురించి తెలిసిన తర్వాత ఈ ప్రభుత్వం వెనువెంటనే స్పందించడం జరిగింది.ఇప్పటివరకు ముఖ్యమంత్రి రెండు సార్లు నీటిపారుదల శాఖ మంత్రి గా నేను ఏడు సార్లు , పది సార్లు ప్రధాన కార్యదర్శి , జనరల్ ఇఎన్ సి 19 సార్లు వంటి వివిధ స్థాయిల అధికారుల ద్వారా కేంద్ర ప్రభుత్వం వివిధ విభాగాలతో ఉత్తరప్రత్యుత్తరాలు జరపబడ్డాయి.న్యాయపరమైన చర్యలో భాగంగా, ప్రభుత్వం గౌరవనీయ సుప్రీమ్ కోర్ట్ ముందు ఒరిజినల్ సూట్ ఐఎవాజ్యాలు వేయడం జరిగింది. ప్రతివాదులందరూ 4 వారాల్లోగా తమ సమాధానాలను దాఖలు చేయాలని గౌరవనీయ న్యాయస్థానం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది.2018-2022 మధ్య కాలంలో రాయలసీమ ప్రాంతానికి 200 టిఎంసిల వరద నీటిని తరలించే పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టినప్పటికీ, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం ప్రేక్షకపాత్రకే పరిమితం కాలేదా? అని నిలదీశారు .ఆర్డీఎస్ లో వాటా మేరకు నీళ్ల కోసం ఏ రోజు బీఆర్ ఎస్ ప్రయత్నం చేయలేదు. ఆర్డీఎస్ ఆధునీకరణ విషయం లో ఏపీ, కర్ణాటక సిఎం లను ఒప్పించాం. మీరు ఏ రోజైనా కర్ణాటక సిఎం ను కలిసి ఒప్పించారా అని నిలదీశారు. కెడబ్ల్యుడిటి లో కృష్ణా జలాల వాటా కోసం స్వయంగా విచారణ కు హాజరై న్యాయ నిపుణులతో సూచన చేశాఅని చెప్పారు.గత ప్రభుత్వం కంటే సమర్థ వంతంగా వాదనలు వినిపిస్తున్నాం.
రాష్ట్ర ప్రజల నీటి హక్కులను పరిరక్షించి, కాపాడేందుకు ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది.బేసిన్లు లేవు.. భేషజాలు లేవు అనే సిద్ధాంతం కలిగిన బిఆర్ ఎస్ ద్వంద విధానాలతో మేము నేర్చుకోవాల్సి సింది ఏమీ లేదు. తొలుత కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం లో ఏపీ కాంట్రాక్టర్ లనుంచి ముడుపులు అందాయనే కవిత ఆరోపణ లకు జవాబు చెప్పు. అ ముడుపుల్లో నీ వాటా ఎంత. తెలంగాణ లో అధికారం లో రావడం లేదని ఏపీ తో కుమ్మక్కై నాగార్జున సాగర్ ప్రాజెక్టు ను వివాదం చేసింది మీరు కాదా.?రూ లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు ను నిండా ముంచి సిగ్గు లేకుండా రాజకీయాలు చేస్తా వా అని మంత్రి నిలదీశారు

# ఉప్పొంగిన కృష్ణమ్మ

>> జలాలు తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా జూరాల ప్రాజెక్టు కు చేరుతుండటంతో నది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. నది పూర్తిగా నీటితో నిండిపోవడంతో తెలంగాణకర్ణాటక సరిహద్దులోని కృష్ణ బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న వరద ప్రవాహం ఆహ్లాదకర దృశ్యాన్ని తలపిస్తోంది. ఈ దృశ్యాన్ని చూసేందుకు స్థానికులతో పాటు ప్రయాణికులు కూడా బ్రిడ్జి వద్దకు చేరుకుని ఫొటోలు, వీడియోలు తీసుకుంటున్నారు.కృష్ణానదిలో ప్రవాహం రోజురోజుకు వరద ప్రవాహం పెరుగుతుండడంతో జూరాల ప్రాజెక్టు అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వరద ఉధృతి కారణంగా నదిలో స్నానాలు చేయకుండా, చేపల వేటకు వెళ్లకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కృష్ణా నదిపై కర్నాటకలో ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండడంతో దిగువకు వరద కొనసాగుతోంది. ఆల్మట్టి నుంచి దిగువకు 1,49,597 క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి 1,47,776 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తుంగభద్ర జలాశయంలో ప్రస్తుతం 51 టిఎంసిల నీరు ఉండగా 82వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. దిగువకు 1,589 క్యూసెక్కులు వదులుతున్నారు. నాగార్జునసాగర్ పూర్తి సామర్థ్యం 312 టిఎంసిలకు గాను ప్రస్తుతం 136 టిఎంసిల నిల్వ ఉంది .గోదావరిలో ఎగవ నుంచి తెలంగాణలోని తొలి ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు 32831 క్యూసెక్కులు వదర వచ్చిచేరుతోంది. ప్రస్తుతం అందులో 37,37టిఎంసిలు నీరు నిలిచి ఉంది.




బుధవారం పార్లమెంటు వద్ద నిరసన ప్రదర్శనలో ఖర్గే, రాహుల్ గాంధీ తదితర ఎంపీలు

# అనుమతి ఇప్పించండి

>> సరఫరాతో విద్యుత్ వినియోగం భారం ఉండదని, ఈ నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని కోరారు. ఈ అంశంపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు నీటి వసతి ఏర్పడుతుందని సీఎం వివరించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి లేఖ అందిందని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్ రెడ్డికి తెలిపారు. ఈ అంశంపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తొలుత తెలంగాణ, మహారాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలియజేశారు. ఆ తర్వాత తెలంగాణ, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తానని జల్‌శక్తి మంత్రి ముఖ్యమంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ.శ్రీధర్ పాల్గొన్నారు.పాలమూరు -రంగారెడ్డి, సీతమ్మ సాగర్, డిండిలకు పర్యావరణ అనుమతులు ఇవ్వండి

**కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి**

పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పార్లమెంట్‌లో బుధవారం సమావేశమయ్యారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఈ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతలపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్ల నిధులను వ్యయం చేసిందని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయాయని, ఫలితంగా ప్రాజెక్టుల వ్యయం పెరుగుతోందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. సుప్రీంకోర్టు తీర్పు సానుకూలత నేపథ్యంలో ప్రాజెక్టులకు తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు.
సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ యాదవ్, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

## చంపినా సరే.. ప్రజల మధ్యే

>> గుంపులు ఈ ఉద్యమాన్ని హింసాత్మకంగా మార్చి, ఎన్నికైన ప్రభుత్వాన్ని గద్దె దించారని ఆరోపించారు. 2024 అల్లర్ల సమయంలో 450కి పైగా పోలీస్ స్టేషన్లకు నిప్పు పెట్టారని, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేశారని, పలువురు పోలీస్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఆమె ఆరోపించారు. తన ప్రసంగంలో 1975లో తన కుటుంబ సభ్యుల హత్యను గుర్తు చేసుకుంటూ హసీనా భావోద్వేగానికి గురయ్యారు. తన తండ్రి షేక్ ముజిబుర్ రెహ్మాన్‌తో పాటు 1971విమోచన పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు నివాళలర్పించారు. ఇప్పుడున్న బంగ్లాదేశ్ తాము సృష్టించింది కాదని, గత రెండేళ్లుగా బంగ్లాదేశ్‌లో కష్టాలు పెరిగాయని అన్నారు. తాను దేశానికి దూరంగా ఉన్నా, ప్రజలకు ఎన్నడూ దూరంగా లేనని, తన కుటుంబం బంగ్లాదేశ్ కోసం పోరాడిందని చెప్పారు. మహ్మద్ యూనస్ పోలీసుల్ని చంపిన హంతకులకు క్షమాభిక్ష ప్రసాదించారని చెప్పారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీ వర్గాలపై దాడులు, న్యాయమూర్తులపై దాడులు చేశారని ఆమె అన్నారు. షేక్ హసీనా రెండేళ్ల తర్వాత తొలిసారి మౌనం వీడి బహిరంగంగా మాట్లాడారు. 2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్ విడిచి భారత్ వచ్చిన ఆమె న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ ప్రసంగం సందర్భంగా ఆమె చాలా సార్లు కన్నీరు పెట్టుకున్నారు. షేక్ హసీనా తర్వాత పాలనాధికారం చేపట్టిన తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనస్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు ముందే పక్కా ప్రణాళికను రూపొందించినట్లు ఆరోపించారు. ఈ కుట్ర నిజాన్ని మహ్మద్ యూనసే స్వయంగా బయటపెట్టారని అన్నారు. ఎన్నికైన తన ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు వ్యవస్థీకృత రాజకీయ వర్గాలు పనిచేశాయని ఆరోపించారు. చివరకు ఈ ఉద్యమం తనను పదవి నుంచి తొలగించాలనే ఏకైక లక్ష్యంతో కొనసాగిందని పేర్కొన్నారు. విద్యార్థి ఉద్యమాన్ని అడ్డంగా పెట్టుకుని బ్యాలెట్‌కు వెలుపల అధికారాన్ని చేజిక్కించుకోవాలనే ప్రయత్నం జరిగిందని విమర్శించారు.ఉద్యమం సమయంలో తనపై తప్పుడు ప్రచారం విస్తృతంగా సాగిందని హసీనా ఆరోపించారు. తప్పుడు సమాచారంతో ప్రజాభిప్రాయాన్ని తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా మళ్లించారని చెప్పారు. ఏ రాజకీయ పార్టీ లేదా సంస్థ పేరును ప్రస్తావించకపోయినా, దుష్ప్రచారం వల్లే పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయని వ్యాఖ్యానించారు.సంక్షోభం మొత్తం కాలంలో తమ ప్రభుత్వం చర్చలకే ప్రాధాన్యత ఇచ్చిందని, ఉద్యమం చాలా ముందుగానే రాజకీయ ప్రయోజనాల కోసం దారి మళ్లించబడిందని ఆమె పునరుద్ఘాటించారు. నన్ను జైలుకు పంపవచ్చు.. చంపేయవచ్చు కూడా. అయినప్పటికీ నా ప్రజల మధ్యకే తిరిగి వస్తాను. వారితో కలిసి ఉంటానని హసీనా భావోద్వేగంగా అన్నారు.దేశ ప్రజలు తీవ్ర కష్టాలు అనుభవిస్తున్నారని, వారి బాధను ఇకపై చూస్తూ ఉండలేనని చెబుతూ తాను స్వదేశానికి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నానని వెల్లడించారు. డిసెంబర్ మా విజయ మాసం. అందుకే డిసెంబర్‌లోనే బంగ్లాదేశ్‌కు తిరిగి రావాలని అనుకుంటున్నాను. ఆ ప్రయాణంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.తన తండ్రి, బంగ్లాదేశ్ వ్యవస్థాపక నాయకుడు బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్‌ను స్మరించుకుంటూ హసీనా భావోద్వేగానికి లోనయ్యారు. 1975 ఆగస్టు 15న జరిగిన సైనిక తిరుగుబాటులో ముజిబుర్ రహ్మాన్‌తో పాటు తన కుటుంబ సభ్యులను కోల్పోయిన విషాదాన్ని గుర్తుచేసుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు.'పస్తుత సంక్షోభంపై మాట్లాడే ముందు జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు, స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగం చేసిన 30 లక్షల మంది అమరవీరులకు నా ఘన నివాళులు అర్పిస్తున్నాను. అలాగే 1975 ఆగస్టు 15న కోల్పోయిన నా కుటుంబ సభ్యులను తీవ్ర విషాదంతో స్మరించుకుంటున్నానని ఆమె అన్నారు. తనను దేశం విడిచి వెళ్లేలా బలవంతం చేసినప్పటికీ, ప్రజలతో తన బంధాన్ని ఎవరూ తెంచలేకపోయారని హసీనా వ్యాఖ్యానించారు.దేశంలో రాజకీయ వేధింపుల పరంపర కొనసాగుతోందని, అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తలు హత్యలు, అదృశ్యాలు, అక్రమ అరెస్టులకు గురవుతున్నారని ఆమె ఆరోపించారు. స్వాతంత్ర్య సమర స్ఫూర్తిని సమర్థించే వారెవరూ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో సురక్షితంగా లేరని హసీనా ఆందోళన వ్యక్తం చేశారు.

# సాగులో డిజిటల్ విప్లవం

>> ఉపయోగించేందుకు రైతులు ముందుగా ఆధార్ నంబర్‌తో నమోదు చేసుకోవాలి. ఓటీపీ ద్వారా ధృవీకరణ పూర్తయ్యాక భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంట, అవసరమైన ఎరువుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం సమీపంలోని ఎరువుల డీలర్‌ను ఎంపిక చేసుకుని అవసరమైన ఎరువులను బుక్ చేసుకోవచ్చు. బుకింగ్ పూర్తయ్యాక క్యూఆర్ కోడ్‌తో పాటు నిర్ధారణ సందేశం మొబైల్‌కు వస్తుంది. ఆ క్యూఆర్ కోడ్‌ను డీలర్‌కు చూపించి ఎరువులు తీసుకోవాల్సి ఉంటుంది. కొత్త యాప్‌లో మరో ముఖ్యమైన సౌకర్యం కూడా ఉండనుంది. రైతులకు సమీపంలోని ఎరువుల దుకాణాల్లో ఏ ఎరువు ఎంత పరిమాణంలో అందుబాటులో ఉందో ముందుగానే తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో స్టాక్ లేని దుకాణాలకు వెళ్లి సమయం వృథా చేసుకోవాల్సిన అవసరం ఉండదు. అవసరమైన ఎరువు ఎక్కడ ఉందో తెలుసుకుని నేరుగా అక్కడే బుక్ చేసుకునే వీలుంటుంది. ఎరువుల పంపిణీని పర్యవేక్షి ంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అమలు చేస్తోంది.
రాష్ట్రాల వారీగా ఎరువుల అవసరాన్ని అంచనా వేయడం, సబ్సిడీ నిర్వహణ, నిల్వల పర్యవేక్షణ, కొరత నివారణ, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను నియంత్రించడంలో ఈ వ్యవస్థ కీలకంగా పనిచేస్తోంది. ఇప్పుడు తీసుకొస్తున్న కొత్త యాప్‌ను కూడా ఈ వ్యవస్థతో అనుసంధానం చేయాలని కేంద్రం భావిస్తోంది. కాగా తెలంగాణలో ప్రస్తుతం యూరియా పంపిణీ కోసం ప్రత్యేకంగా యూరియా యాప్ అమల్లో ఉంది. ప్రారంభంలో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురైనా, తర్వాత యూరియా పంపిణీని క్రమబద్ధీకరించడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషించింది. రైతులు అవసరమైన యూరియాను సులభంగా పొందేందుకు ఈ విధానం ఉపయోగపడిందని అధికారులు చెబుతున్నారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి చిరునామా ప్రొఫెసర్ జయశంకర్

### ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:**తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడు, తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను తెలంగాణ సమాజం ఎప్పటికీ గౌరవంగా స్మరించుకుంటుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఆగస్టు6న ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆ మహనీయులు తెలంగాణ స్వరాష్ట్ర సాధనకు ఆయన అందించిన విశిష్ట సేవలను ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ స్వప్నాన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా మార్చుకుని చివరిశ్వాస వరకు ఉద్యమించిన మహోన్నత వ్యక్తి జయశంకర్ సార్ అని సీఎం అన్నారు. తెలంగాణే ధ్యేయంగా, తెలంగాణే లక్ష్యంగా ఆ మహనీయుడు తన జీవితాన్ని అంకితంచేశారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణప్రాంతానికి జరిగిన అన్యాయాలను, ప్రజలు ఎదుర్కొన్న వివక్షనుగణాంకాలతో సహా దేశానికి వివరించి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఆరు దశాబ్దాల పాటు సజీవంగా నిలిపిన ఘనత ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కే దక్కుతుందని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన అందించిన సిద్ధాంత బలం, దిశానిర్దేశం చిరస్మరణీయమని, ఆయన ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని అన్నారు.

## ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి రెండు రోజుల పోలీసు కస్టడీ

# నేటి నుంచి విచారణ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టయి చంచల్ గూడ జైల్లో వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి రెండు రోజుల పోలీసు కస్టడీ ఇస్తూ ఉప్పర్‌పల్లి కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఉదయ్ కృష్ణారెడ్డిని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలని ఈ కేసును విచారిస్తున్న అత్తాపూర్ పోలీసులు కోరగా దీనిని డిఫెన్స్ న్యాయవాది వ్యతిరేకించారు. సహచర ట్రైనీ మహిళా అధికారిపై లైంగిక వేధింపులతో పాటు మరో ఇద్దరు మహిళలను కూడా ఉదయ్ కృష్ణారెడ్డి ఇదే విధ ంగా వేధించినట్లు పిపి కోర్టుకు తెలిపారు. అశోక్‌నగర్‌లో అతని గదిలో దీనికి సంబంధించి కొన్ని ఆధారాలు లభ్యమయ్యాయని, బాధితుల వాంగ్మూలం కూడా వుందని ఆయన వెల్లడించారు. ఇరువర్గాల వాదనలు విన్న ఉప్పర్‌పల్లి కోర్టు ఉదయ్ కృష్ణారెడ్డిని రెండు రోజుల పోలీసు కస్టడీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం నాడు అతన్ని పోలీసులు చంచల్‌గూడ జైలు నుంచి కస్టడీలోకి తీసుకుని అత్తాపూర్ పోలీసు స్టేషన్ తో పాటు మహిళా భద్రతా విభాగం కార్యాలయంలో విచారించనున్నారు. దీంతో పాటు అశోక్‌నగర్‌లోని అతను వుండే గది వద్దకు తీసుకువెళ్లి విచారించే వీలుంది. శుక్రవారం సాయంత్రం అతన్ని తిరిగి జైలుకు తరలించనున్నారు. మరోవైపు జాతీయ పోలీసు అకాడమి అధికారులు ఇచ్చిన నోటీసులకు ఉదయ్ కృష్ణారెడ్డి సరైన సమాధానం ఇవ్వలేదని తెలిసింది. తాను ఎలాంటి తప్పులు చేయలేదని, తనపై అనవసరంగా కేసు న మోదు చేశారని తన న్యాయవాదితో ఉదయ్ కృష్ణారెడ్డి సమాధానం పంపినట్లు తెలిసింది. దీనిపై అకాడమి అధికారులు మౌనం వహించారు.

## యంగ్ ఇండియా పోలీసు స్కూల్ పనులు వేగవంతం చేయాలి: డిజిపి ఆనంద్

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** నగర శివార్లలోని మణికొండలో కొత్తగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా పోలీసు స్కూల్ పనులను వేగవం తం చేయాలని డిజిపి ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నత ఆశయంతో నిర్మిస్తున్న ఈ స్కూల్ దేశానికే రోల్‌మాడల్‌గా నిలవాలని ఆ యన ఆకాక్షించారు. యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణ పనులను డిజిపి ఆనంద్ తన సతీమణి లలితతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ సొసైటీ కమిటీ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసు విద్యార్థుల కోసం ఏర్పాటు చేస్తున్న ఈ స్కూల్ భవిష్య త్తులో ఎందరో ఉత్తమ విద్యార్థులను అందించాలని అన్నారు. ప్రపంచస్థాయి విద్యను అందించేందుకు ఈ స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయ న తెలిపారు. ఒక్క విద్య మాత్రమే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, దేశభక్తి, సేవాబావం, సామాజిక బాధ్యత, క్రీడలు, ప్రపంచ విజ్ఞా నం అందించడం దీని లక్ష్యమని ఆయన అన్నారు. యువత డ్రగ్స్ బారిన పడుతుండడం ఆందోళనకరంగా మారుతున్న ఈ సమ యంలో పాఠ శాలలో విద్యార్థులకు బోధించే విద్య ఎంతో కీలకంగా మారుతుందని డిజిపి తెలిపారు. స్కూల్ పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో వుంటే తనకు పంపాలని ఆయన ఆదేశించారు. సీనియర్ పోలీసు అధికారులు ఈ స్కూల్‌ను తరచూ సందర్శించి విద్యార్థులకు మార్గ నిర్దేశం చేయాలని ఆయన సూచించారు. మొదటి సంవత్సరంలో ఈ స్కూల్‌లో 125 మంది వుండగా ఇప్పుడు ఆరవ తరగతి వరకు పెరగడంతో ఈ సంఖ్య 345కు పెరిగిందని డిజిపి తెలిపారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల డిజి మహేష్ భగవత్, ఆక్టోపస్ డిజి అనిల్ కుమార్. పి అండ్ ఎల్ ఐజి గజారావు భూపా ల్, సైబరాబాద్ కొత్వాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ కృషిని, త్యాగాలను స్మరించుకున్న కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:**తెలంగాణ భావజాల వ్యాప్తికోసం జీవితాంతం కృషి చేసిన సిద్ధాంతకర్త, స్వయం పాలన స్వాప్నికుడు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి (ఆగస్టు 6) సందర్భంగా, మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్ రావు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన కృషిని, త్యాగాలను, వారితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్ర సాధనకోసం తాను రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి వంటరి పోరాటం చేస్తున్న సందర్భంలో, తన సలహాలు సూచనలతో జయశంకర్ సార్ తనకు అండగా నిలిచారని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. తనవ్యక్తిగత కుటుంబ జీవితాన్ని త్యాగం చేసి, సైద్ధాంతిక నిబద్ధతతో రాష్ట్రసాధనోద్యమం కోసంభావజాల వ్యాప్తి చేసారని ఈ సందర్భంగా కీర్తించారు. నాటి వారి అస్తిత్వ ఆలోచనా విధానం తెలంగాణకు ఎల్లకాలం స్ఫూర్తిదాయకమేనని కేసీఆర్ స్పష్టంచేశారు. ప్రొఫెసర్ జయశంకర్ త్యాగాలను కృషిని గుర్తించిన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాల్లో భూపాలపెల్లి జిల్లాకు వారి పేరు పెట్టుకున్నామన్నారు. తెలం గాణ యువత నిత్యం ప్రజలను చైతన్యం చేయడం ద్వారా మాత్రమే ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగించిన వారమోతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

### పెట్టుబడుల మోసం కేసులో పట్టుబడ్డ విశాఖ రాథోడ్

## దుబాయ్ నుంచి భారత్‌కు తరలించిన సిబిఐ

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:**కోట్లాది రూపాయల పెట్టుబడుల మోసం కేసులో మూడేళ్లుగా పరారీలో వున్న వాంటెడ్ క్రిమినల్ విశాఖ రాథోడ్ ఎట్టకేలకు పట్టుబడింది. ఈ కేసులో ఈమె భర్త అవినాష్ రాథోడ్‌ను ఇంతకు ముందే దుబాయ్ నుంచి తరలించగా తాజాగా విశాఖ రా థోడ్‌ను ఇదే క్రమంలో దుబాయ్‌లో పట్టుకుని భారత్‌కు తీసుకువచ్చారు. దీంతో ఈ కేసు విచారణ వేగం పుంజుకోనుంది. మహారాష్ట్రలోని పూ ణెకు చెందిన అవినాష్ రాథోడ్, విశాఖరాథోడ్ దంపతులు 2023లో పెట్టుబడుల పేరిట దేశ వ్యాప్తంగా అనేక మందిని 88కోట్ల రూపాయలకు పైగా మోసం చేశారు. తాము సూచించిన కంపెనీల్లో పెట్టుబడులు పెడితే దండిగా లాభాలు వస్తాయని నమ్మించి వందలాది మ ందిని వీరు నిం డా ముంచారు. ఈ దంపతులు చెప్పినట్లుగా పెట్టుబడులు పెట్టిన వారు నిండా మునిగిన తరువాత పూణెలోని చతుర్‌శ్రింగి పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. దీని తరువాత ఈ అవినాష్ రాథోడ్, విశాఖ రాథోడ్ దంపతులు పారిపోయారు. వీరి కోసం దేశ వ్యాప్తంగా గాలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ కేసు తీవ్రత దృష్ట్యా సిబిఐ రంగంలో దిగింది. చివరకు వీరు దుబాయ్‌లో వున్నట్లు సమాచారం అందుకున్న సిబిఐ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. అనంతరం గత ఏప్రిల్ నెలలో అవినాష్ రాథోడ్‌ను విదేశాంగ శాఖ సహకారంతో దుబాయ్‌లో అ రెస్టు చేసి భారత్‌కు తరలించారు. తాజాగా వారం రోజుల విశాఖ రాథోడ్‌ను కూడా దుబాయ్ నుంచి అరెస్టు చేసి తీసుకువచ్చారు. వీరు దోచిన డబ్బులను తమ సొంత అవసరాలకు వాడుకున్నట్లు మహారాష్ట్ర పోలీసులు తేల్చారు.

# రాష్ట్రంలో ఆశాజనకంగా రుతుపవనాలు

### వానలతో మారిన వర్షాభావ పరిస్థితులు

### ఇప్పటి వరకూ 37.7 సెంటీమీటర్లు వర్షపాతం

### ఈ సీజనులో సాధారణ వర్షపాతం 39.63 సెంటీమీటర్లు

### అత్యధికంగా కామారెడ్డిలో 57.96 సెంటీమీటర్లు

### నాలుగు జిల్లాల్లో మాత్రమే 34 నుండి 40 శాతం లోటు

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** తెలంగాణలో నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా కొనసాగుతున్నాయి. జూన్ 1 నుంచి బుధవారం వరకు రాష్ట్రంలో సగటు సాధారణ వర్షపాతం 39.63 సెంటీమీటర్లు నమోదవ్వాల్సి ఉండగా, 37.70 సెంటీమీర్లు నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం కేవలం ఇప్పటివరకు కేవలం 5 శాతం మాత్రమే లోటుతో సాధారణ స్థాయిలోనే ఉంది. జూన్ ఆరంభం, జూలై మొదటి వారంలో కొంత నిరాశ పరిచినా, జూలై రెండో భాగంలో బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండం వల్ల రాష్ట్రవ్యాప్తంగా మంచి వర్షాలు కురిశాయి. దీంతో వర్షపాతం లోటు గణనీయంగా తగ్గింది. ఫలితంగా రాష్ట్రంలో లోటు ఉన్న జిల్లాలు 27 నుండి కేవలం 9 జిల్లాలకే పరిమితమైంది. అది కూడా 34 శాతం నుండి 48 శాతం లోటు ఉన్న జిల్లాల్లో మల్కాజిగిరిలో సాధారణ వర్షపాతం 30.34 సెంటీమీటర్లకు గాను 20.13 సెంటీమీర్లు, వరంగల్‌లో 47.25 సెంటీమీటర్లకు 26.60 సెంటీమీటర్లు, హన్మకొండలో 44.82 సెంటీమీటర్లకు 24.10 సెంటీమీటర్లు, జనగామ జిల్లాలో సాధారణ వర్షపాతం 35.61 సెంటీమీటర్లకు 48 శాతం లోటుతో 18.69 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. ఇక నాలుగు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా,రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లాల్లో సాధారణం కంటే మించి 33 శాతంతో అగ్రస్థానంలో ఉంది. ఈ జిల్లాలో సాధారణ వర్షపాతం 43.48 సెంటీమీటర్లకుగాను, 57.96 సెంటీమీటర్లు కురిసింది. ఇక ఈ నెలలో సాధారణం, అంతకన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అతి కొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 6 నుండి 12వ తేదీ మధ్య తెలంగాణలో నైరుతి రుతుపవనాలు మరింత పుంజుకుంటాయని అంచనావేసింది. వారం మధ్యలో వాయువ్య,దాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో ఒకకొత్త అల్పపీడన ప్రాంతం ఏర్పడనుందని తెలిపింది. ఇది భూ భాగంలోకి చొచ్చుకురావడంతో తెలంగాణ వ్యాప్తంగా చెదురుమదురు నుండి విస్తారంగా వర్షాలు కురిపించే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

# ప్రజలకు మోడీ, అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

### ప్రశాంత్ కిషోర్ గెలుపు బిజెపికి చెంపపెట్టు

### సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు




బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బి.వి.రాఘవులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 5** కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన చలో పార్లమెంట్ సందర్భంగా జెన్‌జీపై పోలీసులు లాఠీలు ఝళిపించడం, పిల్లెట్లను ప్రయోగిం చడం దారుణమనీ, ఈ విషయంలో యువతకు, దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు డిమాండ్ చేశారు. జెన్‌జీ ఉద్య మంలో పాల్గొన్న విద్యార్థులను క్షమిస్తున్నానని మోడీ అనడం విద్యా ర్థులను అవమానిం చడమేనన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతితో కలిసి రాఘవులు మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యల మీద చర్చించేందుకు కాకుండా ప్రతిపక్ష పార్టీల ఎంపీ లను చీల్చి గత సమా వేశాల్లో వీగిపోయిన బిల్లులను ఆమోదించు కోవడానికి పార్లమెంట్ సమావేశాలు పెట్టినట్టు ఉందని విమర్శించారు. చలో పార్లమెంట్ సం దర్భంగా జరిగిన ఘటనలపైనా, విద్యార్థులపై జరిగిన దాడులపైనా కనీసం చర్చించేందుకు అధికార ఎన్‌డీఏ కూటమి ముందుకు రాకపోవడం దారుణమన్నారు. విద్యార్థులపై దాడులకు పాల్పడింది ఎవరు? పెల్లెట్లు ప్రయోగించాల్సి న అవసరమేమిటీ? ఆ ఘటనకు ఆదే శాలు జారీ చేసిందెవరు? అనే దానిపై చర్చే లేదన్నారు. పార్లమెంట్ సమావేశాలకు రాకుండా అమిత్‌షా మొహం చాటేయడాన్ని రాఘవులు తప్పుబట్టారు. జెన్‌జీ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను క్షమిస్తున్నామని ప్రధాని మోడీ ప్రకటన చేయడం అంటే విద్యార్థుల పోరాటాన్ని అవమానించడమేనన్నారు. డీలిమిటేషన్ మహిళా బిల్లును కలిపి పెట్టినందుకే ప్రతిపక్షాలు వ్యతిరేకించాయన్నారు. కేవలం మహిళా బిల్లునే విడిగా ప్రవేశపెట్టేందుకు ముందుకు వస్తే అన్ని పక్షాలు మద్దతు తెలుపుతాయని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 10న తలపెట్టిన జైల్‌భరోకు మద్దతిస్తున్నామనీ, ఆ నిరసనల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీహార్ ఉప ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ గెలుపు బీజేపీకి చెంపపెట్టన్నారు. దేశంలోని యువతరం బీజేపీ విధానాలను వ్యతిరేకి స్తున్నదనీ, మతం, రాముని పేరుతో రాజకీయాలు ఎల్లకాలం సాగవని తెలిపారు. ప్రధాని మోడీ మెప్పు కోసం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విలపించినట్టు ఉందని విమర్శించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వల్ల 20 మంది విద్యార్థులు చనిపోయినప్పుడు, లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు బాధపడ్డప్పుడు ఎందుకు ఏడుపు రాలేదని ప్రశ్నించారు. ప్రజలకు విద్యావైద్యాన్ని ఉచితంగా అందించేలా పాలకులపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పోరాటాలు చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. విద్యావైద్య రంగాలను పరిరక్షి ంచడంలో భాగంగా వాటిని ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో 85 శాతం మంది పిల్లలను తల్లిదండ్రులు ప్రయివేటు స్కూళ్లలో చదివిస్తు న్నారనీ, కొత్త ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయకపోవడమే కారణమని తెలిపారు. తక్కువలో తక్కువగా ఏటా ఒక్కో విద్యార్థిపై తల్లిదండ్రులు రూ.50 వేల వరకు ఖర్చుపెట్టాల్సి రావడం భారంగా మారిందని చెప్పారు. తక్షణమే రాష్ట్రంలో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీ కోసం నిరుద్యోగ యువత చేస్తున్న పోరాటాలకు తమ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. 20 వేల కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెలు వేసుకున్న పేదలకు ఇండ్ల స్థలాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టిచ్చేదాకా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలనీ, లేకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికే నష్టమని హెచ్చరించారు.

# సహకార బ్యాంకింగ్‌లో సంస్కరణలు

### రుణ పర్యవేక్షణా విధానం నవీకరణ

### రుణాల వడ్డీ రేట్లకు ఏకీకృత నియంత్రణ

### ఫ్రేమ్‌వర్క్ అమలుకు మార్గదర్శకాలు

### రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** సహకార రంగంలో గత 18 సంవత్సరాలుగా వచ్చిన నిర్మాణాత్మక, నియంత్రణ మార్పులకు అనుగుణంగా గ్రామీణ సహకార బ్యాంకుల రుణ పర్యవేక్షణ విధానాన్ని నవీకరించేందకు సంస్కరణలు అమలు చేయాలని రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. సహకార బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ చర్యలను ప్రకటించింది. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ముగింపు సమావేశంలో బుధవారం ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వీటివివరాలను వెల్లడించారు. రుణరేట్లలో పారదర్శకతను మెరుగుపరచడం, వినియోగదారుల రక్షణను పెంపొందించడం కోసం, అన్ని నియంత్రిత సంస్థలలో రుణాలపై వడ్డీ రేట్ల కోసం ఒక ఏకీకృత నియంత్రణ చట్రాన్ని కూడా ప్రతిపాదించినట్లు తెలిపారు. సహకార బ్యాంకింగ్ రంగం కోసం తీసుకుం టున్న చర్యలలో భాగంగా, లైసెన్సి ంగ్ ఫ్రేమ్ వర్క్‌పై గతంలో విడుదల చేసిన చర్చా పత్రంపై అందిన అభిప్రాయాల ఆధారంగా, పట్టణ సహకార బ్యాంకుల (యూసీబీ) లైసెన్సి ంగ్‌ను పునఃప్రారంభించేందుకు ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, 2008లో చివరిసారిగా సవరించబడిన గ్రామీణ సహకార బ్యాంకుల రుణ పర్యవేక్షణ ఏర్పాటుపై సమగ్ర సమీక్ష చేపట్టిన అనంతరం కేంద్ర బ్యాంకు ముసాయిదా ఆదేశాలను కూడా జారీ చేస్తుందన్నారు.సంవత్సరాలుగా పొందిన అనుభవంతో పాటు, ప్రస్తుత వ్యవస్థను అమలులోకి తెచ్చినప్పటి నుండి బ్యాంకింగ్ రంగంలో జరిగిన పరిణామాలను కూడా ఈ సమీక్ష పరిగణనలోకి తీసుకుంటుందని తెలిపారు. గత 18 ఏళ్లుగా ఈ రంగంలో వచ్చిన నిర్మాణాత్మక మరియు నియంత్రణ మార్పులకు అనుగుణంగా గ్రామీణ సహకార బ్యాంకుల రుణ పర్యవేక్షణ విధానాన్ని నవీకరించడమే లక్ష్యంగా వెల్లడించారు. దీనికి అదనంగా, అన్ని నియంత్రిత సంస్థలలో రుణాలపై వడ్డీ రేట్లను నియంత్రించే నియంత్రణ విధానాన్ని సమన్వయం చేసి, ప్రామాణీక రించాలని నిర్ణయించినట్లు వివరించారు.యూసీబీ లైసెన్సిం గ్‌పై చర్చలో వచ్చిన అభిప్రాయాల ఆధారంగా, పట్టణ సహకార బ్యాంకుల లైసెన్సి ంగ్‌ను పునఃప్రారంభించడానికి ఆర్‌బిఐ ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేస్తుందని మల్హోత్రా పేర్కొన్నారు. రుణ రేట్లలో పారదర్శకతను మెరుగుపరచడం, రుణ విధానాలలో మరింత స్థిరత్వాన్ని నిర్ధారించడం మరియు వినియోగదారుల రక్షణను బలోపేతం చేయడం ఈ చర్య యొక్క లక్ష్యంగా పేర్కొన్నారు.

# ఎర్రసముద్రంలో కార్గోనౌకపై దాడి

### సముద్రంలో మునిగిపోయిన నౌక..

### భారత్ నావికులు సురక్షితం

**సనా,ఆగస్టు 5:** యెమెన్ తీరానికి సమీపంలోని ఎర్ర సముద్రంలో భారత్‌కు చెందిన కార్గో నౌకపై ప్రొజెక్టైల్‌తో దాడి జరగడంతో నౌక బోల్తా పడి సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘటనలో నౌకలో ఉన్న మొత్తం 14 మంది సిబ్బందిని యెమెన్ కోస్ట్ గార్డ్ సురక్షితంగా రక్షించింది. వారిలో 13 మంది భారతీయ నావికులు ఉన్నారు. రక్షించిన సిబ్బందిని మోఖా పోర్టుకు తరలించారు. భారత్‌కు చెందిన వాణిజ్య నౌక ఎంఎస్‌వి ఫైజ్ నూర్ ఒలియాపై జరిగిన దాడిని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈనెల 4న యెమెన్ తీరానికి సమీపంలోని ఎర్ర సముద్రంలో నౌక మునిగిపోయిందని విదేశాంగశాఖ వెల్లడించింది. నౌకలో ఉన్న 13 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు తెలిపింది. సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని, నౌక సిబ్బంది భద్రత కోసం యెమెన్ అధికారులతో సమన్వయం చేస్తోందని లీనితి పేర్కొంది. సిబ్బందిని సురక్షితంగా రక్షించినందుకు యెమెన్ అధికారులకు భారత ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది.

ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై వరుసగా జరుగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని విదేశాంగశాఖ తెలిపింది. అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత, ఎలాంటి ఆటంకాలు లేని నౌకాయానం, వాణిజ్యం కొనసాగేందుకు పరిస్థితులను పునరుద్ధరించాల్సి న అవసరం ఉందని పేర్కొంది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని స్పష్టం చేసింది. భారతీయ

**నావికుల భద్రతపై కేంద్రం దృష్టి**

కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఈ ఘటనపై స్పందించారు. ఈ ప్రాంతంలో ఉన్న భారతీయ నావికుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మారిటైమ్ అడ్మినిస్ట్రేషన్‌ను ఆదేశించినట్లు తెలిపారు. అన్ని సంబంధిత సంస్థలతో సమన్వయం చేసుకుంటూ భారతీయ నావికుల భద్రతను నిర్ధారించాలని, రక్షించిన సిబ్బందికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు.

వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖం డించింది. అంతర్జాతీయ సముద్ర రవాణా భద్ర తను కాపాడటంతో పాటు ప్రపంచ వాణిజ్యానికి ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని పక్షాలు తమ అంతర్జాతీయ బాధ్యతలను పాటించాలని విదేశాంగశాఖ పిలుపునిచ్చింది.

## ఢిల్లీలో బండి సంజయ్ నివాసానికి వెళ్లిన ఎంపి ఈటల రాజేందర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఆగస్టు5:**ఢిల్లీలో కేంద్రమంత్రి బండి సంజయ్ నివాసానికి ఎంపీ ఈటల రాజేందర్ వెళ్లారు. లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలతో కలిసి లంచ్ మీటింగ్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా మంచి సంభాషణలు కొత్త ఆలోచనలకు దారితీస్తాయంటూ బండి సంజయ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈటలతో భేటీ ఫొటోలను ఎక్స్‌లో పంచుకున్నారు.

# తెలంగాణలో ఎరువుల కొరత లేదు

### యూరియా వినియోగంలో దేశంలోనే కీలకం

### కేంద్ర ఎరువుల, రసాయనాల మంత్రి అనుప్రియా పటేల్

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎరువుల కొరత లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఖరీఫ్2026 సీజన్‌కు సంబంధించి రాష్ట్రానికి అవసరమైన మేరకు ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. యూరియా, ఎన్‌పీకే ఎరువుల నిల్వలు అవసరానికి మించి ఉన్నాయని పేర్కొంది. రాజ్యసభలో బుధవారం కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రతి పంట సీజన్‌కు ముందే రాష్ట్రాల వారీగా ఎరువుల అవసరాన్ని అంచనా వేసి సరఫరా ప్రణాళికను రూపొందిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి నెలల వారీగా ఎరువుల అవసరాలను అంచనా వేస్తుందని, ఆ ఆధారంగా ఎరువుల శాఖ యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్‌పీకే ఎరువుల సరఫరా ప్రణాళికను సిద్ధం చేస్తుందని వివరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఖరీఫ్2026 సీజన్‌లో తెలంగాణతో పాటు, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో యూరియా, డీఏపీ, ఎంఓపీ, ఎన్‌పీకే ఎరువుల లభ్యత తగినంతగా ఉందని కేంద్రం పేర్కొంది. రాష్ట్రాల్లో జిల్లా, మండల స్థాయిలో ఎరువుల పంపిణీ బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని తెలిపింది. తెలంగాణ నిల్వల వివరాలను వెల్లడిస్తూ జూలై నెలాఖరు నాటికి రాష్ట్రంలో యూరియా అవసరం 7.40 లక్షల టన్నులు కాగా, లభ్యత 8.05 లక్షల టన్నులుగా ఉంది. ఇందులో 4.49 లక్షల టన్నులు విక్రయాలు జరగగా, 3.56 లక్షల టన్నులు నిల్వలు మిగిలి ఉన్నాయి. అలాగే డీఏపీ అవసరం 2.07 లక్షల టన్నులు కాగా, లభ్యత 2.03 లక్షల టన్నులుగా ఉందని పేర్కొంది. అవసరానికి దాదాపు సమానంగా సరఫరా ఉన్నట్లు కేంద్ర గణాంకాలు వెల్లడించాయి. ఇప్పటివరకు 1.72 లక్షల టన్నుల డీఏపీ విక్రయాలు జరిగాయి. ఎంఓపీ ఎరువు విషయంలో రాష్ట్ర అవసరం 59 వేల టన్నులు కాగా, లభ్యత 56 వేల టన్నులుగా ఉంది. విక్రయాలకు సంబంధించి 16 వేల టన్నులు జరగ్గా, 40 వేల టన్నుల నిల్వలున్నాయి. ఎన్‌పీకే తెలంగాణకు అవసరమైన 7.37 లక్షల టన్నులకు మించి 7.86 లక్షల టన్నుల లభ్యత ఉంది. ఇప్పటివరకు 4.71 లక్షల టన్నుల విక్రయాలు జరగగా, 3.13 లక్షల టన్నుల నిల్వలు ఉన్నట్లు కేంద్రం వెల్లడించింది. కాగా యూరియా వినియోగంలో తెలంగాణ దేశంలోని కీలక రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. రాష్ట్ర అవసరం 7.40 లక్షల టన్నులు కాగా, ఇది ఆంధ్రప్రదేశ్ (3.80 లక్షల టన్నులు), తమిళనాడు (2.80 లక్షల టన్నులు), ఒడిశా (3.11 లక్షల టన్నులు) కంటే ముందుంది.అయితే, ఉత్తరప్రదేశ్, పంజాబ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల కంటే తక్కువగా ఉంది. ఎన్‌పీకే ఎరువుల వినియోగంలోనూ తెలంగాణ ముందంజలో ఉంది. రాష్ట్ర అవసరం 7.37 లక్షల టన్నులు ఉండగా, ఆంధ్రప్రదేశ్ (2.21 లక్షల టన్నులు), తమిళనాడు (2.80 లక్షల టన్నులు), ఒడిశా (1.90 లక్షల టన్నులు) కంటే గణనీయంగా ఎక్కువగా ఉందని కేంద్ర ఎరువుల మంత్రి అనుప్రియ వెల్లడించారు.




### భారత్-రష్యా స్నేహ సంబంధాల వేదికగా

## వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయం : మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:**హైదరాబాద్‌లో వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయాన్ని బుధవారం తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క, వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ హెడ్ డాక్టర్ రాయల నీతు నాయుడు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, భారత్-రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహం పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి నిదర్శనమని అన్నారు. స్వాతంత్రం అనంతరం భారతదేశ పారిశ్రామికాభివృద్ధి, ఉక్కు కర్మాగారాలు, భారీ పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటులో అప్పటి సోవియట్ యూనియన్ అందించిన సహకారం చిరస్మరణీయమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక విధుల భావనకు కూడా సోవియట్ రాజ్యాంగం ప్రేరణగా నిలిచిందని గుర్తుచేశారు. రక్షణ, విజ్ఞానం, అంతరిక్షం, సాంకేతికత, ఇంధనం, విద్య వంటి అనేక రంగాల్లో భారత్-రష్యా సంబంధాలు మరింత బలపడుతున్నాయని మంత్రి తెలిపారు. మహిళలకు రాజకీయ, సామాజిక జీవితంలో సముచిత స్థానం కల్పించడంలో రష్యా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల బలోపేతం, మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, ఉపాధి అవకాశాల కల్పన, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. వరల్డ్ పీపుల్స్ అసెంబ్లీ ప్రతినిధి కార్యాలయం ఏర్పాటుతో విద్య, వైద్యం, వ్యాపారం, పర్యాటకం, సంస్కృతి, పరిశోధన, ఆవిష్కరణలు, ప్రజల మధ్య పరస్పర సహకారం వంటి రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ చారిత్రక వారసత్వంతో పాటు సాంకేతిక రంగంలో ప్రపంచ గుర్తింపు పొందిన నగరమని పేర్కొన్న మంత్రి, ఈ కార్యాలయం భారతదేశం-రష్యా ప్రజల మధ్య మరింత సాన్నిహిత్యాన్ని పెంపొందించే వేదికగా నిలవాలని ఆకాంక్షి ంచారు. అంతర్జాతీయ స్నేహం, శాంతి, అభివృద్ధి, సాంస్కృతిక అవగాహనకు దోహదపడే ప్రతి కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన మహనీయుడు గద్దర్: సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:**తెలంగాణ ప్రజా గాయకుడు, ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతి (ఆగస్టు 6) సందర్భంగా ఆయన సేవలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వకంగా స్మరించుకున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి గద్దర్ ప్రాణం పోసిన మహనీయుడని, ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో నిత్యం రగిలించిన అసామాన్య ప్రజాకవిగా ఆయనను కొనియాడారు. గద్దర్‌తో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. పేద కుటుంబంలో జన్మించిన గద్దర్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించినప్పటికీ, ఉన్నత ఉద్యోగాల కోసం కాకుండా సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేశారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతి మనిషికి కూడు, గూడు, నీడ దక్కాలనే మహోన్నత లక్ష్యంతో జీవితాంతం పాటనే ఆయుధంగా మార్చుకుని ప్రజల్లో చైతన్యం నింపారని అన్నారు.తెలంగాణ మలిదశ ఉద్యమానికి ఊపిరి పోసిన ప్రముఖుల్లో గద్దర్ అగ్రస్థానంలో నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పలు ఉద్యమ వేదికలను నిర్మిస్తూ తెలంగాణ ఆకాంక్షను గ్రామాగ్రామానికీ తీసుకెళ్లారని, ఎన్ని కష్టాలు, ఒడిదుడుకులు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. తన గళాన్ని గర్జనగా, పాటను తూటాగా మార్చి ప్రజల హక్కుల కోసం పోరాడిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని అభివర్ణించారు. గద్దర్ అందించిన సాంస్కృతిక, సాహిత్య సేవలకు గౌరవ సూచకంగా ఆయన పేరుతో తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ఏర్పాటు చేసి, సినీ కళాకారులు, సినీ ప్రముఖులకు ప్రదానం చేశామని ముఖ్యమంత్రి తెలిపారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
మెట్రో జోన్, మింట్ కాంపౌండ్:: హైదరాబాద్-63
టెండర్ నోటీసు నెం : 11/26-27 (పత్రిక ప్రకటన)
2026-27 యొక్క Spec No. eMZ-17(NEW), 18(New), 15 (Ext-II) & 16 (Ext-II) యొక్క ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్
... TGSRTC ... (eMZ-15/26-27) (Ext-II) ... TGSRTC ... (eMZ-16/26-27) (Ext-II) ...
www.tender.telangana.gov.in మరియు www.tgsouthernpower.org ...
సం/-. చీఫ్ ఇంజినీర్, ఆపరేషన్, మెట్రో జోన్, హైదరాబాద్.
DIPR.NO. 7365-PP/CL/ADVT/1/2026-27 తేది: 05.08.2026

వార్త

ఆరోగ్యం, మంచి శరీరం బంగారం కంటే మించినవి. మంచి మనసు అంతులేని సంపద కంటే విలువైనది.

- ఎమర్సన్

# వలసలకేదీ దారి?

చరిత్రలో వలసలు, వలస రాజ్యాల ఊసులు మనకు కొత్తమీ కాదు. కానీ ఆధునిక ప్రపంచంలో కూడా ఎందరో తామున్న చోట దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించలేక హుటాహుటిన మరో ప్రాంతానికి తరలివెళ్లడమే విచిత్రం. నాలుగు రోజుల నాడు మొరాకో నుంచి స్పెయిన్‌లోకి దాదాపు అరవై వేల మంది శరణార్థులు వలస వచ్చారు. ఒక్కొక్కరుగా వస్తే తెలిసేది కాదు. ఒకేసారి మిడతల దండులా స్పెయిన్ మీద పడటమే వారిని ఇబ్బందులపాల్జేసింది. ఇదే ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వాళ్లు ఎలాంటి పరిస్థితుల్లో వచ్చారో ఆలోచించడం మానిస్పెయిన్ పాలకులు అవాక్కయ్యారు. అంతేకాదు ఏమిచేయాలోపాలుపోని పరిస్థితులలో స్పెయిన్ దళాలు కాల్పులు కూడా జరిపాయి. ఈ హఠాత్పరిణామానికి హతాశులై అటు ఇటూ పరుగెట్టిన వలసదారులు 72 మంది మరణించారని అంచనా. అలా వెళ్లిన వారిలో సుమారు 45 వేల మందికి పైగా మొరాకోవాసులు తిరిగిస్పెయిన్‌కు వెళ్లిపోయారు. ఇలా వలసల ధాటికి యూరప్ ఎంతో ఆందోళన చెందుతోంది. ఈ విషయమై యూరోపియన్ యూనియన్ స్పెయిన్‌లోని సెయూటాగరంలోకి చొరబడిన మొరాకో వాసుల సంఖ్యను బట్టి చూస్తే ఆ నగర జనాభాలో దాదాపు 70 శాతం మంది ఉన్నారు. వారందరినీ స్పెయిన్ యువత తీవ్రంగానే అడ్డుకొంది. సముద్రతీరం నుంచి పర్వత ప్రాంతమైన సరిహద్దు దాటి కూడా వాళ్లు వలసవచ్చేశారు. పడవల్లో ఎందరో ప్రయాసతో వచ్చి చేరుకున్నారు. అయినా స్పెయిన్‌లో పరిస్థితులు సానుకూలపడక నరకయాతన అనుభవించారు. సముద్రంలో ఈదుకుంటూ వచ్చిన వారిలో సుమారు 100 మంది మరణించారు. వలసదారుల్ని అదుపు చేయడంలో స్పెయిన్ దళాలు వాటర్ కెనాన్‌లు, బాష్పవాయు ప్రయోగాలు, కొన్ని సందర్భాల్లో కాల్పులకు తెగబడ్డారు. ఈ తొక్కిసలాటలో చనిపోయిన వారెందరో, ప్రాణాలకు తెగించి అయిదు గంటలపాటు సముద్రాన్ని ఈదుకొంటూ వచ్చినా స్పెయిన్ భద్రతా దళాలు ఆటంకపరచడమే కాకుండా సెయూటాలో తమకు ఆశ్రయమే కాదు ఆహారం, నీరు కూడా లభించలేదని కొందరు మొరాకో వాసులు ఆవేదన వెలిబుచ్చిన సందర్భాలు కూడా గోచరించాయి. చెప్పాలంటే మొరాకో వాసులపై ఎన్నో దాష్టీకాలే జరిగాయి. యూరోపియన్ యూనియన్‌కు ఆది నుంచీ వలసదారుల బెడద ఎక్కువగానే ఉంది. ఆఫ్రికా దేశాలతో అస్థిరత, అంతర్యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాల కారణంగా వేలాదిమంది శరణార్థులు, వలసదారులు యూరప్‌వైపు పరుగులు తీస్తున్నారు. దాంతో ఆఫ్రికా శరణార్థులను నీచంగా చూస్తూ యూరప్ దేశాలు తీసుకుంటున్న నిరోధక చర్యలు ఎంతో ఇబ్బందికరంగా పరిణమిస్తున్నాయి. వలసదారుల భారాన్ని గ్రీస్, ఇటలీ, స్పెయిన్ వంటి సరిహద్దు దేశాలుమాత్రమే మోయలేవు కనుక పదేళ్లనాడే దాదాపు యూరోపియన్ దేశాలన్నీ ఒక ప్రణాళికను రూపొందించుకుంది. ఆ మేరకు అన్ని దేశాలు శరణార్థుల్ని నేరుగా స్వాగతించాలి. కానీ చాలా యూరప్ దేశాలు అందుకు భిన్నంగా అనుసరించే వైఖరి వలసదారులకు ప్రాణాంతకమౌతోంది. ఆఫ్రికా దేశాలు ఏమంత సంపన్నదేశాలు కావు. అలాఅని అభివృద్ధి చెందిన దేశాలు కావు. ఆ కారణం చేత అక్కడ జీవన పరిస్థితులు దుర్భరమైనప్పుడు సరిహద్దు దేశాల్లోకి వలసలు వచ్చేస్తున్నారు. సరిహద్దు దేశాలంటే అతిసమీపంలో ఉన్నా ఎంతో శ్రమకోర్చి అక్కడికి చేరుకోవాల్సిందే. గత్యంతరం లేకనే ఈ వలసలు. ఈ 'సాలిడారిటీ' పథకం కింద శరణార్థులను స్వాగతించలేకపోయినట్లయితే వారికి భారీ మొత్తంలోఆర్థిక వితరణ అందించాలి. అవేమీ లేకుండానే తాజా వలసదారులపై స్పెయిన్ కొరడా ఝుళిపించింది. కనీస ఆతిథ్య మర్యాదలలో భాగంగా మంచినీరు కూడా అందించలేకపోయింది. సరిహద్దుల రక్షణ ఎంతముఖ్యమో, శరణార్థుల పట్ల మానవతా దృక్పథం చూపించడమూ అంతే ముఖ్యం. కానీ ఈ రెండు అంశాల మధ్య యూరోపియన్ యూనియన్ నలిగిపోతోంది. మానవ హక్కుల ఉల్లంఘనలో హంగేరి, పోలాండ్ వంటిదేశాలు కూడా స్పెయిన్ వంటి యూరోపియన్ దేశాల చర్యలకు వంత పాడుతున్నాయి. ఈయుకు వెలుపలనున్న మొరాకో వంటి దేశాలతో సత్సంబంధాలుమంచి వేనని, అదే సమయంలో స్పెయిన్‌లో అక్రమ ప్రవేశాలను కట్టుదిట్టం చేయడం అవసరమని బుధవారం జరిగిన యూరోపియన్ యూనియన్ దేశాల ఐక్యతా సమావేశం నిర్ణయించింది. ఆయా దేశాల భద్రతా చర్యలతోపాటు వలసదారుల పట్ల మానవ హక్కుల పరిరక్షణకూడా ప్రాధాన్యత నివ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి. ఉత్తర ఆఫ్రికాలోని ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక అసంతృప్తి, ఐరోపా వలస విధానాల పరిమితులపై అవగాహన, ఇరుదేశాల మధ్య ఉండే దౌత్యసంబంధాల సంక్లిష్టతలను మెరుగుపరుచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. స్వదేశంలో అవకాశాల కొరత, జీవన భద్రతలో సమస్యలు ఏర్పడి నప్పుడే వలసల సమస్య ఏర్పడ్తుందని అన్నిదేశాలు గుర్తించదగినది. మొరాకో,స్పెయిన్‌ల మధ్య వలసల సంక్షోభం సరిహద్దుల భద్రతకే కాదు,మానవత్వానికే పరీక్ష అన్న ధోరణిలో శరణార్థుల పట్ల సుహృద్భావ ధోరణితో వ్యవహరించడానికి అన్ని కట్టుబాట్లు సిద్ధం చేసుకునేందుకు యూరోపియన్ యూనియన్ ముందుకొచ్చింది. అనేకమంది యువత మెరుగైన జీవితంకోసం ప్రాణాలను పణంగా పెట్టడమంటే స్వదేశంలో వారికి అవకాశాలకొరత ఎంత బలీయంగా ఉందో తెలుస్తుంది. పైగా వలసల వ్యవహారంలో కొన్ని మానవ అక్రమరవాణా ముఠాలు ప్రేరేపణలపైకన్నేసి ఉంచాలని, ఇప్పటికే తమదేశాల్లో అపరిచితుల్లా ఉండిపోయిన శరణార్థులను బలప్రయోగంలేకుండా తిప్పిపంపడంపై శ్రద్ధవహించే దిశగా ఆయాదేశాలు పయనిస్తున్నాయి. వలసలకుమూల కారణాలను అన్వేషించి పరిష్క రించే సమగ్ర విధానాలే ఈ తరహా సంక్షోభాలకు శాశ్వత పరిష్కారం చూపగలవు.

సలహా ఇచ్చేటప్పుడు విచక్షణ పాటించాలి. స్వీకరించేటప్పుడు వినమ్రంగా ఉండాలి.



స్వామి వివేకానంద

సోమరిలా, బలహీనంగా నూరేళ్లు బతకడం కన్నా, దృఢసంకల్పంతో కొద్ది కాలమైనా జీవించడం ఉత్తమం.



అరిస్టాటిల్

## ప్రజావాక్కు



### అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం

ఉత్తరాంధ్ర అభివృద్ధి చరిత్రలో భోగాపురంలో నిర్మితమైన అల్లూరి సీతారామరాజు గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఒక కీలక ఘట్టం. రాజకీయాలకుఅతీతంగా ఈవిమానాశ్రయం ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతానికి దీర్ఘకాలిక ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేయనుంది. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు పేరును ఈ విమానాశ్రయానికి ఇవ్వడం చారిత్రకంగా సముచిత నిర్ణయం. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఇదికొత్తఆర్థిక ద్వారంగా మారనుంది. పర్యాటక రంగానికి ఊత మివ్వడంతో పాటు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు, ఔషధ పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగం, లాజి స్టిక్స్, గిడ్డంగుల ఏర్పాటు, విమానయాన అనుబంధ పరిశ్రమల విస్తరణకు ఇది విశేష అవకాశాలు కల్పిస్తుంది. ఉద్యోగాలసృష్టితోపాటుపెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధిఅవకాశాలను పెంచేసామర్థ్యంఉంది.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అందరి ప్రాణాలు ఫోన్‌లోనే..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పని చేయుచున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల కోసం, విద్యార్థిని విద్యార్థుల కోసం లీప్ యాప్ ప్రవేశపెట్టింది. అందరి హాజరుతో పాటు, వార్షిక పరీక్షల్లో వచ్చిన మార్కులు, టెస్టులలో వచ్చిన మార్కులు, అసెస్మెంట్ చేసినప్పుడు వచ్చిన మార్కులు, కరికులర్ కోరికులర్ ఎక్స్ట్రా క్యులర్ యాక్టివిటీస్ అన్ని నమోదు చేసే విధంగా హోలిస్టిక్ ప్రెస్ కార్డును కూడా ప్రవేశపెట్టింది. అయితే బైజుస్ కంటెంట్‌కి బదులుగా క్లికర్స్ అనే కంటెంట్‌ని ఉపయోగించమని అధికారులకు సూచించారు. ఇది డేంజర్ యాప్.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### నీటి వృథాను అరికట్టాలి

తెలంగాణ కాంగ్రెసు ప్రభుత్వం తమ ప్రాబల్యంగల ప్రాంతాలను అశాస్త్రీయంగా గ్రేటర్ హైదరాబాద్‌లో కలుపుతూ గ్రేటర్‌పై ఆధిపత్యానికి పాకులాడ్తోందని బిజెపి రాష్ట్ర చీఫ్ అన్నట్లు పత్రికల్లో వచ్చింది. మున్సిపాలిటీలలో అంతటా విలువైన వర్షపునీరే కాక జలమండలిచే శుద్ధి చేయబడిన తాగునీరు పైపుల లీకేజీ ద్వారా రోడ్లపైకి వచ్చి మ్యాన్‌మోల్స్ ద్వారా డ్రైనేజీలో కలిసిపోతున్నాయి. ఈ నీటి వృథాను అరికట్టాలి.

-వి.ఆర్.ఆర్.ఎ.రాజు, హైదరాబాద్

### ఉత్తుత్తి మాటలేనా..

ముఖ్యమంత్రి గారూ తిరుపతిజిల్లా, ప్రకాశం జిల్లాలలో కల్కి, దొంగస్వామీ ప్రభుత్వ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో మోసంచేస్తుంటే, రెవెన్యూ అధికారులు దొంగ స్వాములకు సాష్టాంగ పడుతున్నారు. మీరు జోక్యం చేసుకోరా? ప్రభుత్వ భూములాక్రమిస్తే జైలే గతి అన్నారు కదా. ఉత్తుత్తి మాటలేనా? తిరుపతి జిల్లాలో కల్కి దళితుల అసైన్డ్ భూములు, అటవీ భూములు ఆక్రమించి ఆశ్రమం పేరుతో చెక్కభజనలు ,యజ్ఞాలు యాగాలు చేస్తున్నారు. అటవీ భూమిలో విదేశీయులను రప్పించి, అటవీ నిబంధనలకు వ్యతిరేకంగా రాత్రుళ్ళు భజనలు చేస్తున్నారు. కల్కి పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. బాధ్యతారహితంగా రెవెన్యూ యంత్రాగం ఉంది. అదేవిధంగా ప్రకాశం జిల్లాలో దొంగ రామదూత కూడా కోట్లాది రుపాయల చెరువు పోరంబోకు ఆక్రమించి దీక్షలు చేస్తున్నారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ2021లో దొంగస్వామి ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. ఇంత వరకు అతీగతిలేదు. మీరేమో ఆక్రమిస్తే జైలే అంటున్నారు. అధికారులేమో దాసోహం అంటున్నారు. మీరు జోక్యం చేసుకొని ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### కుంటల తవ్వకంతో చేపల పెంపకం

తెలంగాణ ప్రభుత్వం నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో చేపట్టిన జలసిరి కార్యక్రమంలో పంట కుంటలు తవ్వించాలి అని నిర్ణయించారు. ఒక రకంగా ఇది రాజస్థాన్ మోడల్ అయినా తెలంగాణకు సరిపోయే మోడల్ ఇది. ఒక తెలంగాణకు మాత్రమే కాదు భూ పరివేష్టిత రాష్ట్రాలన్నింటికి సరిపోయే మోడల్ ఇది. తెలంగాణలో సగటు కమతం పరిమాణం తక్కువ కాబట్టి 8..8ఫారం పొండ్స్‌ని ఎక్కువ మొత్తంలోచేయాలి. తెలంగాణలో ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 75 వేల చెరువులు నూతన ఆర్థిక విధానాలు అభివృద్ధి పేరుతో కల్లోలం అయినాక మిగిలిన 46531 చెరువులలో పూడికపనులు అయినాక చేపలపెంపకం ఎక్కువ అయింది.

- భారత అవినాష్, జనగామ

### దళితుల భూములను అభివృద్ధి చేయాలి

తెలంగాణ రాష్ట్రంలో అధిక పేద సామాజిక వర్గమైన షెడ్యూల్ కులాల వ్యవసాయ భూములను, బావులను అభివృద్ధి చేయవలసిన అవసరంఉంది. షెడ్యూల్ కులాల కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్, డిపార్టుమెంట్‌ల పర్యవేక్షణలో రాష్ట్ర వార్షిక బడ్జెట్ నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# ఉచిత వైద్యసేవలే ప్రజలకిచ్చే వరం

**ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా పేషంట్ల మెడికల్ హిస్టరీని ట్రాక్‌చేసే విధానాన్ని ఎక్కువగా పబ్లిక్ ప్రైవేట్ ఇన్స్టిట్యూట్స్‌లో చేపట్టే హెల్త్ మేనేజ్మెంట్ విధానాన్ని అవలంభించాలి! డ్రగ్ క్వాలిటీ రెగ్యులేషన్లను తప్పక పాటించాలి! కొత్త కొత్త విధానాలతో రెగ్యులేషన్లను అప్డేట్ చేసుకోవాలి! తక్కువ స్థాయి లో ఉత్పత్తిచేసే మాన్యుఫ్యాక్చర్ సంస్థలను నిరంతర తనిఖీల ద్వారా అదుపులో వుంచాలి! సబ్ స్టాండర్డ్ మాన్యుఫ్యాక్చరర్లను శిక్షించాలి! ప్రజా ఆరోగ్య విధానాలు ఎన్నో పాటించగులుగుతేనే ప్రభుత్వాలు, మెడికల్ సంస్థలూ ఆసుపత్రుల ద్వారా రోగులకూ వ్యాధిగ్రస్తులకు నిరంతర సేవను చేసేందుకు ఆస్కారం వుంటుంది! అన్నిటికంటే మించి ఉచిత వైద్య సౌకర్యం ప్రభుత్వాలు కల్పించగలిగితే అంతకంటే మించిన వైద్య సేవ మరొకటి వుండదు! అప్పుడే డాక్టరును ప్రజలు 'దేవుడి'గా భావిస్తారు!**



రావులపాటి సీతారాంరావు

ప్రజారోగ్య విధానాలు నిర్దిష్టంగా రూపొందించటం ప్రతి ప్రభుత్వం ప్రథమ కర్తవ్యం! అయితే విధానాల రూపకల్పన ఆర్థిక శక్తి మీద ఆధారపడి వుంది! ఆర్థిక పురోగతి సాధించిన దేశాలలో ప్రజారోగ్యం ప్రాథమిక అవసరంగా గుర్తించటం వల్ల చాలావరకు ప్రభుత్వమే ఉచిత ఆరోగ్య సేవలు అందజేస్తున్నది! సరాసరి తలసరి ఆదాయం కొన్ని దేశాల్లో ఎక్కువగా వున్నప్పటికిని, ఆ దేశ లెక్కల ప్రకారం తక్కువగా వున్న క్రింది తరగతి ప్రజానీకానికి మరింతగా ఆరోగ్యం పట్ల ఖర్చు చేస్తున్నది! కోవిడ్ 19 పెండమిక్ ఈ విధానాలను దాదాపు ప్రతి దేశంలో దెబ్బ తీసింది! దానితో ఆరోగ్య విధానాలకు సహాయకారిగా వుండే 'డెవలప్మెంట్ అసిస్టెంన్స్ ఫర్ హెల్త్ (డి.ఎ.హెచ్) కోవిడ్ తర్వాత తగ్గు ముఖం పట్టింది! ప్రతి రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ప్రజారోగ్యం కోసం బడ్జెట్లో నిధులను కేటాయించటం జరుగుతుంది! వేరు వేరు శాఖలకు కేటాయించిన బడ్జెట్ నిధులను లెక్కిస్తే 'హెల్త్ కేర్'కు కేటాయించిన నిధులను ఖర్చుచేసే విధానాలలో ఈ మధ్య కాలంలో లోపాలు పెరుగుతున్నాయి! ప్రతి సంవత్సరం గ్లోబల్ వ్యవస్థలో అమెరికా, హెల్త్ కోసం ఇచ్చే సహాయం కోవిడ్19 తర్వాత దాదాపు 67 శాతం(ఫారిన్ అసిస్టెంన్స్ ప్రోగ్రాం)లో తగ్గించింది. అమెరికా మాదిరే యు.కె., ఫ్రాన్స్, జర్మనీ గూడా 39శాతం, 35 శాతం, 12 శాతం (దేశాల వరుసలో) తగ్గించాయి! దీంతో ప్రజారోగ్యానికి తోడ్పడే ఆర్థిక సహకారం తగ్గుముహం పట్టటంతో ఆరోగ్య పరిస్థితులు మన దేశంలో కూడా గడ్డు పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది! ఎంతకాలం ఇతర దేశాల సహాయ సహకారాల మీద కాలం గడుపుతాం? స్వయం కృషితో ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధి సాధనతో ఆరోగ్య విధానాలను పరిస్థితుల దృష్ట్యా మార్చుకుంటూ మెరుగుపర్చుకోక తప్పదు!. జాతీయ బడ్జెట్ కూడా కొన్ని పరిస్థితుల వల్ల (అంటే అప్పులు వడ్డీలు) అనుకున్నంతగా ఆరోగ్య వ్యవస్థకు ఆర్థిక సహకారం అందించలేకపోతున్నది! దాదాపు 102 ట్రిలియన్స్ 2024 లో వడ్డీ రికార్డు స్థాయికి గ్లోబల్ పబ్లిక్ డెత్ చేరుకుంది! అందుకోసమే ఉన్నంతలో ఆరోగ్య వ్యవస్థకు ఎక్కువ డబ్బు సమకూర్చక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఎంతయితే బడ్జెట్ ప్రకారం కేటాయించబడిందో ఆ మొత్తం డబ్బు ఆరోగ్య భద్రత కోసమే ఖర్చు పెట్టాలి! ఖర్చు అవసరమైన వాటి కోసమే పెట్టాలి. తక్కువ డబ్బు వెచ్చించటం వల్ల మన దేశ ప్రజల ఆరోగ్యాలను కాపాడటంలో వెనకడుగు వేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్



(ఎన్.హెచ్.ఎం) లెక్కల ప్రకారం అంటువ్యాధులు, అంటువ్యాధులు కాని ప్రోగ్రాంస్కు చెందాల్సిన డబ్బుల్లో కేవలం 26 శాతం మాత్రమే ఖర్చు చేయటం దారుణం! పాలసీలకు క్షేత్రస్థాయిలో అమలుకు భారతప్రభుత్వం నిర్దిష్టమైన సంస్థాగత, రెగ్యులేటరీ పర్యవేక్షణ ఆరోగ్య శాఖ విషయంలో అవసరంగా మారింది. వైద్య విద్యా విధానం కూడా దేశ మంతటా ఒకే మాదిరిగా తీర్చిదిద్దాలి! వైద్యులుగా బయట ప్రపంచంలోకి అడుగుపెట్టేవారు మౌలికమైన వృత్తి నైపుణ్యాన్ని నేర్చుకున్నారని స్పష్టమైన నమ్మకం ప్రభుత్వాలకూ ప్రజలకూ కలిగేందుకు 'నేషనల్ ఎగ్జిట్ టెస్ట్' అన్ని రాష్ట్రాలలోనూ నిర్వహించిన తర్వాతనే వారిని మెడికల్ గ్రాడ్యుయేట్సుగా గుర్తించాలి! చాలా మెడికల్ కాలేజీలు దేశమంతటా వెలుస్తున్నాయి! దానికి కారణం నేషనల్ మెడికల్ కమీషన్ (ఎన్.ఎమ్.సి) నిబంధనలను సడలించటం వల్ల! కొత్తగా వచ్చిన ఈ కాలేజీలలో కావల్సిన రీతిలో స్టాండర్డ్స్ అవలంబిస్తున్నారా లేదా అని మానిటరింగ్ చేయాలి! అంతేగాదు పేరుకే ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న 'ఘోస్ట్ ఫ్యాకల్టీ'ని కనిపెట్టేందుకు సరియైన చర్యలు క్షుణ్ణంగా తీసుకోవాలి! రీజనల్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాల్టీ ట్రైనింగ్ సీట్లను పెంచటం వల్ల లోకల్ డాక్టర్లు అందుబాటులో లేని సమస్యను పరిష్కరించినట్లవుతుంది! ఆయుష్మాన్ భారత్ (ఎబిపియంజే) ఎకో సిస్టమ్‌ను పెంచటం వల్ల అవుట్ పేషంట్ల కవరేజ్ ఎక్కువవుతుంది. ఆ పని సత్వరం చేపట్టాలి! ఈ సౌకర్యంతో ఎక్కువ మందికి మెడికల్ సదుపాయం కలుగుతుంది! ప్రాథమికంగా కేర్ తీసుకోవటంతో పాటు, ప్రివెంటివ్ చర్యలు గ్రామ సీమలలో ప్రైమరీ హెల్త్ సెంటర్ల ద్వారా చేపట్టాలి! ఆ చర్యల వల్ల పెద్ద హాస్పిటల్స్ చుట్టూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో తిరిగే వారి సంఖ్య తగ్గుతుంది! డ్రాఫ్ట్ నేషనల్ హెల్త్ రిసెర్చి పాలసీ 2026 ను త్వరితగతిన యాక్టుగాచేయాలి! పేషంట్లను దృష్టిలో పెట్టుకొనిపబ్లిక్ ఫండ్స్‌ను సమకూర్చాలి! కేవలం పబ్లిసిటీ చర్యలతో కార్యక్రమాలు తలపెట్టినట్లుగా పైపై కంటి తుడుపు చర్యలు మానేయాలి! వైద్యంలో కొత్త కొత్త ప్రయోగాలను పేషంట్లను ఆధారం చేసుకొని చేపట్టినట్లయితే సంతృప్తికర, ఉపయోగకరమైన ఫలితాలు రోగులకు రిలీఫ్ నిచ్చే విధంగా వుంటాయి. క్షేత్రస్థాయి ప్రయోగాలకు ఎక్కువ అవకాశాలు ఇవ్వాల్సిన సమయం ఆసన్నమయింది!ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా పేషంట్ల మెడికల్ హిస్టరీని ట్రాక్ చేసే విధానాన్ని ఎక్కువగా పబ్లిక్ ప్రైవేట్ ఇన్స్టిట్యూట్స్‌లో చేపట్టే హెల్త్ మేనేజ్మెంట్ విధానాన్ని అవలంభించాలి! డ్రగ్ క్వాలిటీ రెగ్యులేషన్లను తప్పక పాటించాలి! కొత్త కొత్త విధానాలతో రెగ్యులేషన్లను అప్డేట్ చేసుకోవాలి! తక్కువ స్థాయిలో ఉత్పత్తిచేసే మాన్యుఫ్యాక్చర్ సంస్థలను నిరంతర తనిఖీల ద్వారా అదుపులో వుంచాలి! సబ్ స్టాండర్డ్ మాన్యుఫ్యాక్చరర్లను శిక్షించాలి! ప్రజా ఆరోగ్య విధానాలు ఎన్నో పాటించగులుగుతేనే ప్రభుత్వాలు, మెడికల్ సంస్థలూ ఆసుపత్రుల ద్వారా రోగులకూ వ్యాధిగ్రస్తులకు నిరంతర సేవను చేసేందుకు ఆస్కారం వుంటుంది! అన్నిటికంటే మించిఉచిత వైద్య సౌకర్యం ప్రభుత్వాలు కల్పించగలిగితే అంతకంటే మించిన వైద్య సేవ మరొకటి వుండదు! అప్పుడే డాక్టరును ప్రజలు 'దేవుడి'గా భావిస్తారు! ●

# దేశ ప్రగతికి బాటలు వేస్తున్న 'ఆర్థికం'

ఇస్కా రాజేష్ బాబు

దేశీయ లావాదేవీలు సహా దిగుమతుల ద్వారా పన్ను వసూళ్లు పెరగడంతో జులైలో స్థూల జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గతేడాది జులైతో పోలిస్తే ఈ వసూళ్లు 15.4శాతం ఎక్కువని కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. సీజీఎస్టీ రూ.39,835 కోట్లు, ఎస్జీఎస్టీ రూ.47,881 కోట్లు, ఐజీఎస్టీ వసూళ్లు రూ.1,23,000 కోట్లుగా ఉన్నాయి. గతనెలలో రిఫండ్లు 13.1 శాతం పెరిగి రూ.29,968 కోట్లకు చేరుకున్నాయి. రిఫండ్లను మినహాయించిన అనంతరం నికర జీఎస్టీ ఆదాయం 1.81లక్షల కోట్లుగా ఉంది. దేశీయ వ్యాపార లావాదేవీలు ఊపందుకోవడం, విదేశాల నుంచి దిగుమతులు భారీగా పెరగడంతో భారత ఆర్థిక వ్యవస్థ మరోసారి తన బలాన్ని చాటుకుంది. జూలై నెలలో దేశవ్యాప్తంగా వస్తు, సేవల పన్ను వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లకు చేరుకుని కొత్త రికార్డు నమోదు చేశాయి. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 15.4 శాతం వృద్ధి నమోదవగా, గత 14 నెలల్లో ఇదే అత్యధిక వృద్ధి రేటు కావడం విశేషం. దిగుమతులపై వసూలైన జీఎస్టీ 28.8 శాతం పెరిగి రూ.66,511 కోట్లకు చేరగా, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ 10.1శాతం వృద్ధితో రూ.1.45లక్షల కోట్లుగా నమోదైంది. దేశంలో వినియోగం, వ్యాపార కార్యకలాపాలు మరింత బలపడుతున్నాయనే సంకేతాలను ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రెండోసారి రూ.2 లక్షల కోట్ల మార్కు. ఏప్రిల్‌లో రూ.2.43 లక్షల కోట్ల ఆల్‌టైమ్ రికార్డు నమోదైన తర్వాత, మేలో రూ.1.94 లక్షల కోట్లు, జూన్‌లో రూ.1.95లక్షల కోట్లు వసూలయ్యాయి. జూలైలో మళ్లీ రూ.2.11 లక్షల కోట్లతో రూ.2 లక్షల కోట్ల మార్కును దాటి మరోసారి రికార్డు సృష్టించింది. వ్యాపారులకు రూ.29,968 కోట్ల రిఫండ్లు చెల్లించిన తర్వాత ప్రభుత్వానికి వచ్చిన నికర జీఎస్టీ ఆదాయం రూ.1.81 లక్షల కోట్లు. ఇది గత ఏడాదితో పోలిస్తే 15.8 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులై వరకు మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ.8.43 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో వసూలైన రూ.7.66 లక్షల కోట్లతో పోలిస్తే 10.1శాతం వృద్ధి నమోదైంది. ఈ సారి జీఎస్టీ వృద్ధికి ప్రధాన కారణం దిగుమతులపై పన్ను వసూళ్లు భారీగా పెరగడమేనని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. అదే సమయంలో దేశీయ ఆర్థిక కార్యకలాపాలు కూడా బలంగా కొనసాగడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పెరిగింది. రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జీఎస్టీ వసూళ్లలో రెండంకెల వృద్ధిని నమోదు చేసి దేశంలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాయి. ఇది రెండు రాష్ట్రాల్లో ఆర్థిక కార్యకలాపాలు వేగంగా పెరుగుతున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నెల వారీ జీఎస్టీ ఆదాయ నివేదిక ప్రకారం, జులై నెలలో మొత్తం జీఎస్టీ వసూళ్లు రూ.2.11 లక్షల కోట్లకు చేరుకున్నాయి. గతేడాది జూలై నెలతో పోలిస్తే వార్షిక ప్రాతిపదికన 15.4 శాతం పెరుగుదల కనిపించింది. డొమెస్టిక్ ట్రాన్సాక్షన్స్, దిగుమతులకు సంబంధించిన ఆదాయం వలన జీఎస్టీ వసూళ్లు జోరు కొనసాగుతోందని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి. డొమెస్టిక్ ట్రాన్సాక్షన్స్ ద్వారా వచ్చిన గ్రాస్ జీఎస్టీ ఇన్‌కమ్, గత ఏడాది ఇదే నెలలో నమోదైన రూ.1.31లక్షల కోట్ల నుంచి 10.1శాతం పెరిగి, 2026 జూలైలో రూ. 1.45 లక్షల కోట్లకు చేరింది. దీని తోపాటు దిగుమతులపై వసూలైన జీఎస్టీలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. దిగుమతులకు సంబంధించిన జీఎస్టీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 28.8శాతం పెరిగి రూ.66,511 కోట్లకు చేరింది. ఇది ఆ నెలలో దేశం మొత్తం స్థూల జీఎస్టీ వసూళ్లను రూ.2.11 లక్షల కోట్లకు పెరిగేందుకు కారణమైంది. జూలై నెలలోప్రభుత్వం ఎక్కువ మొత్తంలో జీఎస్టీ రీఫండ్లను కూడా జారీ చేసింది. గత ఏడాదితో పోలిస్తే మొత్తం రీఫండ్లు 13.1 శాతం పెరిగి రూ. 29,968 కోట్లకు చేరాయి. ఈ రీఫండ్స్ విషయంలో ఎక్కువగా గణనీయంగా ఎగుమతిదారుల వాటా ఉంది. ఐస్‌గేట్ సిస్టమ్ ద్వారా ప్రాసెస్ చేయబడిన రీఫండ్స్ ఏడాదితో పోలిస్తే 22.7శాతం పెరిగి రూ. 12,288 కోట్లకు చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జీఎస్టీరీఫండ్స్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.81 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇది జూలై 2025తో పోలిస్తే 15.8 శాతం పెరుగుదల. నెట్ డొమెస్టిక్ రెవెన్యూ 10.5 శాతం పెరిగి రూ. 1.27 లక్షల కోట్లకు చేరగా, నికర కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 30.3 శాతం భారీవృద్ధితో రూ.54,223 కోట్లకు పెరిగింది. కేంద్ర ఆర్థిక శాఖ తెలిపిన వివరాల ప్రకారం, గత ఏడాది ఏప్రిల్ నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.2.43 లక్షల కోట్లు వచ్చాయి. ఈ ఏడాదిలో దేశీ దిగుమతుల ద్వారా జీఎస్టీ రెవెన్యూ 28.8 శాతం పెరిగింది. దీంతో వరుసగా జీఎస్టీ వసూళ్లు పెరుగుతుండటం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి సంకేతమని నిపుణులు భావిస్తున్నారు. జీఎస్టీ వసూళ్లలో హరియాణా రాష్ట్రం అత్యధిక వృద్ధిని సాధించింది. పెద్ద రాష్ట్రాలతో పోల్చి హర్యానా రాష్ట్రం అత్యధిక వార్షిక వృద్ధి రేటును నమోదు చేసింది. గుజరాత్, తెలంగాణ రాష్ట్రాలు ఆ తర్వాత జాబితాలో ఉన్నాయి. జీఎస్టీ వసూళ్లలో 19శాతం వృద్ధిని నమోదు చేశాయి. పంజాబ్, కేరళ రాష్ట్రాలు 16 శాతం, ఉత్తరప్రదేశ్ జీఎస్టీ వసూళ్లలో 15 శాతం పెరుగుదలను నమోదుచేశాయి. జీఎస్టీ ఆదాయానికి దేశంలోనే అత్యధికంగా సహకరిస్తున్న మహారాష్ట్ర 13 శాతం వృద్ధిని నమోదు చేయగా, కర్ణాటక 12శాతం పెరుగుదలను నివేదించింది. ఢిల్లీలో జీఎస్టీ వసూళ్లు 8శాతం పెరిగాయి. జులై నెలలో జీఎస్టీ కింద నమోదైన ఆదాయం సీజీఎస్టీ రూ. 39,835 కోట్లు ఉండగా, రాష్ట్ర వస్తు, సేవలపన్ను ఎస్జీఎస్టీ రూ.47,881 కోట్లు, ఇంటిగ్రేటెడ్ ఐజీఎసీ వసూళ్లు రూ.1.23 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ●

# సనాతన ధర్మాచరణే అనుసరణీయం!



సరికొండ రవీంద్రనాథ్

భారతీయ జనతా పార్టీలో (బిజెపి)లో ఉన్న వారంతా సనాతనులు కాదు. అలాగే సనాతనులు అంతా బిజెపి వారు కాదు. కొంచెం స్పష్టంగా చెప్పాలంటే బిజెపి రాజకీయ పార్టీ. అనేక రకాలైనవారు, అనేక జీవన స్రవంతుల నుంచి వచ్చిన వారు, వేర్వేరు ప్రయోజనాలను ఆశించి వచ్చిన వారు ఆ పార్టీలో ఉన్నారు. వీరిలో సనాతన ధర్మాన్ని నమ్మని వారు, ఆచరించనివారు కూడా ఉన్నారు. అలాగే సనాతన ధర్మాన్ని నమ్మినవారు ఇతర పార్టీలలో కూడా ఉన్నారు. భారత దేశంలో సనాతన ధర్మం గొప్పతనం ఇది. దేశంలోని జీవితానికి ఇది అద్దం పడుతుంది. ఏ పార్టీవారైనా, కులం వారైనా సనాతన ధర్మం ఆచరణ విషయంలో ఏకాభిప్రాయంలోనే యుగాలుగా సహజీవనం సాగిస్తున్నారు. ఈ సజీవ స్రవంతిని మార్చే శక్తి ఏదీ ఇప్పటివరకూ జనించలేదు. సనాతన ధర్మం అంటే అనేక అభిప్రాయాలున్నాయి. వివేచనను, నేర్చుకున్న జ్ఞానాన్ని బట్టి సనాతనం అనే పదానికి నిర్వచనాలను వింటున్నాం, చూస్తున్నాం. ఎవరేం చెప్పినా పామరుల నుంచి పండితుల వరకూ హిందూ జీవన విధానం అంతా వేదాంత సారమైన సనాతనాన్నే అనుసరిస్తున్నారు. వేదాలు చదవని వారు సైతం తెలియకుండానే వేదాలు చెప్పే జీవన విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇదే హిందూ జీవన విధానం. మనకు తెలియని, తెలిసిన చరిత్రల హిందూ జీవన విధానం అనేక మార్పులకు, సంఘర్షణలకు లోనైంది. అనేక ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ యుద్ధాలను చూసింది. జీవన విధానాలకు సంబంధించిన అనేక అంతర్గత సంఘర్షణలకు లోనైంది. కానీ అన్నింటికి మూలమైన వేదాల సారం ఈ కాల చక్రాన్ని నియంత్రిస్తూ వస్తోంది. ప్రపంచంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయినప్పుడు. ఆకలి దప్పులతో అరాచకాలతో,నియంతృత్వాలతో రాక్షస పాలనలో ప్రపంచం జీవనం గతి తప్పినపుడు ప్రజలకు రుజుమార్గం చూపించడానికి ఒక అవతార పురుషుడు జన్మిస్తాడు. ఒక ప్రవక్త ఉదయిస్తాడు. సనాతన ధర్మంలో నాటి వేదాల నుంచి నేటి వరకూ ప్రపంచ గతిని, నాగరికతను సరైన మార్గంలో పెట్టడానికి సనాతన ధర్మంలో అవతారాలు ఉదయించడం కనిపిస్తుంది. ఒక్కో అవతారం ఆ యుగంలో ప్రజలకు సరైన మార్గనిర్దేశం చేయడాన్ని చూస్తాం. సంభవామి యుగే యుగే అని గీతలో కృష్ణుడు చెప్పడం ఈ సనాతన ధర్మానికి పతాక శీర్షిక అని చెప్పాలి. ఇప్పుడు సనాతన ధర్మంలో బిజెపి పాత్ర ఏంటన్న ప్రశ్న గురించి కొద్దిగా మాట్లాడుకుందాం. దేశంలో గతంలో రాజ్యాలను ఏలిన రాజులకు సనాతన ధర్మానికి మధ్య సంబంధంలాంటిదే ఇది కూడా. సనాతన ధర్మ చరిత్రను పరిశీలిస్తే బిజెపి సముద్రంలో నీటి బిందువులాంటిది. యుగయుగాల చరిత్ర గతిలో రాజులు వచ్చిపోయారు. రాజ్యాలు ఎన్నో మారిపోయాయి. సనాతన ధర్మాన్ని పాటించిన రాజుల మనుగడ సాధించారు. సనాతన ధర్మాన్ని అనుసరించిన రాజ్యాల చరిత్రలో నిలిచాయి. ఇప్పుడు ఆరెస్సెస్, బిజెపిలను హిందుత్వ పార్టీలు అంటున్నారు. తప్పు లేదు. హిందుత్వాన్ని అనుసరించే వారిని హిందువులు, భారత దేశంలో ఉన్నవారిని భారతీయులు అనేకదా అంటారు. చరిత్రలో ఇతర మతాల నుంచి సనాతన ధర్మాన్ని కాపాడుకోడానికి యుద్ధాలు చేసిన రాజులు, జాతిని కాపాడుకోడానికి ప్రాణాలు అర్పించిన అమరవీరులు ఉన్నారు. వాళ్లు యుద్ధాలు చేసి, త్యాగాలు చేయకపోతే భరతమాతకు మరో వీరపుత్రుడో, వరపుత్రికో జనించేవారు. సంభవామి యుగే యుగే అనుకున్నాం కదా! వారిలాగే ఈరోజు ఆరెస్సెస్, బిజెపిలు, విహెచ్ పిలు 'సనాతన ధర్మాన్ని కాపాడటానికి కృషి చేస్తున్నాం' అని చెబుతున్నాయి. వీరు చేస్తున్న కృషివల్ల భరతజాతి ఎంతవరకు తలెత్తుకుని నిలబడగలదో. భవిష్యత్తులో చరిత్ర చెప్పకనే చెబుతుంది. సమాజం నడతను మార్చే క్రమంలో అనేక తత్వశాస్త్రాలు పుట్టాయి. వీటిలో కొన్నింటిని తత్వ, ఆర్థిక శాస్త్రాలని, కొన్నింటిని మతాలని అంటున్నాం. వీటిలో సైన్స్ ఆధారంగా సమానత్వాన్ని బోధించే ఫిలాసఫీలు కూడా ఉన్నాయి. సైన్స్ భూమిపై జరిగే పరిణామాలకు వివరణ ఇవ్వగలదు. కాని పరిష్కారాలను సూచించలేదు. సాంఘిక, రాజకీయ జీవితం ఇలా ఉండాలని సైన్స్ నిర్దేశించలేదు. ఇక్కడ సైన్స్ ఫెయిల్యూర్ కనిపిస్తుంది. సైన్స్ శోధించలేనిది సనాతన ధర్మం చేయగలదు. విశ్వాన్ని సైతం యుగాల క్రితమే సనాతన ధర్మం శోధించింది. సత్యం కోసం రాజ్యాలను తృణప్రాయంగా త్యాగం చేసిన రాజులను సనాతన హిందువుల్లో చూస్తాం. ప్రపంచంలోని ఏ చరిత్రలోనూ ఈ ఉదాత్తత, ఔన్నత్యం కనిపించదు. పెద్దలను, గురువులను గౌరవించడం ఇక్కడే ఉంది. అలాగే కుటుంబ బంధాలు, అనుబంధాలు సనాతన ధర్మంలోనే కనిపిస్తాయి. అందుకే ఈ ధర్మానికి ప్రపంచంలో అంతటి విశిష్ట స్థానం ఉంది. సనాతన ధర్మం తనను తాను సంస్కరించుకోగలదు. ఒకనాడు భారత స్త్రీ వంటింటి కుందేలుగానే ఉండాలనే సంప్రదాయం ఉండేది. ఇప్పుడు కుటుంబాన్ని ముందుకు నడిపించడంలో స్త్రీ ముందు ఉంటోంది. ఈ మార్పును సనాతనధర్మం ప్రకృతి సహజంగానే స్వీకరించింది. నేడు ఈ భారతావనిలో స్త్రీని దేవతగానే పూజిస్తారు. ప్రకృతిలో సగమైన స్త్రీకి ఏ ఇతర దేశంలోనూ భారతజాతి ఇచ్చిన గౌరవం ఇవ్వడం లేదు. సైన్స్ ఒక్కటి కాదు, తత్వశాస్త్రం, ఖగోళ, ఆరోగ్య శాస్త్రాలతో సకల శాస్త్రాలతో మానవాళికి భవిష్య మార్గం చూపించే యుగధర్మం సనాతనం. సనాతన ధర్మాన్ని అధ్యయనం చేయడానికి పండితులకి జీవితకాలం సరిపోని గ్రంథాలున్నాయి. ఈమధ్య కాలంలో మతం గురించి, సనాతన ధర్మం గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. కారణం ఏంటి అన్న ప్రశ్నలు తలెత్తడం సహజం. ఇద్దరు వ్యక్తులు ఇరుగు పొరుగున ఉన్నారు. ఒక వ్యక్తి అదే పనిగా పక్కింటిపైకి రాళ్లు వేస్తున్నాడు. రెండో వ్యక్తి మనకెందుకులే అని కొంతకాలం మౌనంగా ఉన్నాడు. ఒక రోజు రెండో వ్యక్తి తనను రక్షించుకోడానికి రాళ్లు వేయడం మొదలు పెట్టాడు. ఘర్షణ మొదలైంది. ఇప్పుడు మనకు సోషల్ మీడియాలో ఈ యుద్ధమే కనిపిస్తోంది. సనాతన ధర్మాన్ని, చరిత్రను,సంస్కృతిని అవమానపరుస్తూ ఎవరు మాట్లాడినా కొన్ని తరాలవారు మౌనంగా, సహనంతో భరించారు. తమ దేవుళ్లను ఎవరుతూలనాడినా సహించారు. కానీ ఈ తరంలో ఆ సహనం కనిపించడం లేదు. జెన్‌జి తరం కదా! సనాతన ధర్మంపై దాడికి సరైన సమాధానం చెబుతున్నారు. అందుకే ఇంత కాలం తాము మాట్లాడిందే ధర్మమని ఏకపక్షంగా పిడివాదం చేసేవారు గుక్కపెట్టి సమాధానాలు వెదుక్కోవలసి వస్తోంది. ●

# పార్లమెంటుకు గైర్హాజరు కావొద్దు

**• సమావేశాలు సజావుగా సాగేందుకు కృషి చేయండి.. • నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనండి..**
**సభా సమయం వృథా చేయొద్దు • కొత్త ఎంపీలకు ప్రధాని మోడీ దిశానిర్దేశం**



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** వర్షాకాల సమావేశాల సందర్భంగా పార్లమెంటు సభ్యులతో తాను కొనసాగిస్తున్న సంప్రదింపులలో భాగంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బుధవారం తన అధికారిక నివాసంలో 37 మంది బిజెపి పార్లమెంటు సభ్యులతో అల్పాహార సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో వివిధ బిజెపి ఎంపిల బృందాలతో సమావేశమై అభిప్రాయాలను పంచుకోవడం, పరిపాలన, పార్లమెంటరీ వ్యవహారాలపై చర్చించడం, పార్టీలో సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి ప్రధాని ఆచరణలో భాగంగా ఈ అనధికారిక సమావేశం జరిగింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ అల్పాహార సమావేశంలో ప్రధాన మంత్రి మోడీ ఎంపిలతో తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. పలు అంశాలపై అనధికారిక చర్చలు జరిపారు. పార్లమెంట్ ఎటు వంటి ఆటంకాలు లేకుండా సజావుగా పనిచేయాలని ప్రధాని మోడీ ఎంపిలకు హితబోధ చేశారు. ప్రజా జీవితంలో తన అనుభవాన్ని పంచుకున్న మోడీ, ఎంపీలు పార్లమెంట్‌ను ఎంత తీవ్రంగా పరిగణించాలనే దానిపై మార్గదర్శనం చేశారని ఈ సమావేశం గురించి తెలిసిన వర్గాలు తెలిపాయి. ప్రతిరోజూ పార్లమెంట్ లైబ్రరీలో కనీసం ఒకటి లేదా రెండు గంటల సమయం గడపాలని ప్రధానమంత్రి ఎంపిలను ప్రోత్సహించారు. అంతేకాకుండా, యువతతో మమేకమవ్వాలని, తమ నియోజకవర్గాల్లో యువత, క్రీడా కార్యకలాపాలపై దృష్టి సారించి ఎంపి స్థానిక ప్రాంత అభివృద్ధి పథకాన్ని (ఎంపీల్యాడ్స్) చురుకుగా అమలు చేయాలని ఆయన వారిని ప్రోత్సహించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. పార్లమెంట్ సమావేశాలకు నిత్యం హాజరుకావాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ గైర్హాజరు కాకూడదని హితబోధ చేశారు. అలాగే నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని, పార్లమెంట్ సజావుగా పనిచేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి అజెండాను ముందుకు తీసుకెళ్లడానికి అర్థవంతమైన చర్చలు, సామూహిక ప్రయత్నాలు అవసరమని ఆయన నొక్కి చెప్పారు. హాజరైన వారిలో ఎన్‌సిపిఐ కూటమికి చెందిన బిజెపి ఎంపిలు, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నుండి బిజెపిలో చేరిన మాజీ నాయకులు, అలాగే పార్టీ సీనియర్ నాయకులు తరుణ్ చుగ్, వినోద్ తావ్డే, బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉన్నారు.

ఈ సమావేశానికి కొత్తగా ఎన్నికైన పార్టీ నాయకులు తరుణ్ చుగ్, వినోద్ తావ్డే, మాజీ ఆప్ నాయకులు స్వాతి మాలివాల్, రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్, విక్రమ్‌జీత్ సింగ్ సహానీ హాజరయ్యారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో అల్పాహార సమావేశం నిర్వహించడం గత కొన్నేళ్లుగా ప్రధానమంత్రి ఆచరిస్తున్న పద్ధతిలో భాగం. ఇది ఎంపిలకు ఆయనతో నేరుగా సంభాషించే అవకాశాన్ని కల్పిస్తుంది. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాకాల సమావేశాల నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. దీనివల్ల ప్రధానమంత్రి ఎంపిలతో చిన్న బృందాలుగా సమావేశమై, పాలన, నియోజకవర్గ స్థాయి సమస్యలు, ప్రజలకు చేరువయ్యేందుకు పార్టీ చేపట్టిన కార్యక్రమాలపై వారి నుంచి అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం కలుగుతుంది.

## 17నుంచి 3 రోజులు ప్రత్యేక సమావేశాలు!
### డీలిమిటేషన్, మహిళా బిల్లుల కోసం..

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో పలు అంతరాయాలు ఏర్పడి చాలా భాగం రద్దయినప్పటికీ, నరేంద్ర మోడీ ప్రభుత్వం తన అత్యంత ప్రతిష్టాత్మకమైన రెండు శాసన ప్రతిపాదనలను ఒకే ప్యాకేజీలో ముందుకు తీసుకెళ్లడానికి సిద్ధమవుతోంది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లు, మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లులను చేపట్టేందుకు, ఆగస్టు 13న వర్షాకాల సమావేశాలు ముగిసిన వెంటనే పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. అయితే, సమావేశాలు ముగిసిన తర్వాత పార్లమెంటును వాయిదా వేయకపోవచ్చు, తద్వారా ప్రభుత్వం స్వల్ప నోటీసుతో దానిని తిరిగి సమావేశపరచడానికి వీలు కలుగుతుంది. రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడానికి అవసరమైన మూడింట రెండువంతుల మెజారిటీని సాధించేందుకు కేంద్రం కృషిచేస్తోందని సంబంధిత వర్గాలుతెలిపాయి.

131వ రాజ్యాంగ సవరణ బిల్లులో భాగంగా మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు, ఏప్రిల్‌లో నిర్వ హించినన మూడు రోజుల ప్రత్యేక సమావేశంలో లోక్‌సభలో అవసరమైన మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీని సాధించడంలో విఫలమైంది. మే నెలలో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నిక లలో టిఎంసి ఘోర పరాజయం తర్వాత ఉభయ సభలలోనూ బిజెపి స్థానం బలపడింది. ప్రత్యేక మెజారిటీకి లోక్‌సభలో 360మంది ఎంపిలు, రాజ్యసభలో 164మంది ఎంపిలు అవసరంకాగా, ఆ సంఖ్యలకు దూరంతగ్గింది. అదే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, తన ఇండియా కూటమి మిత్రపక్షమైన కాంగ్రెస్‌తో ఎంకె స్టాలిన్‌కు ఏర్పడిన విభేదాలనేపథ్యంలో, పార్లమెంటు ఉభయ సభలలో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ అవసరమయ్యే రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదింపజేసుకునే అవకాశాలను మెరుగుపరుచుకోవడానికి బిజెపి కూడా డిఎంకెకు చెందిన 22 మంది లోక్‌సభ ఎంపిల మద్దతుపై దృష్టి సారించింది.




# స్వతంత్ర దేశంగా ప్రకటించిన బలూచిస్థాన్

## 11న స్వాతంత్ర్య దినోత్సవం

**క్వెట్టా, ఆగస్టు 5:** పాకిస్థాన్ నుంచి విడిపోయామని తనకు తాను ప్రకటించుకున్న బలూచిస్తాన్ ఈనెల 11వ తేదీని బలూచిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవంగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు తెలిపింది. ఇక నుంచి తమది స్వతంత్ర దేశమని దాని పేరు రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ అని పేర్కొంది. ఈ క్రమంలోనే ప్రపంచం లోని అన్ని దేశాల్లోఉన్న బలూచ్ ప్రజలు ఆగస్ట్ 11వ తేదీని ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించు కోవాలని పిలుపునిచ్చింది. అలాగే అంతర్జాతీయ సమాజం తమను స్వతంత్ర, సార్వభౌమ దేశంగా గుర్తించాలని కోరింది. ఈ క్రమంలోనే సోమవారం విడుదలచేసిన ఈ ప్రకటనలో బలూచ్ విముక్తి ఉద్యమ నేత మీర్ యార్ బలూచ్ కీలకవ్యాఖ్యలు చేశారు. ప్రతి బలూచ్ కుటుంబం తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, ప్రజా ప్రదేశాల్లో స్వతంత్ర బలూచిస్తాన్ జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. ఈ చారిత్రక దినం ప్రాముఖ్యతను భావితరాలకు తెలియజేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ ప్రకారం 1947 ఆగస్ట్ 11వ తేదీన బ్రిటిష్ పాలన ముగిసే సమయంలో బలూచిస్తాన్ స్వాతంత్ర్యాన్ని ప్రకటించిందని పేర్కొంది. ఆ ప్రకటనను అప్పటి అంతర్జాతీయ మీడియా, ఆల్ ఇండియా రేడియో కూడా ప్రచురించాయని తమ వాదనలో తెలిపింది. అందుకే ప్రతీ యేడాది ఆగస్ట్ 11వ తేదీనే తమ స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహిస్తామని స్పష్టం చేసింది. 1948లో బలూచిస్థాన్‌ను పాకిస్థాన్ బలవంతంగా విలీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రకటనలో పాకిస్థాన్ విధానాలపై మీర్ యార్ బలూచ్ తీవ్ర విమర్శలు చేశారు. కాశ్మీర్ సమస్య, 1948లో బలూచిస్తాన్‌పై సైనిక చర్య, 1971లో తూర్పు పాకిస్థాన్ విభజన, సోవియట్ అఫ్గాన్ యుద్ధం, చగాయ్ అణు పరీక్షలు, సెప్టెంబర్ 11వ తేదీ తర్వాతి పరిణామాలు వంటి అనేక సంఘటనలకు పాకిస్థాన్ విధానాలే కారణమని ఆరోపించారు. ఈ పరిణామాలు దక్షిణాసియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా అస్థిరతకు దారితీశాయని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రస్తుతం ఉన్నట్లు కొనసాగినంత కాలం దక్షిణాసియాలో శాశ్వత శాంతి, అభివృద్ధి సాధ్యం కాదని రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ పేర్కొంది. అందువల్ల తమ స్వాతంత్ర్యాన్ని అంతర్జాతీయ సమాజం గుర్తించి మద్దతు ఇవ్వాలని కోరింది. తమతో 6 కోట్ల మంది బలూచ్ ప్రజలు ఉన్నారని తాము స్వతంత్ర దేశమని బలూచ్ జాతీయ వాద గ్రూపులు ప్రకటించాయి. అయితే ఈ ప్రకటనను ఇప్పటివరకు పాకిస్థాన్ ప్రభుత్వం అంగీకరించలేదు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచంలోని ఏ దేశమూ బలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా అధికారికంగా గుర్తించలేదు. ప్రస్తుతం బలూచిస్తాన్ అంతర్జాతీయంగా పాకిస్థాన్‌లోని ఒక ప్రావిన్స్‌గా గుర్తింపు పొందింది.

## ప్రెషర్‌గ్రూప్‌గా మాత్రమే పనిచేస్తాం

### సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే



**ఛత్రపతి శంభాజీనగర్, ఆగస్టు 5:** కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తమ పార్టీ కేవలం ప్రెషర్ గ్రూప్‌గా మాత్రమే పనిచేస్తుందని స్పష్టంచేసారు. బుధవారం మీడియాతో మాట్లాడిన దీప్కే ప్రస్తుతానికి తమ పార్టీ ఓ ప్రెజర్ గ్రూపులా పనిచేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వంపై వత్తిడి తీసుకు రావడమే తమ ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రస్తుత దశలో భారత్ ఇదే ఉద్యమాన్ని కోరుకుంటోందన్నారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో జరగనున్న సీజేపీ కోర్ కమిటీ సమావేశాల నేపథ్యంలో ఆయన రిపోర్టర్లతో మాట్లాడారు. మీడియా, న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం సన్నిగిల్లుతోందని, ఇలాంటి అంశాలపై తమ కోర్ కమిటీ మీటింగ్‌లో చర్చించనున్నట్లు చెప్పారు. ఇథనాల్ కలిసిన పెట్రోల్, నిరుద్యోగం లాంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ మాకు మెంటర్‌గా పనిచేస్తారని సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ అన్నారు. వారి నుంచి సలహాలు తీసుకోనున్నట్లు తెలిపారు. సిజెపి నిరసన వేళ విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తివేసేలా వత్తిడితెస్తామని దాస్ తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వ ప్రతినిధులతో చర్చిస్తున్నామన్నారు. సిజెపి రాజకీయాల్లోకి వస్తుందని జరుగుతున్న ప్రచారంపై అభిజీత్ దీప్కే స్పందించారు.



## ఐన్‌స్టీన్ బిలం సమీపంలో కూలిన స్పేస్‌ఎక్స్ రాకెట్

**న్యూయార్కు, ఆగస్టు 5:** అంతరిక్షంలో పెను ప్రమాదం చోటు చేసుకుంది. స్పేస్ ఎక్స్ సంస్థ పంపిన ఫాల్కన్9 రాకెట్‌కు చెందిన, విడిచిపెట్టిన పైభాగం భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.05 గంటల ప్రాంతంలో చంద్రునిపై ఉన్న ఐన్‌స్టీన్ బిలం సమీపంలో కూలిపోయినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటనను శాస్త్రవేత్తలు ఇంకా పూర్తిగా నిర్ధారించాల్సి ఉంది. దాదాపు 4500 కిలోల బరువు ఉన్న ఈ రాకెట్ పైభాగం చంద్రునిపైకి బ్లూ ఘోస్ట్ మిషన్‌ను ప్రయోగించాక 19 నెలల పాటు అంతరిక్షంలో తేలుతూ ఉంది. ఇవాళ ఈ దుర్ఘటన చోటు చేసుకుందని సమాచారం. 2025 జనవరి 15న స్పేస్ ఎక్స్ ఫాల్కన్9 రాకెట్‌ను ప్రయోగించింది. ఇది దశలవారీగా విడిపోతూ చంద్రుడిపైకి రాకెట్ పైభాగం మాత్రమే వెళ్లింది. అక్కడ ఈ రాకెట్ పైభాగం మాత్రమే చంద్రుడిని ఢీకొట్టింది. అసలు రాకెట్ నుంచి విడిపోయిన తర్వాత ఇది మండుతూ చంద్రుడిపైకి వెళ్తుంది.

ఈ క్రమంలోనే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ రాకెట్ ఇంధనం అయిపోయిన తర్వాత, సౌర కార్యకలాపాలు, చంద్రుడి గురుత్వాకర్షణ శక్తి క్రమంగా రాకెట్ దశ గమనాన్ని మార్చేసినట్లు సమాచారం. భూమికి, చంద్రుడికి మధ్య ఒక విశాలమైన, అస్థిరమైన వలయంలో 19 నెలలుగా ఇది తిరుగుతూ ఉంది. నెలల తరబడి, భూమి, చంద్రుడు, సూర్యుని గురుత్వాకర్షణ వల్ల కలిగే రాపిడి, వాటితో పాటు సూర్యరశ్మి యొక్క ఒత్తిడి కలిసి దాని మార్గాన్ని క్రమంగా ముందుకు నెట్టాయని తెలుస్తోంది. చివరికి ఆ చిన్న చిన్న నెట్టడాలు అన్నీ కలిసి నేరుగా భూమిని ఢీకొట్టేలా చేశాయి. స్పేస్‌ఎక్స్‌లోని ఇంధనాన్ని పూర్తిగా తీసివేసి సురక్షితం చేశామని, కానీ అంతటి అధిక శక్తి మార్గాలలో ప్రయాణించే స్టేజ్‌లకు నియంత్రిత పద్ధతిలో ఇంధనాన్ని పారవేసే ప్రక్రియ సాధ్యం కాదని స్పేస్‌ఎక్స్ తెలిపింది. ఇది సుమారుగా గంటకు 8,700 కిలోమీటర్ల వేగంతో భూమిని ఢీకొట్టి ఉంటుంది. ఇది దాదాపు మూడు టన్నుల టీఎన్టీకి సమానమైన శక్తిని విడుదల చేస్తుంది. చంద్రునికి గాలి నిరోధం లేదా ఘర్షణను కలిగించే వాతావరణం లేనందున, రాకెట్ దాదాపు పూర్తి వేగంతో ఢీకొట్టినట్లు తెలుస్తోంది. చంద్రునిపై నుంచి ప్రయాణిస్తున్న మన చంద్రయాన్2 ఆర్బిటర్ ఈ ప్రమాద స్థలాన్ని గుర్తించగలుగుతుంది.

## ప్రతిపక్షాల నిరసనల మధ్య బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** ప్రతిపక్ష సభ్యుల నిరసనలు కొనసాగుతున్నప్పటికీ, డిజిటల్, వర్చువల్ రికార్డులను కోర్టులలో సాక్ష్యంగా అనుమతించే బిల్లును లోక్‌సభ బుధవారం ఆమోదించింది. ఎలాంటి చర్చ లేకుండా మూజువాణి ఓటుతో ఈ చట్టం ఆమోదం పొందినఅనంతరం, సభను వాయిదా వేశారు. 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్, 2026 1891నాటి బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ యాక్ట్‌ను రద్దుచేస్తుంది లేదా దాని స్థానంలోకి వస్తుంది. అంతకు ముందు వాయిదాపడిన సభ మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి సమావేశమైనప్పుడు ఈ బిల్లును పరిశీలనకు చేపట్టారు. కానీ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూనే ఉన్నారు. దానిపై చర్చించాలన్న సభాపతి విజ్ఞప్తిని పట్టించుకోలేదు. అంతరాయాలు కొనసాగుతుండటంతో, బిల్లును ఓటింగ్‌కు పెట్టగా, అది మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. నినాదాలపై స్పందిస్తూ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, కాంగ్రెస్ నాయకుడు కెసి వేణుగోపాల్ 'మంచి వ్యక్తి అయినప్పటికీ, ఆయన తన పార్టీ ఎంపిలను నియంత్రించలేకపోయారని అన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీలు శ్రీరాముడికి వ్యతిరేకంగా ఉన్నాయని రిజిజు ఆరోపించారు. వారు దేశానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్‌పై ఇక్కడ జంతర్ మంతర్ వద్ద, దేశంలోని ఇతర ప్రాంతాలలో నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై ప్రతిపక్షం ప్రభుత్వం నుండి క్షమాపణలతో కూడిన వివరణ కోరుతోంది. అలాగే అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల అపహరణ ఆరోపణలపై కూడా నిరసన తెలుపుతోంది.

## డ్రోన్ తయారీ కంపెనీ సిఇఒ లక్ష్యంగా పేలుడు

### డ్రైవర్ మృతి, సిఇఒకు తీవ్రగాయాలు




### ఉక్రెయిన్‌లోని కీలక ప్రాంతాలపై రష్యా డ్రోన్ల దాడులు
### 17 మంది మృతి, 45 మందికిపైగా గాయాలు

**మాస్కో, ఆగస్టు 5:** రష్యాక్రెయిన్ యుద్ధం వేళ రష్యా భూభాగంలో ఊహించని సంచలనం చోటుచేసుకుంది. రష్యన్ సైన్యానికి అత్యంత కీలకమైన డ్రోన్లను సరఫరాచేసే ఓ ప్రముఖ రక్షణ సంస్థ సిఇఒపై హత్యాయత్నం జరిగింది. రష్యా సైన్యం ఉపయోగిస్తున్న శక్తివంతమైన ఉపిర్ ఎఫ్‌పివి డ్రోన్లను తయారుచేసే ఉరల్‌డ్రోన్ జావోడ్ కంపెనీ సిఇఒ వ్లాదిమిర్ త్కాచుక్ లక్ష్యంగా భారీ పేలుడు సంభవించింది. యెకాటెరిన్‌బర్గ్ సమీపంలోని బోల్షోయే ఇస్తోక్ ప్రాంతంలో ఆయన ప్రయాణిస్తున్న మెర్సిడెస్ కారు వెళ్తుండగా ఈ విస్ఫోటనం జరిగింది. కారు కింద ముందే అమర్చిన పేలుడు పదార్థాలు పేలిపోవడంతో ఈ ప్రమాదంజరిగింది. ఈ శక్తివంతమైన పేలుడు ధాటికి మెర్సిడెస్ కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా వ్లాదిమిర్ త్కాచుక్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయనను అత్యవసర చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రిలోని ఐసీయూలో చేర్చి వైద్యం అందిస్తున్నారు. ఈ దాడికి ఎవరు ఒడిగట్టారనే దానిపై రష్యన్ భద్రతా ఏజెన్సీలు దర్యాప్తు ప్రారంభించాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం, కారు కింద పేలుడు పదార్థాలను అమర్చారని, మెర్సిడెస్ అతివేగంగా వెళ్తున్నప్పుడు ఈ పేలుడు సంభవించిందని తెలుస్తోంది. దాడి వెనుక ఉన్నవారి గుర్తింపు ఇంకా అధికారికంగా నిర్ధారించబడలేదు. రష్యా ఏజెన్సీలు దర్యాప్తును ప్రారంభించాయి. ఉక్రెయిన్ నుంచి తక్షణమే ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోవడం గమనార్హం.

ఇదిలా ఉండగా బుధవారం తెల్లవారుజామున కీవ్, పరిసర ప్రాంతాలపై రష్యా జరిపిన క్షిపణి, డ్రోన్ దాడులలో 17 మంది మరణించగా 45మంది గాయపడ్డారు. పలు వ్యాపార సంస్థలు, ఓ రైల్వే స్టేషన్ తీవ్రంగా దెబ్బతిన్నాయి. రష్యా లక్ష్యాలలో యుద్ధంతో సంబంధం లేని ఒక బ్రూవరీ, నిర్మాణ సామగ్రి గిడ్డంగి, మెయిల్ సార్టింగ్ ఆఫీస్ ఉన్నాయని, ఈ ప్రదేశాలకు యుద్ధంతో ఎలాంటి సంబంధం లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. అయితే ఆ వ్యాపార సంస్థలకు సైనిక సంబంధాలు ఉన్నాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ చెబుతోంది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ దాడులు, దాదాపు ప్రతిరోజూ జరుగుతున్న రష్యా భారీ స్థాయి బాలిస్టిక్ క్షిపణి దాడుల పరంపరలో భాగం. అమెరికా పేట్రియాట్ వ్యవస్థకు చెందిన ఇంటర్‌సెప్టర్ క్షిపణుల తీవ్ర కొరతను అవకాశంగా తీసుకుని ఈవేగవంతమైన దాడులు జరుగుతున్నాయి. బాలిస్టిక్ క్షిపణులను కూల్చివేయగల సామర్థ్యం ఉన్న ఉక్రెయిన్ ఏకైక వాయు రక్షణ ఆయుధం పేట్రియాట్ వ్యవస్థ. ఇరాన్ యుద్ధం కారణంగా కొరత ఏర్పడటంతో, జెలెన్స్కీ మరిన్ని మందుగుండు సామగ్రి కోసం ఇతర దేశాలకు విజ్ఞప్తి చేశారు.

## విజయ్ సర్కార్ తొలిబడ్జెట్


### ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక సాయం పెంపు



**చెన్నై, ఆగస్టు 5:** తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. విజయ్ టివికె ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ఇది. తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి ఎన్ మేరీ విల్సన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 2036లోపు తమిళనాడు ఆర్థిక వ్యవస్థను 1.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లలు పుడితే వారికి ఒక గ్రామ్ బంగారం అందించే పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేయనుంది. తాయ్ మామన్ తంగా మోతిరం తిట్టం పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించే ప్రతి బిడ్డకు 1 గ్రామ్ బంగారు ఉంగరాన్ని అందిస్తారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక సాయాన్ని పెంచనున్నారు. దీనివల్ల 1.93 లక్షల కుటుంబాలకు ప్రతి ఏటా రూ.7,000 వరకు ఆర్థిక సాయం అందిస్తారు. ఇందుకోసం రూ.135 కోట్లు కేటాయించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు అన్నన్ సీర్ తిట్టమ్ అనే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికింద వధువుకు 8 గ్రాముల బంగారంతోపాటు ఒక పట్టుచీరను అందిస్తారు. వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్ కింద అర్హులైన పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తారు. రైతులకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.7,432 కోట్లు కేటాయించింది. రైతులు, వ్యవసాయ రంగం సంక్షేమానికి రూ.14,984 కోట్లు కేటాయించింది. అరివగం పేరుతో దేశంలోనే మొదటి ఎఐ అండ్ ఇన్నోవేషన్ సిటీని ఏర్పాటు చేస్తారు. అలాగే, తూతుకుడి, తిరునెల్వేలి ప్రాంతాల్ని స్పేస్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ జోన్‌గాప్రకటించారు. మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక గ్రూపులకు రూ.38వేల కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందించే హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంను రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షలకు పెంచబోతున్నారు. గరిష్టంగా రూ.12 లక్షలతో మరో హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం కూడా ఉంది. 12 జిల్లాల్లో 12 వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తారు. మధురైలో ప్రత్యేక లా కాలేజీని ఏర్పాటు చేస్తారు. 2027-28 విద్యాసంవత్సరం నుంచి ఇది ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో ఉన్నత విద్య కోసం రూ.8,393 కోట్లు కేటాయించారు. అలాగే, కొత్తగా ఐదు ఐటీఐలను ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ స్కూళ్లలో 11వ తరగతి చదివే విద్యార్థులకు హెల్మెట్, లైట్స్, వాటర్ బాటిల్స్‌తో కూడిన సైకిళ్లు అందజేస్తారు.

# సంక్షిప్త వార్తలు

## దుబాయ్‌లో 20 నిమిషాల్లోనే ఏడు పేలుళ్లు



**దుబాయి, ఆగస్టు 5:** యుఎఇలోని దుబాయ్ జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున వరుస పేలుళ్లు సంభవించాయి. కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఏడు పేలుళ్లు చోటుచేసుకున్నట్టు ఇరాన్‌కు చెందిన వార్తా సంస్థ పేర్కొంది. ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలముకున్నాయి. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. జెబెల్ అలీ నౌకాశ్రయం సమీపంలోని పారిశ్రామిక ప్రాంతంలో ఈ పేలుళ్లు జరిగినట్టు సమాచారం.

## పంజాబ్‌లో ఉగ్రవాద కుట్రభగ్నం

**అమృత్‌సర్, ఆగస్టు 5:** పంజాబ్ పోలీసులు మరో ఉగ్రకుట్రను భగ్నం చేశారు. ఇటీవలి జంతర్‌మంతర్ నిరసనలను కూడా నిందితులు టార్గెట్ చేసినట్టు గుర్తించారు. మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ హ్యాండ్లర్ల సూచనల మేరకు నిందితులు కుట్రపన్నినట్టు పోలీసులు గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, విద్యార్థుల నిరసనల సందర్భంగా నిందితులు జంతర్‌మంతర్‌కు వెళ్లినట్టు అధికారులు గుర్తించారు. పోలీసులను, ఇతర భద్రతా సిబ్బందిని టార్గెట్ చేసేలా వారికి పాక్ హ్యాండ్లర్లు శిక్షణ ఇచ్చినట్టు కూడా దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది.

## జార్ఖండ్ నిరసనలకు వాంగ్‌ఛుక్ సంఘీభావం


**రాంచి, ఆగస్టు 5:** జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జెపిఎస్సి), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్ఎస్‌సి), ఇతర పోటీ పరీక్షల్లో అవకతవకలు, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జార్ఖండ్ విద్యార్థి నాయకుడు దేవేంద్ర నాథ్ మహతో, మరో ఐదుగురు విద్యార్థులు గతనెల నుంచి చేస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు సిక్కిం నేత వాంగ్‌ఛుక్ మద్దతు ప్రకటించారు. సిక్కిం సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, జార్ఖండ్ విద్యార్థుల నిరసనకు సంఘీభావం ప్రకటించారు. స్టూడెంట్ లీడర్ దేవేంద్రతో బుధవారం వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆయన ఆరోగ్యం క్షీణించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.

## ఆగస్టు 15ను ఇండియాడేగా ప్రకటించిన మసాచుసెట్స్



**బోస్టన్, ఆగస్టు 5:** అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతి ఏటా ఆగస్టు 15వ తేదీని ఇండియా డేగా అధికారికంగా జరపాలని ఆ రాష్ట్ర గవర్నర్ మోరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు. 1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్రం పొంది, ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు.

## రోడ్డు ప్రమాదాల్లో 1.80 లక్షల మంది మృతి



**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** భారత్‌లో ప్రతి యేడాది సగటును సుమారు 1.80 లక్షల మంది రోడ్డు ప్రమాదాలకు లోనవుతున్నట్లు కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. బుధవారం ఆయన రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. చాలా బాధాకరమైన విషయమని, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి యేడాది ఇండియాలో 1.80 లక్షల మంది మరణిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదాలను తగ్గించే అంశంపై చర్యలు తీసుకోవాలని ఎంపీ సుధానమూర్తి ప్రశ్న వేశారు. అందమైన రోడ్లు ఉన్నాయని, కానీ ప్రమాదాల సంఖ్య పెరుగుతోందని, ఇది రోడ్ల వల్ల కాదు అని, డ్రైవర్లు సరిగా నడపలేకపోవడం వల్లే అని సుధామూర్తి అన్నారు జాతీయ రహదారులపై ప్రమాదాలను తగ్గించేందుకు ఆమె ఓ సూచన చేశారు. డ్రైవింగ్ లైసెన్సు ఇచ్చే ప్రక్రియ మరింత పటిష్టం చేయాలని సుధామూర్తి పేర్కొన్నారు.

## మంత్రి పదవిపై చర్చ ప్రతిసారీ నాపై తప్పుడు ప్రచారం: ఎమ్మెల్యే ప్రేమసాగర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 5,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మంత్రి మండలి విస్తరణ ,తన మంత్రి పదవిపై చర్చ వచ్చిన ప్రతిసారి తప్పుడు ప్రచారం చేస్తున్నారని నేను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదనీ మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్‌రావు ఆవేదన చెందారు. గాంధీభవన్‌లో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజా ప్రతినిధులు ఎవరైతే తప్పుడు ప్రచారం చేస్తున్నారో త్వరలో వారి కుట్రలు అన్ని బయటకు వస్తాయనీ హెచ్చరించారు. నాపై ఆరోపణలు చేస్తున్న వారు చర్చలకు రావాలనీ సవాల్ చేశారు. నేను రూ. 450 కోట్లు వాడుకున్నట్లు చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదనీ సాయినాథ్ ప్రయివేట్ లిమిటెడ్ పై, భాగ్యనగర్ హోటల్స్ పేరుమీద బ్యాంక్ లోను తీసుకున్నామనీ 2009-10లో బ్యాంక్ 450 కోట్లు సాంక్షన్ చేసిందనీ ఆయన వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా నేను 15 స్కూల్స్ కట్టిం చాననీ తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా నేను అధి కార దుర్వినియోగం చేయలేదనీ చెప్పారు. నేను సాండ్, లాండ్ తీసుకో వాలనుకుంటే ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తీసుకొనేవాడిని గుర్తుచేశారు. నాపై తప్పుడు ప్రచారం చేస్తున్న, పత్రి కలపై లీగల్ యాక్షన్ తీసుకుంటా అని హెచ్చరించారు. నేను బేస్ లెస్ ఫిర్యాదు చేయను నేను పది ఏండ్లు ప్రతి పక్షంలో ఉండి కాంగ్రెస్ కోసం పోరాటం చేసాను అని గుర్తుచేశారు. యుఎస్ ట్రేడింగ్ డౌన్ అయిన తర్వాత నేను 160కోట్లు లాస్ అయ్యాననీ తెలిపారు. నిజ నిర్ధారణ కమిటీ వేస్తే కమిటీ ముందు పూర్తి ఆధారాలు చూపిస్తా అని చెప్పారు. రూ.450 కోట్లు ఫ్రాడ్ చేస్తే బ్యాంక్ 109 కోట్లకు ఎలా ఆక్షన్ వేస్తుందనీ అన్నారు. సాంక్షన్ ఆర్డర్స్ నేను క్రియేట్ చేసినవి కాదనీ 2014 నుండి 2025 వరకు కంపెనీ కి ఫండ్స్ వాడిందనీ తెలిపారు. 109 కోట్ల 11 లక్షలు అన్ని బ్యాంకు లు ఎన్‌పిఎ ఇచ్చాయనీ ఆంధ్ర బ్యాంక్ ఎన్‌పిఎ అయిన తర్వాత 31అక్టోబర్ 2024లో 18కోట్ల 72లక్షలు చెల్లించామనీ చెప్పారు. ఆర్‌బిఐ సెబి రిజిస్టర్డ్ అయినామని కూడా తెలిపారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

## వారి విశ్వాసమే మా బలం..ప్రతి అర్జీకి న్యాయం చేస్తాం: మంత్రి సీతక్క



బుధవారం గాంధీభవన్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు5,ప్రభాతవార్త:** ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకే గాంధీభవన్‌లో 'ప్రజలతో ముఖాముఖి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీ ణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖల మంత్రి డాక్టర్ దనసరి అన సూయ సీతక్క అన్నారు. ప్రతి బుధవారం గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా రెండువందలకు పైగా విన్నపాలు స్వీకరించి ప్రతి వినతిని మంత్రి సీతక్క పూర్తిగా చదివి సమస్యల స్వభావాన్ని తెలుసుకుంటూ సంబంధిత శాఖల అధికారులతో అక్కడి కక్కడే ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశం చారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. సమస్యలను వినడమే కాకుండా వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులకు సూచించారు.ధరణి అమలులో జరిగిన అక్రమాల కారణంగా తమ భూములు ఇతరులు ఆక్రమించుకున్నారని, రాత్రికి రాత్రే పట్టాదారు పాస్ పుస్తకాల్లో మార్పులు జరిగాయని పలువురు బాధితులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు రాకపోయిన అర్హులైన కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరగా, పోలీసు నియామకాల్లో వయోపరిమితి పెంచాలని యువత విజ్ఞప్తి చేసింది. గత ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలతో నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తివేయాలని పలువురు వినతిపత్రాలు సమర్పించారు. అటవీ శాఖ అధికారుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ హక్కులను పరిరక్షించాలని కోరుతూ పలువురు గిరిజనులు, అటవీ ప్రాంతాల ప్రజలు కూడా మంత్రి సీతక్కకు వినతిపత్రాలు అందజేశారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి సంబంధిత శాఖల అధికారులతో వెంటనే ఫోన్‌లో మాట్లాడి చట్టబద్ధంగా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలుగా గత ప్రభుత్వం వదిలివెళ్లిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. ప్రజలు ప్రజా ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసంతోనే రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చి తమ వినతులను అందజేస్తున్నారని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి అర్హుడికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం బాధ్యతగా పనిచేస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.



## ఆర్డీఓ స్థాయిలో ప్రజావాణి అవసరం లేదు

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి

**బేగంపేట ఆగస్టు 5,ప్రభాతవార్త:** రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్డీవో) స్థాయిలో ప్రజావాణీ నిర్వహణ అవసరం లేదని,మండలం, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రజావాణీలు మాత్రమే ఉండాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ ప్రజావాణీ ఇంచార్జ డా.జి.చిన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలియ జేసారు. ఆర్డీవో కారాలయాలు దాదాపుగా కలెక్టరేట్‌లోనే ఉంటాయని, లేదంటే వాటి సమీపంలో ఉంటాయని,అలాంటప్పుడు మండలం, జిల్లా స్థాయి ప్రజావాణీల మధ్యలో ఆర్డీవో స్థాయిలో ప్రజావాణీ నిర్వహణ అవసరంలేదని చిన్నారెడ్డి పేర్కొన్నారు .ఈ విషయాన్ని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ప్లానింగ్‌శాఖ ఉన్నతాధికారులు పునరాలోచన చేసి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని చిన్నారెడ్డి సూచించారు.

## ఆర్‌ఎస్ ప్రవీణ్ ఓ టిష్యూ పేపర్: సంపత్ కుమార్



**హైదరాబాద్,ఆగస్టు 5,ప్రభాతవార్త:** బిఆర్‌ఎస్ అనే డస్ట్ బిన్‌లో ఆర్‌ఎస్ ప్రవీణ్ ఒక టిష్యూ పేపర్ అంటూ ఎఐసిసి సెక్రెటరీ సంపత్‌కుమార్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ గురించి మాట్లాడే అర్హత ప్రవీణ్‌కు ఎక్కడిదని ప్రశ్నించారు. కెసిఆర్ కాళ్లు మొక్కి ఒకే పోస్టులో ఏడు సంవత్సరాలు ఉన్నారని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్ జాతి ద్రోహి అని బిఎస్‌పి పార్టీని కెసిఆర్ కాళ్ల దగ్గర పెట్టారని విమర్శించారు. కల్వకుంట్ల మాయమాటల మత్తులో ఆర్‌ఎస్ ఉన్నారనీ ఐపిఎస్‌పదవి చేసినవారు సైతం ఇలా ప్రవర్తించడం దారుణమని ఆగ్రహంవ్యక్తంచేశారు. హరీష్‌రావు విమర్శలకు సమాధానం చెప్పలేక అడ్వకేట్ ఉన్నాడని నోటీసులు పంపడం నాన్సెన్స్ మా ఆరోపణలు అబద్ధంఅంటే మేం ఆధారాలు బయటపెడుతా మనీ హెచ్చరించారు. విమర్శలు, ఆరోపణలకు హరీష్ సమాధానం చెప్పాకోవాలి కానీ. అడ్వకేట్ ఉన్నాడుకదా అని నోటీసులు పంపిస్తే ఎలా? ఇదేం విధానం లీగల్ నోటీసులుఎప్పుడూ పంపుతారో హరీష్‌రావుకి తెలియదా? అని ప్రశ్నించారు.

## ఆర్‌టిసిలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

### త్వరలో నియామకానికి నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 5:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ ఆర్‌టీసీ)లో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆర్‌టీసీ సమ్మె సందర్భంగా కార్మికులు తమ డిమాండ్లలో భాగంగా సంస్థలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సమ్మె సందర్భంగా ఈ డిమాండ్‌ను ఆర్‌టీసీ యాజమాన్యం అంగీకరించింది. పలుమార్లు కార్మిక సంఘాలతో ఆర్‌టీసీ అధికారులు ఇదే అంశంపై చర్చించారు. ఆర్‌టీసీ సంస్థ తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించింది. దీనికోసం కార్మిక సంఘాలు పలుమార్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని, ఆర్‌టీసీ ఎండీ నాగిరెడ్డిని సమస్యను పరిష్కరించమని కోరాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆర్‌టీసీలో జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అనుమతి ఇస్తూ ఆర్‌టీసీ సంస్థకి తెలియజేసినట్టుతెలిసింది. ఇందుకు సంబంధించిన నియామకాలను చేపట్టడం కోసం ఆర్‌టీసీ సంస్థ త్వరలోనే నిర్ణయం తీసుకుని నోటిఫికేషన్ కోసం చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

# అమెరికా వెళ్లే తెలంగాణ విద్యార్థులకు వీసాలను పెంచండి

### అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భేటీ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** భారత్‌లో అమెరికా రాయబారి సెర్జియో గోర్ తో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈమర్యాదపూర్వక భేటీ 30 నిమిషాలకు పైగా కొనసాగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలు చర్చించారు.తెలంగాణలో విద్య, ఉపాధి,పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే తెలంగాణ విద్యార్థులకు వీసాలను పెంచాలని, వీసా అపాయింట్‌మెంట్లు సకాలంలో లభించేలా సహకరించాలని కోరారు. వీసా ఇంటర్వ్యూ స్లాట్లను పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయాలని కోరారు. అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణకు చెందిన వివిధ రంగాల నిపుణుల సమస్యలను కూడా రాయబారి దృష్టికి తీసుకెళ్లారు. హెచ్-1బి వీసా ప్రాసెసింగ్, రెన్యువల్, వీసా స్టాంపింగ్ ఆలస్యం కాకుండా సరళతరం చేయాలని కోరారు. వీసా నిబంధనల్లో వచ్చే మార్పులపై ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. అమెరికాలో చదువుతున్న తెలంగాణ విద్యార్థుల భద్రత, సంక్షేమంపై కూడా చర్చించారు. తెలంగాణలో అమెరికా సంస్థలకు విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఐటీ, కృత్రిమ మేధ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్‌లు, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు. అమెరికా విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యాసంస్థలతో కలిసి పనిచేసేలా సహకరించాలని కోరారు. విద్యార్థుల మార్పిడి, పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విస్తరించాలని సూచించారు. అమెరికాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న భారతీయ భాషల్లో తెలుగు ఒకటని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. భారతదేశ చరిత్ర, సంస్కృతిపై రాయబారి సెర్జియో గోర్‌కు ఉన్న అవగాహన తనను ఆకట్టుకుందన్నారు. ప్రత్యేకంగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలు, రాష్ట్ర బలాలపై రాయబారి చూపిన ఆసక్తిని ముఖ్యమంత్రి అభినందించారు. తెలంగాణ-అమెరికా మధ్య వ్యాపారం, పెట్టుబడులు, సాంస్కృతిక మార్పిడి, ప్రజల మధ్య సంబంధాలను మరింత విస్తరించేందుకుసంపూర్ణ సహకారం అందిస్తామని రాయబారి సెర్జియో గోర్ హామీ ఇచ్చారు.

## బోనాల వేడుకల్లో మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు 5,ప్రభాతవార్త:** నిజామాబాద్ పాత కలెక్టరేట్ ప్రాంగణంలో టిఎన్‌జిఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ మాసం బోనాల మహోత్సవాల్లో టిపిసిసి అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ కూడా పాల్గొని భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో సందడి చేశారు. అనంతరం నిర్వాహకులు మహేష్ కుమార్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు కేశ వేణు, శేఖర్ గౌడ్, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి, రామకృష్ణ, దయాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, టిఎన్‌జిఓ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## ప్రజల వద్దకే విద్యుత్ సేవలు

### నేడు ప్రజాబాట-బస్తీబాట: దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి జితేష్

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** తమ సంస్థ పరిధిలో ప్రజాబాట-బస్తీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ వి పాటిల్ తెలిపారు. ప్రతి మంగళవారం, గురువారం జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా సంస్థ అధికారులు వినియోగదారుల వద్దకే వెళ్లి విద్యుత్ సంబంధిత సమస్యలను తెలుసుకుని, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులకు మరింత చేరువయ్యే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు.వివిధ పనుల నిమిత్తం తమ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండాఅధికారులు, ఇంజినీర్లు, సిబ్బంది నేరుగా బస్తీలు, కాలనీలు, గ్రామాలు, తండాలు, పట్టణ ప్రాంతాలకు వెళ్లి ప్రతి వినియోగదారుడిని కలిసి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, వీలైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించేలా ఈకార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. అలాగేవిద్యుత్ సరఫరా నాణ్యత, విశ్వసనీయతపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, ఫీల్డ్ స్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే ప్రక్రియకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. వీటితో పాటు, పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసే పనులను విస్తృతంగాచేపట్టనున్నారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, యార్డుల పరిశుభ్రత, వోల్టేజ్ సమస్యల పరిష్కారం,వదులుగా ఉన్న విద్యుత్ తీగల బిగింపు, ఇంటర్ పోల్స్ ఏర్పాటు, దెబ్బతిన్న లేదా తుప్పు పట్టిన విద్యుత్ స్తంభాల మార్పిడి, దెబ్బతిన్న కండక్టర్ల గుర్తింపు, మార్పిడి వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారని తెలిపారు. అదేవిధంగా వరదలకు గురయ్యే ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల ప్లింత్‌లఎత్తు పెంపు, పంపిణీ వ్యవస్థ ఆధునికీకరణ, మరమ్మతులు, పునరుద్ధరణ పనులను వేగవంతం చేసి నిరంతర విద్యుత్ సరఫరాకోసం అవసరమైన చర్యలు చేపట్టనున్నారని పేర్కొన్నారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి

### అన్ని శాఖలు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి

### భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి

### అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సమీక్ష



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** డిసెంబర్‌లో నిర్వహించనున్న "తెలంగాణ రైజింగ్-2026" గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్-2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్" కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశా లను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## లా సెట్ మొదటి విడతలో 7622 మందికి సీట్ల కేటాయింపు

### 12లోగా కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి: పాండురంగా రెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 5:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో మూడు సంవత్సరాలు, 5 సంవత్సరాల కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే లా సెట్-2026 కౌన్సెలింగ్‌లో భాగంగా మొదటి విడత సీట్ల కేటాయింపు బుధవారం చేశారు. మొదటి విడతలో 7622 సీట్లను కేటాయించినట్టు అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సులో చేరడం కోసం మే 18న లాసెట్-2026 పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో లా సెట్‌లో 8730 సీట్లు అందుబాటులో ఉండగా అందులో మొదటి విడతలో 7622 సీట్లను కేటాయించారు. కౌన్సెలింగ్‌లో పాల్గొన్న 20,158 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. వారిలో 7622 మందికి సీట్లను కేటాయించరు. సీటు పొందిన అభ్యర్థులు నేటి(గురువారం) నుంచి ఈ నెల 12 వరకు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు. మూడు సంవత్సరాల లా కోర్సుకి 16,850 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. రాష్ట్రంలో మూడు సంవత్సరాల లా కోర్సులో 6100 సీట్లు అందుబాటులో ఉండగా.. మొదటి విడతలో 5564 మందికి సీట్లను కేటాయించారు. ఇక 5 సంవత్సరాల లా కోర్సులో చేరడం కోసం 3308 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. 5 సంవత్సరాల లా కోర్సులో 3308 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయి. వాటిలో 2058 సీట్లను మొదటి విడతలో కేటాయించారు. మొత్తం 8730 సీట్లకుగానూ 20,158 మంది కౌన్సెలింగ్‌లో వెబ్ ఆప్షన్లు ఇవ్వగా వాటిలో కన్వీనర్ కోటా సీట్లు 8730 ఉంటే.. అందులో 7622 సీట్లను కేటాయించారు.

## బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

### గ్రూప్ ఇన్స్యూరెన్స్‌ను రూ.10లక్షలకు పెంచాలి

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆయా వర్గాల ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేశారు. మల్కాజ్‌గిరిలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు సంబంధించిన రోస్టర్ అమలు, బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ, పదోన్నతులు, సబ్‌ప్లాన్ నిధుల వినియోగం, ఉద్యోగుల సంక్షేమంపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోస్టర్ అమలు పకడ్బందీగా ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని శాఖల్లో రోస్టర్ విధానాన్ని ఎలాంటి మిన హాయింపులు లేకుండా అమలు చేయాలని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను అత్యవసర ప్రాతిపదికన భర్తీ చేయాలని స్పష్టం చేశారు, పదోన్నతుల్లో రోస్టర్ విధానాన్ని తప్పనిసరిగా అమలుచేసి అర్హులైన ఉద్యోగులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆయా వర్గాల అభివృద్ధి,సంక్షేమం కోసం సమర్థవంతంగా వినియోగించాలని చెప్పారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సేవా, పదోన్నతి సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు.ఉద్యోగుల భద్రత దృష్ట్యా గ్రూప్ ఇన్స్యూరెన్స్ పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచే అంశాన్ని పరిశీలించాలని అధికారులకుసూచించారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు నీలాదేవి, రాంబాబునాయక్, కొంకటి లక్ష్మీనారాయణ వివిధ శాఖల అధికారులు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఫైర్ ఎన్‌ఒసి ఫోర్జరీపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

### అక్రమాలకు పాల్పడిన కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 5:** ఫైర్ ఎన్‌వోసీల్లో సంతకాల ఫోర్జరీపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఫైర్ ఎన్‌వోసీల్లో సంతకాల ఫోర్జరీ అత్యంత తీవ్రమైన నేరమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేట్ కళాశాలలపై సమగ్ర విచారణ జరపాలని ఎస్‌ఎఫ్ఐ, ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్ చేశాయి. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఫైర్ ఎన్‌వోసీలను ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించిన ఘటన అత్యంత ఆందోళనకరమైనదని, విద్యార్థుల ప్రాణాలకు సంబంధించిన అగ్నిమాపక భద్రత వంటి కీలక అంశంలో నకిలీ పత్రాలు సమర్పించడం తీవ్రమైన నేరం మాత్రమే కాకుండా విద్యావ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్య అని ఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు మండిపడ్డారు. అధికా రులు గుర్తించిన ఫోర్జరీలకు పాల్పడినట్టు అధికా రులు గుర్తించిన కాలేజీలపై కేసులు నమోదు చేయడమే కాకుండా, గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఫైర్ సేఫ్టీ, భవన భద్రత అనుమతులు, ఎన్‌వోసీలపై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగ నాథ్ సంతకాన్ని ఫోర్జరీచేసి, నకిలీ ఫైర్ ఎన్ఓ సీలతో ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు పొందేం దుకు యత్నించిన 8 ప్రైవేట్ కళాశాలల అక్ర మాలు వెలుగులోకి రావడం ఆందోళనకరమని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. కేవలం లా భాపేక్షే ధ్యేయంగా విద్యార్థుల ప్రాణాలను, భవిష్యత్తును పణంగా పెడుతున్న ఇలాంటి విద్యా సంస్థల వైఖరిని తీవ్రంగా ఖండించారు. నకిలీ ధృవీకరణ పత్రాలు సమర్పించిన కళాశాలలపై కేవలం కేసు నమోదుతో సరిపెట్టకుండా ప్రభు త్వం, విద్యాశాఖ కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపును తక్షణమే రద్దు చేసి, ఆ విద్యాసం స్థలను వెంటనే సీజ్ చేయాలన్నారు. ఆయా కాలేజీ యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, వారికి సహకరించిన మధ్య వర్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫైర్ సేఫ్టీ, నిబంధనల అమలుపై సమగ్ర భద్రతా ఆడిట్ నిర్వహించాలన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుద్దీకరణ పూర్తి చేయాలి: శృతి

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఐదు రోజుల్లో విద్యుద్దీకరణ పూర్తి చేయాలని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓజా ఆదేశించారు. హైదరాబాద్‌లోని మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం నుంచి బుధవారం విద్యుత్ పంపిణీ సంస్థల అధికార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించే పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ శృతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుదీకరణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుక పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఆదిలాబాద్, నిజామాబాద్, జనగామ, ఖమ్మం, ములుగు, సిరిసిల్ల సర్కిళ్లలోని అంగన్‌వాడీ కేంద్రాల విద్యుదీకరణ పనులను మరింత వేగవంతం చేయాలని సూచిం చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారులతో సమన్వయం చేసుకుం టూ యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తిచేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సింఎడి కర్నాటి వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ పరిధిలో ఒక్క అంగన్‌వాడీ కేంద్రం కూడా మిగలకుండా జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకొని, ఆగస్టు 10లోగా అన్ని పెండింగ్ విద్యుదీకరణ పనులను పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన మెటీరియల్, మీటర్లు తదితర సామగ్రిని అందుబాటులో ఉంచి పనులను వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలనిసంబంధిత సూపరింటెండింగ్ ఇంజినీర్లకు సూచించారు. అలాగే పనుల పురోగతిని ప్రతిరోజూ సమీక్షించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహిళా అభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ అధికారులు, టీజీఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ వి.మోహన్ రావు, చీఫ్ ఇంజినీర్ సురేందర్, సంబంధిత జిల్లాల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రేపు ధర్నాచౌక్‌లో ప్రభుత్వ పెన్షనర్ల మహాధర్నా

**హైదరాబాద్, ఆగస్టు 5,ప్రభాతవార్త:** ఎన్నికల మేనిఫెస్టోలో పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 7న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వేదికగా పెన్షనర్ల మహా ధర్నాకు పిలుపునిచ్చామని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి జెఎసి చైర్మన్ కె.లక్ష్మయ్య తెలిపారు.ఈమేరకు బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జేఏసీ సభ్యులతో కలిసి పెన్షనర్ల మహాధర్నా పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడగానే ఇస్తానన్న ఆరు నెలలలోపు ఆరోగ్య కార్డులతో నగదు రహిత వైద్యం,మంచి ఫిట్మెంట్, పిఆర్సీ, కరువు భత్యం, బకాయిల నగదు చెల్లింపు లాంటి హామీలు గాలికి వదిలేసారు అన్నారు. ప్రభుత్వ అసమార్థతతో పెన్షన్ దారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని తమకు ఇచ్చిన హామీలను పోరాడి సాధించుకోవడానికే మహాధర్నాలు చేపట్టామని అన్నారు. ఈకార్యక్రమంలో జనరల్ సెక్రటరీ సత్యనారాయణతోపాటు పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

# నైనీలో యేడాదికి 60 లక్షల టన్నుల బొగ్గు

### రోజుకు 12 వేల టన్నుల రవాణా

### సింగరేణి డైరెక్టర్ గౌతమ్, ఇడి వెంకన్న

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** ఒడిశా రాష్ట్రంలోని నైని బొగ్గు గని నుంచి ఏడాదికి 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి కానుందని సింగరేణి డైరక్టర్ పోత్రు గౌతమ్ తెలిపారు. ఈ గని నుంచి ఉత్పత్తి అవుతున్న బొగ్గులో రోజుకు కనీసం 12 వేల టన్నులు అయినా రవాణా చేయాలని స్పష్టం చేశారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ వద్ద బుధవారం సాయంత్రం సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ బి వెంకన్నతో కలిసి గౌతమ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ బొగ్గును సమీపంలోని విద్యుత్ కేంద్రాలతో పాటు, తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి, తమిళనాడు జెన్కో విద్యుత్ కేంద్రాలకు రవాణా జరపాల్సి ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏజెన్సీలు ప్రతిరోజు నిర్దేశిత లక్ష్యాల మేరకు బొగ్గు రవాణాకు సహకరించాలన్నారు. వినియోగదారులు కూడా చొరవ చూపాలని కోరారు. కాగా రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా జరపడం కోసం సమీపంలోని హిందోల్ రైల్వే సైడింగుకు కామాఖ్య నగర్ సైడింగ్ వరకు కూడా బొగ్గు రవాణా చేయడంలో ఏజెన్సీలు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ కోల్ మూవ్ మెంట్ వెంకన్న కోరారు. దీనిపై వినియోగదారులు స్పందిస్తూ తమకు అవసరమైన బొగ్గును రోజువారి కేటాయింపు ప్రకారం స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామని, బొగ్గు రవాణాదారులతో సమన్వయం జరుపుకుంటూ బొగ్గును స్వీకరిస్తామన్నారు. బొగ్గు రవాణా ఏజెన్సీలవారు మాట్లాడుతూ లక్షల మేరకు బొగ్గును రవాణా చేయడానికి సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. బొగ్గు రవాణా జరుగుతున్న మార్గంలో కొన్నిచోట్ల ఎదురవుతున్న ఇబ్బందులను సమావేశంలో చర్చించారు.

అనంతరం దీనిపై సింగరేణి అధికారులు అంగూల్ జిల్లా కలెక్టర్ ఎం అబ్దుల్ అక్తర్, జిల్లా ఎస్పీ శ్రీ రాహుల్ జైన్ ను కూడా కలిసి చర్చించారు. రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా జరపడంలో ప్రభుత్వ యంత్రాంగంవారు సహకరించాలని కోరగా అందుకు వారు సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో రోజుకు కనీసం 12 వేల టన్నుల బొగ్గు రవాణా చేయడంకోసం సింగరేణి యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఈ సమావేశంలో నైనీ ఏరియా జనరల్ మేనేజర్ డి. బైద్య, తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్, జిందాల్ ఇండియా పవర్, మీనాక్షి ఎనర్జీ తదితర సంస్థల ప్రతినిధులు, బొగ్గు రవాణా ఏజెన్సీలు పాల్గొన్నాయి.



బెంగళూరు వెళ్లే బస్‌లకు జెండా ఊపి ప్రారంభిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

## బిసిలకు వాటా దక్కేవరకు ఉద్యమం ఆగదు: జాజుల శ్రీనివాస్‌గౌడ్

**సైఫాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** ఈ నెల 7వ తేదీన బెంగుళూరులో జరిగే జాతీయ ఓబిసి మహాసభకు వందలాది మంది బిసిలు 8 బస్‌లలో బయలు దేరారు. ఈ మేరకు బుధవారం గన్ పార్కు వద్ద బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఈ బస్‌లకు బిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ బిసిల వాటా బిసిలకు దక్కేంతవరకు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బిసిలను ఏకం చేసి దేశవ్యాప్తంగా బిసి ఉద్యమాన్ని విస్తరిస్తామని చెప్పారు. మావాటా మాకు దక్కేంతవరకు ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. దేశంలో మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని దశాబ్ధాలుగా బిసిలు పోరాటం చేస్తున్నప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మండల్ సిఫార్సులను అమలు చేస్తున్నామని పార్లమెంట్‌లో ప్రకటించిన ఆగస్టు 7న ప్రతి ఏడాది దేశంలోని 29 రాష్ట్రాలను ఏకం చేస్తూ జాతీయ ఓబిసి మహాసభలను దేశంలోని అన్ని రాష్ట్రాలలో నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగానే ఈ నెల7వ తేదీన బెంగుళూరులో జాతీయ ఓబిసి 11వ మహాసభను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభకు పలు రాష్ట్రాల నుంచి 1000మంది ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు గుజ్జ కృష్ణ, గణేషాచారి తదితరులు పాల్గొన్నారు.

## టీజీసీపీజీసెట్-2026లో 93.54 శాతం అర్హత

### చివరి వారంలో కౌన్సెలింగ్ ప్రారంభం

### ఫలితాలను విడుదల చేసిన ఉన్నత విద్యా మండలి ఛైర్మన్

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు5:** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలలలో 2026-27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీసీపీజీసెట్-2026లో 93.54 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించారు. సీపీగెట్ కౌన్సెలింగ్‌ను నెలాఖరులో ప్రారంబించనున్నారు. సీపీగెట్-2026 ఫలితాలను ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి బుధవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్ ప్రొఫెసర్ ఈ పురోషోత్తం, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ కె రాజేందర్ పాల్గొన్నారు. కలిసి ఫలితాలను విడుదల చేయనున్నారు. సీపీగెట్-2026 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు జులై 8 నుంచి 16 వరకు జరిగాయి. 39 సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు మూడు సెషన్‌లలో నిర్వహించారు. మరో 6 సబ్జెక్టులకు సంబంధించి అందుబాటులో ఉన్న సీట్ల కంటే తక్కువ మంది దరఖాస్తు చేసుకోవడంతో వారికి ప్రవేశ పరీక్ష నిర్వహించకుండానే అర్హత సాధించినట్టుగా ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 52,697 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 45,462 మంది అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) ప్రవేశ పరీక్షలకు హాజరు కాగా వారిలో 42,526 మంది(93.54శాతం) అర్హత సాధించారు. కౌన్సెలింగ్‌ను చివరి వారంలో ప్రారంభించి నెలాఖరు నాటికి పూర్తి చేయనున్నట్టు అధికారులు ప్రకటించారు. గత ఏడాది 63,076 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 53,317 మంది పరీక్షలకు హాజరయ్యారు. గత ఏడాది రాష్ట్రంలో 42,437 సీట్లు అందుబాటులో ఉండగా, అందులో కేవలం 18,984 మంది మాత్రమే చేరారు. గత ఏడాది ప్రవేశాలు పొందిన వారిలో 74 శాతం మంది మహిళలు ఉన్నారని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు.

## హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ అట్టర్ ఫ్లాప్

### మున్సిపల్, హోం, విద్యా శాఖలను నిరక్ష్యంల్లో చేసిన రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి

### బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి. సుభాష్ తీవ్రంగా మండి పడ్డారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు అశోక్ ముస్తాపురే, సందీప్ సాయి, మీడియా ప్యానెలిస్ట్ లు రాజు ముదిరాజ్, సురేష్ గౌడ్ లతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు 100 రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఈరోజు వరకు ఏ ఒక్క శాఖలోనూ విజయం సాధించలేకపోయింది. పాలనను గాలికొదిలేసి కేవలం ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీల ద్వారా పేపర్, టీవీ ప్రకటనలతో మోత్ పబ్లిసిటీ చేసుకోవడానికే ప్రాధాన్యమిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఫల్యాలపై ఏకంగా 1,000 పేజీల పుస్తకాన్ని ప్రచురించే పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు అశోక్ నగర్‌కు రాహుల్ గాంధీని తీసుకొచ్చి నిరుద్యోగులకు జాబ్ గ్యారెంటీ పేరుతో డ్రామాలు ఆడారని, తీరా అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్‌ను పూర్తిగా పక్కనబెట్టారని సుభాష్ విమర్శించారు.

రూ. 14,000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బాకీలను విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వక దాదాపు 22 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన ప్రభుత్వమే వారిని "క్రిమినల్ వేస్ట్" అని సంబోధించడం అత్యంత దురదృష్టకరం. ఫీజు రీయింబర్స్మెంట్ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనల పేరుతో పదే పదే తిరుగుతున్నారే తప్ప, రాష్ట్రానికి తీసుకొచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేసే ధైర్యం చేయడం లేదని సుభాష్ ఎద్దేవా చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాలయాపన చేస్తూ తెలంగాణను ఫ్యూచర్‌లెస్ సిటీగా మార్చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్టార్టప్ ఇండియా ద్వారా దేశంలో యువతకు అనేక అవకాశాలు కల్పిస్తుంటే, తెలంగాణలో మాత్రం విద్యార్థులు, నిరుద్యోగులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడేలా కాంగ్రెస్ పాలన తయారైందని పేర్కొన్నారు.

# 2కోట్ల జనాభా చెత్త మా వద్దే

## కేంద్ర మంత్రి ఖట్టర్‌కు బిజెపి ఎంపి ఈటల ఫిర్యాదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** జవహర్ నగర్ డంప్ యార్డ్‌కు ప్రతి రోజూ చేరుతున్న సుమారు పది వేల మెట్రిక్ టన్నుల చెత్తను మహానగరమైన ఢిల్లీలో కాలుష్యం లేకుండా చేస్తున్న విధంగా ఆధునిక పద్ధతిలో రీ సైక్లింగ్, చెత్త నిర్వహణ (వేస్ట్ మేనేజ్‌మెంట్) చేపడతామని కేంద్ర మంత్రి ఖట్టర్ హామీ ఇచ్చారని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. బుధవారం ఎంపీలు ఈటల రాజేందర్, డికె అరుణ తదితర ఎంపీలు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి చర్చించారు. అనంతరం ఎంపీ ఈటల మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ జనాభా 30 లక్షల మంది ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన జవహర్ నగర్ డంపు యార్డ్ ఇప్పుడు రెండు కోట్ల మంది జనాభాకు చెత్త వేసే ప్రాంతంగా మారిందని అన్నారు. ఈ విషయంపై గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించినప్పుడు కూడా



కేంద్రం దృష్టికి తీసుకెళ్ళారని గుర్తు చేశారు. దీనిపై తాను సుప్రీం కోర్టులో కేసు వేశానని, రేవంత్ రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు కేసు వేసినట్లు చెప్పారు. కానీ ఆయన సిఎం అయినప్పటికీ ప్రజల రాత మారలేదని, ఫలితం శూన్యంగా మిగిలిపోయిందని విమర్శించారు. గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త వల్ల 40 కిలో మీటర్ల పరిధి వరకూ కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. లక్షల మంది ఆరోగ్యం దెబ్బతింటున్నదని, సంపాదించినదంతా ఆసుపత్రులకే ఖర్చు చేయాల్సి వస్తున్నదని ఆయన బాధను వ్యక్తం చేశారు. ఈ విషయంపై కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కలిసి దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరానని చెప్పారు. ఢిల్లీ లాంటి నగరంలో చెత్తను మేనేజ్ చేస్తున్నట్లే, హైదరాబాద్‌లో కూడా ఆ పద్ధతులు అవలంబించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ కెపాసిటీ కేవలం 3,500 మెట్రిక్ టన్నులు మాత్రమే కాగా, నిత్యం 10 వేల మెట్రిక్ టన్నుల చెత్త వస్తోందని అసలు ఆ ప్లాంట్ సరిగ్గా పనిచేస్తోందో లేదో పర్యవేక్షించే నాథుడే లేడని ఎంపీ ఈటల విమర్శించారు.

## మేడిపల్లిలో 8 నెలల బాలుడి కిడ్నాప్ మూడు గంటల్లో ఛేదించిన పోలీసులు

**ఉప్పల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** పోలీసులు సకాలంలో స్పందించడంతో ఓ బాలుడి కిడ్నాప్ కేసు సుఖాంతమైంది. మేడిపల్లిలో కిడ్నాప్‌కు గురైన 8నెలల బాలుడి కిడ్నాప్ కేసును పోలీసులు కేవలం మూడు గంటల్లోనే ఛేదించారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, ప్రత్యక్ష సాక్షుల సహకారంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు బాలుడిని అపహరించిన మహిళను అదుపులోకి తీసుకుని, చిన్నారిని క్షేమంగా రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారు. బుధవారం రాత్రి మేడిపల్లిలో డీసీపీ సురేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మేడిపల్లి పరిధిలోని ఎన్ఎన్ కాలనీలో కొట్టే శివరామ్, స్పందన దంపతులు నివాసముంటున్నారు. వీరికి వైష్ణవ్ రుద్రాంశ్ (8నెలలె) ఉన్నాడు. తమ కుమారుడు బుధవారం మధ్యాహ్నం అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసిన వెంటనే మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. చిన్నారి అదృశ్యం కావడంతో పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. విచారణలో భాగంగా



కిడ్నాప్‌కు గురైన బాలుడిని తల్లికి అప్పగించిన డిసిపి సురేష్‌కుమార్, ఎసిపి మోహన్‌కుమార్

బాలుడు కనిపించకుండా పోయిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. సాంకేతిక ఆధారాలతో పాటు ప్రత్యక్ష సాక్షులు ఇచ్చిన సమాచారాన్ని సేకరించి అనుమానితురాలి కదలికలను గుర్తించారు. విచారణలో కేవలం మూడు గంటల్లోనే బాలుడిని అపహరించిన మహిళ నల్లా దుర్గా భవాని (32)గా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి చిన్నారిని సురక్షి తంగా రక్షించి, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రాథమిక విచారణలో నిందితురాలు గతంలో గర్భం దాల్చి శిశువును కోల్పోయిందని, బాబు చనిపోయాడనే విషయాన్ని భర్తకు తెలియజేయలేదని, అనంతరం భర్త తన కుమారుణ్ణి చూపించాలని ఒత్తిడి తేవడంతో నిందితురాలు తీవ్ర మానసిక ఆవేదనకు గురైనట్లు పోలీసులు తెలిపారు. అదే కారణంతో బాలుడిని అపహరించినట్లు వెల్లడిం చినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన మరింత దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి చిన్నారిని క్షేమంగా రక్షి ంచిన మేడిపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఉప్పల్ జోన్ డీసీపీ అభినందించారు. ఈ సందర్భంగా చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన సీఐ జలంధర్ రెడ్డి, ఎస్ఐ నర్సింగ్ రావు, ఎస్ఐ శ్రీనివాస్, ఎస్ఐ శ్రీను, కానిస్టేబుళ్లు నవీన్, శ్రీకాంత్, రాజులకు రివార్డులను అందజేశారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 22ఏ భూముల పేరిట ఒక్క అర్హుడికి అన్యాయం జరగదు

### కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు

### అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

### 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులను కాపాడటం, అదే సమయంలో ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మేడ్చల్-మల్కాజిగిరి అదనపు కలెక్టర్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాలి

22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు. ప్రజావాణిలో ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే విచారణ పూర్తి చేసి విధిగా పరిష్కరించాలని ఆదేశించారు. 22ఏ భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల గడువులోనే అన్ని ప్రక్రియలు పూర్తి చేసి తుది నిర్ణయం తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 22ఏ కు సంబంధించిన కేసులలో కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని పరిష్కరించాలని ప్రజలకు న్యాయం జరిగేలా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. 22ఏ జాబితాలో ఉన్న భూములపై సమగ్ర పరిశీలన చేసి తుది నిర్ణయం తీసుకునే అధికారం జిల్లా కలెక్టర్లకు ఉందని గుర్తుచేస్తూ, ప్రజల హక్కులు - ప్రభుత్వ ప్రయోజనాలు రెండింటినీ సమతుల్యం చేస్తూ పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

## రాహుల్ గాంధీ వ్యాఖ్యలను భవిష్యత్తు తరాలు క్షమించవు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** పిల్లలు తప్పు చేస్తే పెద్దలు ఆ తప్పులను సరిదిద్దాలి. వారిని సరైన మార్గంలో నడిచేలా, బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా మార్గదర్శనం చేయాలి. తప్పుడు మార్గంలో.. నోటికొచ్చినట్టు దురుసుగా, అసభ్యకరంగా మాట్లాడిన వారిని వెనుకేసుకొచ్చేలా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మాట్లాడటం దారుణం అని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, వారి మాతృమూర్తిని జుగుప్సాకరంగా దుర్భాషలాడిన వారిని వెనుకేసుకురావడం దురదృష్టకరం అని పేర్కొన్నారు.

రాహుల్ గాంధీ కుటుంబసభ్యులను ఇలాగే దుర్భాషలాడుతూ తిడుతూ ఎవరైనా మాట్లాడినా..పోస్టులు పెట్టినా ఇలాగే వారిని వెనుకేసుకొస్తారా? అలాంటి ప్రవర్తనను మీరు స్వాగతిస్తారా? చెప్పండి అని ప్రశ్నించారు. సొంత తల్లిని అన్ని మాటలు అన్నా కూడా ప్రధానమంత్రి చాలా హుందాగా, బాధ్యతాయుతంగా, పెద్దమనిషి తరహాగా వ్యవహరించారు. చిన్న పిల్లలతో వారి భాషలో మాట్లాడారు. చిన్న పిల్లలన్నాక తప్పులు చేస్తారని, వారిని సరైన దారిలో పెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, టీచర్లు, సమాజానిదేనని ఆయన సున్నితంగా గుర్తుచేశారు అని పేర్కొన్నారు. ప్రధాని మాటల్లో ఎలాంటి ఆగ్రహం, ద్వేషం లేదు. కేవలం క్షమాగుణం, బాధ్యత మాత్రమే కనిపించాయి. మోదీ మాటలకు స్పందించిన ఓ విద్యార్థిని స్వచ్ఛందంగా ముందుకొచ్చి క్షమాపణ చెప్పారు. ఇది భారతీయ నాగరికత విలువలను ప్రతిబింబిస్తోంది అని పేర్కొన్నారు. పెద్దల పట్ల గౌరవం, ప్రజా జీవితంలో గౌరవప్రదంగా ఎలా ప్రవర్తించాలో, తప్పు చేసే వారిని క్షమించే మనస్తత్వం, వారిని సరైన మార్గంలో నడిపించే దృక్పథం ఉండాలని, ఇవన్నీ మనకు తరతరాలుగా మన పెద్దలు నేర్పిన పాఠాలు అని పేర్కొన్నారు. యువత తమ తప్పును తామే గుర్తించి, స్వచ్ఛందంగా క్షమాపణ చెప్పినప్పుడు రాహుల్ గాంధీ ఎందుకు అంత అసహనానికి గురవుతున్నారు? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఎలాగూ తన తప్పుల నుంచి నేర్చుకోవడానికి ఇష్టపడరు. అందరూ కూడా తనలాగే ఉండాలని, ఆలోచించాలని రాహుల్ గాంధీ అనుకుంటున్నారు కావొచ్చు. అవమానకరమైన భాష వాడే రాహుల్ గాంధీని నేటి తరం చీదరించుకుంటోందన్నారు. భవిష్యత్తు తరాలు కూడా ఇలాంటి రాజకీయ నేతలను పూర్తిగా తిరస్కరిస్తాయి. బాధ్యత గల ప్రతిపక్ష నేతగా దేశ యువతకు స్ఫూర్తినిచ్చేలా ఆదర్శంగా మెలగాలి.. కానీ ఆ జాడలు రాహుల్ వద్ద కనిపించడం లేదన్నారు. వ్యక్తిత్వాన్ని, క్రమశిక్షణను, బాధ్యతను పెంపొందించే వ్యవహారశైలి రాహుల్ వద్ద లేదు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం అవమానకరమైన భాషను.. అదేదో సాధారణమే అన్నట్టు మాట్లాడే నాయకులు దేశానికి అవసరం లేదన్నారు.

## ఒక్క ప్రాజెక్టుకూ అనుమతి తేలేని కాంగ్రెస్ సర్కార్

### సమ్మక్క,సారక్క ప్రాజెక్టుపై చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారా?: హరీశ్‌రావు ఘాటు వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** తెలంగాణకు ఇచ్చిన ప్రాజెక్టులు రద్దు చేయాలనే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో 7 ప్రాజెక్టులకు అనుమతులు తెస్తే.. ఆ అనుమతులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తే, జీఆర్ఎంబీ ఎజెండాలో పెట్టారని పేర్కొన్నారు. కాళేశ్వరం, సీతారామ లాంటి 7 ప్రాజెక్టులు రద్దు చేయండి అని అజెండాలో పెడితే తెలంగాణ నోటికాడ ముక్క లాక్కొండని ప్రతిపాదించినట్లేనన్నారు. జీఆర్ఎంబీలో రెండు రాష్ట్రాలుంటాయి. కేంద్రప్రభుత్వం చైర్మన్‌గా ఉంటే.. ఓవైపు తెలంగాణ ఇంజనీర్లు, మరోవైపు ఏపీ ఇంజనీర్లు ఉంటారు.. జీఆర్ఎంబీలో ఈ ఎజెండా తయారవుతుంటే తెలంగాణ ఇంజనీర్లు ఏం చేస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవేళ తెలంగాణ ఇంజనీర్లు ఈ విషయాన్ని రేవంత్ రెడ్డికి చెప్పినా ఆయన పట్టించుకోలేదా..? అసలు ఈ ఎజెండా ఎట్లా వచ్చింది. ఇచ్చిన ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయాలని అడిగే ధైర్యం ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కడిది అని ప్రశ్నించారు. తెలంగాణ అంటే ఎట్లా కనబడుతుంది మీకు. త్యాగాల పునాదుల మీద, పోరాటాల మీద సాధించుకున్న ఈ తెలంగాణ నీళ్ల కోసం జరిగిన ఈ ఉద్యమంలో కేసీఆర్ కష్టపడి 383 టీఎంసీల గోదావరి జలాలకు అనుమతులు తెచ్చారని పేర్కొన్నారు. తెచ్చిన అనుమతులు రద్దయితయా..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 3 ఏండ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి తేలేదు.. ఒక్క టీఎంసీకి కూడా క్లియరెన్స్‌లు తేలేదు అని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత డీపీఆర్‌లు రిటర్న్ వచ్చినయి. సమ్మక్క బ్యారేజ్, పాలమూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్ రిటర్న్ వచ్చింది. వార్ధా డీపీఆర్ రిటర్న్ వచ్చింది ఒక్కో ప్రాజెక్టు వాపసు వస్తున్నాయి. పైగా బీఆర్ఎస్ తెచ్చిన అనుమతులు రద్దు చేయాలనే అంశం ఎజెండాలోకి వచ్చింది. నిద్ర పోతున్నారా? మీకెమన్నా సోయి ఉందా?తెలంగాణ భవిష్యత్తుతో అడుకుంటారా మీరు? అని ప్రశ్నించారు. ఎంత చేతకాని దద్దమ్మ ప్రభుత్వం ఇదని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ముగ్గురు ముఖ్యమంత్రులు కర్ణాటకలో కలిసిన తర్వాత సమ్మక్క, సారక్క ప్రాజెక్టును ఏపీ కోసం వదులుకునేందుకు మన రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకున్నదని వార్తలు బయటకు వస్తున్నాయి. దీనికి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముగ్గురు ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, డీకే శివ కుమార్ సమావేశంలో సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు 47 టీఎంసీల మన రాష్ట్ర వాటాను ఆంధ్ర ప్రదేశ్ కోసం వదులుకోవడానికి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నాడా..? లేదా? చెప్పాలన్నారు. మీరు కర్ణాటక సమావేశం తర్వాత, తుంగభద్ర గేట్ల ఓపెనింగ్ తర్వాత 47 టీఎంసీలు వదులుకుంటున్నరని వార్తలు వచ్చినయి. ప్రభుత్వం స్పందన లేదన్నారు. ఇప్పుడు జిఆర్ఎంబీ అజెండాలో సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు 47 టీఎంసీల నీళ్ల ఇచ్చేదే లేదని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం అంటుంది. దీని మీద మీ స్టాండ్ ఏంటి..? ఈ 47 టీఎంసీలను వదులుకున్నరా..వదులుకోలేదా..? అని హరీశ్ రావు అడిగారు. ఈ 47 టీఎంసీలకు మేము ప్రభుత్వంలో ఉన్నప్పుడే అన్నీ అనుమతులు తెచ్చాం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్లా వదులుతుంది..?ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నియోజకవర్గానికి కూడా ఈ నీళ్ల పోతాయి.. తెలంగాణ ప్రభుత్వం స్టాండ్ ఏంటి..? ఎట్లా వదులుకుంటరు మీరు..? అని హరీశ్ రావు ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు తెలంగాణ ప్రజల నోటికాడి బుక్కను లాక్కోవాలని చూస్తున్నాడని మండిపడ్డారు. జిఆర్ఎంబీఅజెండాలో తెలంగాణకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించింది. తెలంగాణ ప్రాజెక్టులను ఆపాలనికేంద్రానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లేఖ రాసిందన్నారు. తెలంగాణను పోరాటాలతో తెచ్చుకున్నాం, నీళ్ల కోసం కొట్లాడాం అదే నీళ్లలో అన్యాయం జరిగితే తెలంగాణ ఊరుకోదు జాగ్రత్త చంద్రబాబు అని హెచ్చరించారు.

## రాష్ట్ర వ్యాప్తంగా 7 నెలల పాటు బిజెపి ఆధ్వర్యంలో సమరసత సంకల్ప అభియాన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఆగస్టు5:** భారతదేశ సాంస్కృతిక, భక్తి ఉద్యమంలో గొప్ప విప్లవం తీసుకొచ్చిన సంత శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఏడు నెలల పాటు సుదీర్ఘంగా సమరసత సంకల్ప అభియాన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. బుధవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అభియాన్ కన్వీనర్ వేముల అశోక్, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచన మేరకు సంత రవిదాస్ మహారాజ్ భక్తి ఉద్యమాన్ని, వారి సిద్ధాంతాలను దేశంలో అటక్ నుండి కటక్ వరకు, కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రచారం చేసేందుకు బిజెపి శ్రీకారం చుట్టింది. మొన్నటి ఆషాఢ పౌర్ణమి నాడు రవిదాస్ మహారాజ్ జన్మస్థలమైన కాశీ (వారణాసి)లోని శ్రీర్ గోవర్ధన్ పూర్‌లో ప్రారంభమైన ఈ జయంతి వేడుకలు, రాబోయే మాఘ పౌర్ణమి (20 ఫిబ్రవరి 2027) వరకు దాదాపు ఏడు నెలల పాటు నిరంతరాయంగా కొనసాగుతాయి. తీవ్రమైన మతోన్మాదం, కుల వివక్ష తాండవిస్తున్న రోజుల్లో చర్మకార కుటుంబంలో జన్మించిన రవిదాస్, తన కర్మ మార్గమే దైవ మార్గమని చాటారు. భక్తి మార్గం ద్వారా సమాజంలో గొప్ప పరివర్తన తెచ్చి, కులాలకు అతీతంగా అందరికీ గురుతుల్యులయ్యారు. వారి గురువైన రామానంద సాగర్ మార్గదర్శనంలో భక్తి మార్గంతో పాటు, ప్రజలు శారీరకంగా బలంగా ఉండటానికి అక్కాడాలు (వ్యాయామ శాలలు) ప్రారంభించి సాంస్కృతిక విప్లవానికి నాంది పలికారు.

## సైబర్ నేరగాళ్ల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలి: కొత్వాల్ సజ్జనార్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 5, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్ల పట్ల అన్ని వర్గాల వారు ముఖ్యంగా విశ్రాంత అధికా రులు నిరంతరం అప్రమత్తంగా వుండాలని సిటీ కొత్వాల్ సజ్జన్నర్ అన్నారు. తమ కష్టార్జితాన్ని సైబర్ నేర గాళ్ల పరం చేయవద్దని ఆయన సూచించారు. సిసిఎస్ ఆధ్వర్యంలో బుధవారంనాడు విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్ల తరపున జరిగిన సైబర్ జాగరూకత దివస్‌లో సజ్జన్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజి పెరిగే కొద్దిసైబర్ నేరాలు కొత్త తరహాలో వస్తున్నాయని అన్నారు. జంట నగరాలలో దొంగత నాలు, దోపిడీల వంటి నేరాల వల్ల ఏడాదిలో 30 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లితే సైబర్ నేరాల వల్ల 400 కోట్ల రూపాయలు పోగొట్టుకోవ డం దారుణమైన అంశమని ఆయన తెలిపారు. సగటున రోజుకు కోటి రూపాయలకు పైగా మనం సైబర్ నేరాల వల్ల నష్టపోతున్నామని ఆయన తెలిపారు. విశ్రాంత ఉద్యోగులను, సీనియర్ సిటిజన్లను ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారని, డిజిటల్ అరెస్టు, ఇతరత్రా నే రాలతో సైబర్ నేరగాళ్లు అందినంత దోచుకుంటున్నారని ఆయన తెలిపారు. ఈ విషయంలో విశ్రాంత ఉద్యోగులతో పాటు సీనియర్ సిటిజన్లకు తాము భద్రత కల్పిస్తున్నామ ని సిపి తెలిపారు. సీనియర్ సిటిజన్లు ఫించన్ సేవలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు, డిజిటల్ అరెస్టుల విషయంలో అప్రమత్తంగావుండాలని ఆయన కోరారు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రకటనల విషయంలోనూ ఎవరినీ నమ్మవద్దని ఆయన కోరారు. ఇంట్లో పిల్లలు ఫోన్‌లు తీసుకునిఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ యాప్‌లతో భారీగా నష్టపోతున్నారని, ఈవిషయంలో అందరు జాగ్రత్తగా వుండాలని ఆయన కోరారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ఓటిపిలుచెప్పవద్దని ఆయన సూచించారు. ఈ సమావేశంలో విశ్రాంత డిజిలుమాలకొండయ్య,రతన్‌సహా అదనపు పోలీసు కమిషనర్ (సిట్ అండ్ క్రైం) శ్రీనివాస్, డిసిపి శిల్పవల్లి తదితరులు పాల్గొన్నారు.

# ఎపికి భారీగా విదేశీ పెట్టుబడులు

**పార్లమెంటులో వెల్లడించిన కేంద్రం**

**ఆహారశుద్ధి, సిమెంట్ రంగాలకు క్యూకడుతున్న విదేశీ కంపెనీలు**

**విజయవాడ,ఆగస్టు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడులు భారీగా వస్తున్నట్లు లోక్‌సభలో లిఖితంగా సహా కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కంటే కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా విదేశీ పెట్టుబడులు పెరిగాయని కేంద్రం తేల్చిచెప్పింది. 2023 24 ఆర్థిక సంవత్సరంలో రూ.760 కోట్లుగా (92.13 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఉన్నాయని వెల్లడించింది. 2024- 25 నాటికి 233.14 మిలియన్ డాలర్లకు విదేశీ ఈక్విటీ పెట్టుబడులు పెరిగాయని పేర్కొంది.2025 – 26 నాటికి ఏకంగా రూ.5,000 కోట్లకు పైగా (608.59 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వైసీపీ హయాంలో పారిశ్రామిక విధానాల్లో అనిశ్చితి వల్ల పెట్టుబడుల ప్రవాహం వెనకబడిందని చెప్పింది. 2025 – 26లో లోహ పరిశ్రమల రంగంలో అత్యధికంగా 250.67 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చినట్లు స్పష్టం చేసింది. ఆహార శుద్ధి రంగంలో 107.30 మిలియన్ డాలర్లు, సిమెంట్ ఉత్పత్తుల రంగంలో 99.90 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని పేర్కొంది. సర్వీసెస్, ఆర్‌అండ్‌డీ పరిధిలోనూ 2025 26లో 59.96 మిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది.కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన అనుకూల పారిశ్రామిక విధానాలు, ఖీఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పెట్టుబడులు ఊపందుకున్నాయని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. వైసీపీ పాలన కంటే కూటమి హయాంలో ఎఫ్‌డీఐల రికార్డింగ్ గ్రోత్... 92 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 608 మిలియన్ డాలర్లకు విదేశీ పెట్టుబడులు చేరాయని వివరించింది. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, వేగవంతమైన అనుమతులతో ఏపీ వైపు విదేశీ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. లోహ, ఆహార శుద్ధి, సిమెంట్ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది.



రామంతాపూర్ హోమియోపతి ఆసుపత్రి ముందు ఆందోళన నిర్వహిస్తున్న ఆయుష్ వైద్య విద్యార్థులు

## రెండో రోజు కొనసాగిన ఆయుష్ వైద్య విద్యార్థుల ఆందోళన

**ఉప్పల్, ఆగస్టు 5 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్య విద్యార్థులు, హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు చేపట్టిన ఆందోళన రెండో రోజుకు చేరింది. బుధవారం హైదరాబాద్ రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల వద్ద తెలంగాణ ఆయుష్ హౌస్ సర్జన్స్‌పోస్ట్ గ్రాడ్యుయేట్ జెఏసి ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయుష్ జెఏసి అధ్యక్షుడు డా.బి.రాజేష్ కళ్యాణ్, ఉపాధ్యక్షుడు డా.నితిన్ కుమార్, డా.హరిశ్రీ, డా.ముస్తాక్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి డా. జి.శ్రవణ్ రెడ్డి, డా.హబీబ్ అబ్బాస్, డా.జి.అఖిల్ కుమార్, ఎం.రాకేష్, కోశాధికారి డా.ప.శ్రవణకుమార్, డా.కృష్ణకుమార్, సంయుక్త కార్యదర్శులు డా.బి.సాహితి, ప్రణయ్ వాసుదేవ్, తదితరులు మాట్లాడుతూ తెలంగాణలో ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు చెల్లిస్తున్న స్టైపెండ్ దేశంలోనే అత్యల్పమని వారు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ తో పోలిస్తే తెలంగాణలో చెల్లిస్తున్న సైఫండ్ సగం కంటే తక్కువగా ఉందని ఆరోపించారు. జీవన వ్యయం, వసతి, ఆహారం, ప్రయాణం, విద్యా ఖర్చులు విపరీతంగా పెరిగినా గత పదేళ్లుగా స్టైపెండ్ లో ఎలాంటి పెంపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైపెండ్ అంశాన్ని ప్రస్తావించినప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని జేఏసీ పేర్కొన్నారు.. 2016 వరకు అల్లోపతి, ఆయుష్ వైద్య విద్యార్థులకు సమానంగా స్టైఫండ్ ఉండేదని, ఆ తర్వాత అల్లోపతి విద్యార్థులకు దశలవారీగా పెంచుతూ వచ్చారని, అయితే ఆయూష్ విద్యార్థులను మాత్రం పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. అల్లోపతి విద్యార్థులతో సమానంగా వివక్ష లేకుండా ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైపెండ్ తక్షణమే పెంచాలని ప్రభుత్వాన్ని జేఏసీ డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులతో అధికారులు చర్చలు జరిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



## హార్ముజ్‌ను తెరిచే ఉంచాం...సెంట్‌కామ్

**1000కిపైగా నౌకలు జలసంధిగుండా రవాణా**

**వాషింగ్టన్, ఆగస్టు 5:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ఇంధన రవాణా మార్గం హార్మూజ్ జలసంధిపై అమెరికా సైన్యం కీలక ప్రకటన చేసింది. జలసంధిని తాము పూర్తిగా మూసివేశామని ఇరాన్ చేస్తున్న ప్రచారాన్ని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ఖండించింది. అంతర్జాతీయ నౌకా రవాణాకోసం ఈ మార్గం తెరిచే ఉందని, తమ బలగాల రక్షణలో వాణిజ్య నౌకలు సజావుగా సాగుతోందని స్పష్టం చేసింది. మే నెల ఆరంభం నుంచి ఇప్పటివరకు తమ సైనిక బలగాలు 1,000కి పైగా వాణిజ్య నౌకలు హార్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటేందుకు సహాయపడ్డాయని సెంట్‌కామ్ వెల్లడించింది. వీటి ద్వారా ప్రపంచ అవసరాల కోసం సుమారు 50 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు రవాణా జరిగిందని తెలిపింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్‌కు అంతర్జాతీయ జలమార్గాలను మూసివేసే అధికారం లేదని తేల్చిచెప్పింది. ఒకవైపు జలసంధిలో స్వేచ్ఛా నౌకాయానానికి భరోసా ఇస్తూనే, మరోవైపు ఇరాన్ నౌకాశ్రయాలపై విధించిన ఆంక్షలను కఠినంగా అమలు చేస్తున్నట్లు అమెరికా పేర్కొంది. జూలై చివరినాటికి నిబంధనలు ఉల్లంఘించిన 30 నౌకలను తమ నౌకాదళం దారి మళ్లించిందని, రెండింటిని అదుపుకుని తెలిపింది. అయితే, మానవతా సాయం కింద నిత్యావసరాలు, మందులు తీసుకెళ్తున్న 30 నౌకలను అనుమతించినట్లు వివరించింది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే మొత్తం ముడి చమురు, సహజ వాయువులో (ఎల్ఎన్‌జీ) దాదాపు 20 శాతం హార్మూజ్ జలసంధి గుండానే రవాణా అవుతుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీపై డీప్‌ఫేక్ విడియోలు తొలగించండి



**ముంబయి,ఆగస్టు 5:** ఈ20 పెట్రోల్ విషయంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని లక్ష్యంగా చేసుకుని పలువురు నెటిజన్‌లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు, పోస్టులు పెట్టడంపై బాంబే హైకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. కేంద్రమంత్రిని, ఆయన కుటుంబాన్ని ఇంధన వివాదంతో ముడిపెడుతున్న ఏఐ వీడియోలు, పోస్టులను వెంటనే తొలగించాలని మెటా, గూగుల్ సహా పలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించింది. అది అత్యంత నీచమైన కంటెంట్ అని హైకోర్టు మండిపడింది. ఆన్‌లైన్‌లో ఇలాంటి పోస్టులకు చోటు ఉండకూడదని అభిప్రాయపడింది. బాధితులు న్యాయస్థానాలను ఆశ్రయించకుండానే ఇలాంటి నకిలీ పోస్టులను తొలగించడానికి ఏదైనా యంత్రాంగం ఉందా అని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రశ్నించింది. విస్తృతమైన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు తప్పుడు పోస్టులపై చర్యలు తీసుకునే యంత్రాంగం మాత్రం ఎందుకు లేదని కోర్టు నిలదీసింది. వ్యక్తుల పరువుకు భంగం కలిగించేలా ఉండే పోస్టులను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించింది. ఈ20 పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ధి పొందుతోందంటూ కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని గడ్కరీ ఇటీవల తెలిపారు. దీనిపై ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు పెడుతున్నారని పేర్కొంటూ ఆయన బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తన పరువుకు భంగం కలిగించినందుకుగానూ రూ.11 కోట్ల నష్టపరిహారం కోరారు. ఇథనాల్‌బ్లెండింగ్ కార్యక్రమం పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఇందులో తనకు వ్యక్తిగతంగా ఎలాంటి సంబంధం లేదని గడ్కరీ స్పష్టంచేశారు.

## యుపిఐ ఛార్జీలు ఎవరో ఒకరు భరించాల్సిందే!

**ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా**

**ముంబయి, ఆగస్టు 5:** యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అంశంపై ఇప్పుడే నిర్ణయానికి రావడం తొందరపాటవుతుందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను బలోపేతం చేయాలంటే దాని నిర్వహణ వ్యయాన్ని ఎవరో ఒకరు భరించాల్సిందేనని, ఆ భారం నేరుగా సాధారణ వినియోగదారులపైనే పడుతుందని ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. ద్రవ్య విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మల్హోత్రా మాట్లాడుతూ.. యూపీఐపై ఎండీఆర్ అంశం ఇంకా ప్రారంభ దశలోనే ఉందన్నారు. ప్రభుత్వం చట్ట సవరణ ప్రక్రియలో ఉందని, తుది నిర్ణయం వచ్చే వరకు వేచి చూడాల్సిందేనని చెప్పారు. వ్యవస్థ నిర్వహణకు ఖర్చు తప్పదు. ఆ ఖర్చును ఎవరో ఒకరు చెల్లించాల్సి ఉంటుంది. కానీ అది సాధారణ వినియోగదారుడే చెల్లిస్తాడని చెప్పలేం. పరోక్షంగా ఆర్థిక వ్యవస్థలోనే ఆ వ్యయం భరించే అవకాశం కూడా ఉంటుంద్ధి అని మల్హోత్రా వివరించారు. ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్ట సవరణ బిల్లు ద్వారా యూపీఐ, రూపే వంటి డిజిటల్ చెల్లింపులపై భవిష్యత్తులో ఎండీఆర్ విధించే అవకాశానికి చట్టపరమైన వెసులుబాటు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం నోటిపై చేసిన డిజిటల్ చెల్లింపు విధానాలపై బ్యాంకులు లేదా చెల్లింపు సేవల సంస్థలు ఎండీఆర్ వసూలు చేయలేవు. ప్రతిపాదిత సవరణ అమల్లోకి వస్తే ఏ చెల్లింపు విధానాలకు ఛార్జీలు ఉండాలి, వేటికి మినహాయింపు ఇవ్వాలి అనే విషయాన్ని ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా నిర్ణయించే అవకాశం ఉంటుంది. అయితే రోజువారీ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. రూ.2,000కు పైబడిన వ్యాపార చెల్లింపులపై మాత్రమే ఎండీఆర్ విధించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారని, పాలు, కూరగాయలు, కిరాణా వంటి చిన్న మొత్తాల యూపీఐ చెల్లింపులు యథాతథంగా ఉచితంగానే కొనసాగే అవకాశముందని తెలిపాయి. ప్రస్తుతం క్రెడిట్, డెబిట్ కార్డు లావాదేవీలపై ఎండీఆర్ అమల్లో ఉన్నప్పటికీ, చాలా సందర్భాల్లో ఆ వ్యయాన్ని వ్యాపారులే భరిస్తున్నారు. యూపీఐ విషయంలో కూడా తుది విధానం ఎలా ఉండాలనే దానిపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఆర్‌బీఐ కూడా ప్రస్తుతం ఎలాంటి అధికారిక ప్రతిపాదనను ప్రకటించలేదని గవర్నర్ స్పష్టం చేశారు.

## సిద్ధివినాయక ఆలయం విరాళాల చోరీపై దర్యాప్తునకు ఆదేశం

**ఐదేళ్లుగా వివరాలపై దర్యాప్తునకు డిప్యూటి సిఎం షిండే ఆదేశం**

**ముంబయి, ఆగస్టు 5:** మహారాష్ట్ర రాజధాని ముంబైలోని ప్రసిద్ధ సిద్ధివినాయక ఆలయం విరాళాల చోరీ ఆరోపణలపై డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే స్పందించారు. ఐదేళ్లుగా ఆలయానికి అందిన నగదు విరాళాలు, ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆడిట్ నిర్వహించి, సవివరమైన నివేదికను సిద్ధం చేసేందుకు అదనపు ప్రధాన కార్యదర్శి అసిమ్ గుప్తాను ఆయన నియమించారు. ప్రత్యేక ఆడిట్‌లో ఏవైనా అవకతవకలు బయటపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశంలోనే అత్యంత సంపన్న దేవాలయాలలో ఒకటిగా పరిగణించే సిద్ధివినాయక ఆలయం విరాళాలు చోరీ అవుతున్నట్లు మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధినేత రాజ్ ఠాక్రే ఆరోపించారు. ఉద్యోగుల చేతివాటం వల్ల ప్రతి ఏటా రూ.18 కోట్ల విరాళాలు దొంగతనానికి గురవుతున్నాయని పార్టీ కార్యక్రమంలో తెలిపారు. అయోధ్యలోని రామ మందిరం నుంచి రూ. 1,400 కోట్లు అదృశ్యమయ్యాయని, సిద్ధివినాయక ఆలయం కూడా ఇలాంటి సమస్యనే ఎదుర్కొంటున్నదని రాజ్ ఠాక్రే విమర్శించారు. ఎనిమిది మంది ట్రస్టీలు ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు రాసిన లేఖను ఆయన చదివి వినిపించారు. మరోవైపు సిద్ధివినాయక ఆలయ ట్రస్ట్ చైర్మన్, శివసేన షిండే వర్గం నేత సదా సర్వంకర్ కూడా ఈ ఆరోపణలను ధృవీకరించారు. అక్రమాల గురించి తాను స్వయంగా ఏసీబీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సీసీటీవీలో అనుమానాస్పదంగా కనిపించిన ట్రస్ట్ అధికారులను తొలగించినట్లు చెప్పారు. ప్రధాన నిందితుడు రాజన్ పెందుల్కర్, ఆయన తొమ్మిది మంది సహచరులను అరెస్టు చేసినట్లు వివరించారు. ఈ కేసులో 45 మందిపై చర్యలు తీసుకున్నామని, వారందరినీ సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. అలాగే డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేను మంగళవారం కలిసి విరాళాల చోరీ ఆరోపణలపై చర్చించారు.

# నెలాఖరులోగా రెండో వంతెనపై రాకపోకలు పునరుద్ధరణ

**వరద కోతకు చెక్.. రిటైనింగ్ వాల్ నిర్మాణం**

**నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం**

**ఎపి-ఛత్తీస్‌గఢ్-ఒడిశా ప్రయాణాలకు ఊరట**

**భద్రాచలం, ఆగస్టు 5(ప్రభాతవార్త):** భద్రాచలం గోదావరిపై నిర్మించిన రెండో వంతెనపై ఈ నెలాఖరులోగా రాకపోకలను పునరుద్ధరిస్తామని తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్, చేనేతజౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గత వరదల్లో దెబ్బతిన్న అప్రోచ్ రోడ్డు వద్ద జరుగుతున్న పునర్నిర్మాణ పనులను బుధవారం పరిశీలించిన ఆయన, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.మంత్రి మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయానికి దేశ విదేశాల నుంచి ప్రతి రోజు వేలాది మంది భక్తులు వస్తుంటారని, ముఖ్యంగా పుష్కరాలు, శ్రీరామనవమి కల్యాణ మహోత్సవాల వంటి సందర్భాల్లో లక్షలాది మంది భక్తులు తరలివస్తారని అన్నారు. ఒకే వంతెనపై ట్రాఫిక్ భారాన్ని తగ్గించేందుకు రెండో వంతెన నిర్మాణాన్ని చేపట్టినట్లు వివరించారు.2015 గోదావరి పుష్కరాల సందర్భంగా ఏర్పడిన తీవ్ర ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని అమరావతి–జగదల్పూర్ జాతీయ రహదారిలో భాగంగా భద్రాచలం వద్ద రెండో వంతెన నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పనులు నత్తనడకన సాగాయని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్మాణాన్ని వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు.గత వరదల్లో అప్రోచ్ రోడ్డు కోతకు గురికావడంతో ప్రస్తుతం శాశ్వత పరిష్కారంగా బలమైన రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడుతున్నామని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి వరదలు వచ్చినా అప్రోచ్ రోడ్డు దెబ్బతినకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ నెలాఖరులోగా అన్ని పనులు పూర్తి చేసి వంతెనపై పూర్తిస్థాయిలో రాకపోకలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రెండో వంతెన పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. అలాగే రామాలయ అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు.రెండో వంతెన అందుబాటులోకి రావడం వల్ల ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు భద్రాచలం మీదుగా ప్రయాణించే వాహనదారులకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సారపాక ఉపసర్పంచ్ కన్నదారి రమేష్, బూర్గంపాడు, భద్రాచలం మండలాల కాంగ్రెస్ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 10% పెరిగిన పంటల విస్తీర్ణం

**-ఎల్‌నినో ప్రభావం నుంచి రైతుకు కొంత ఉపశమనం**

**అత్తాపూర్ ఆగస్టు5,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత ఏడాది స్థాపించిన సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీలోని రిమోట్ సెన్సింగ్ అండ్ జి.ఐ.ఎస్ వ్యవస్థ సేకరించిన ఉపగ్రహ చాయా చిత్రాల విశ్లేషణ ద్వారా వచ్చిన తాజా పంటల విస్తీర్ణం వివరాలని బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య విడుదల చేసారు.జూలై 29 వరకూ తెలంగాణా లో సాధారణ పంటల విస్తీర్ణం సుమారు 98 లక్షల 13 వేల ఎకరాలు కాగా అందులో సుమారు 33 లక్షల ఎకరాల విస్తీర్ణం లో (34 శాతం ) ఇప్పటికే వివిధ పంటల విత్తనాలు నాటారని ఆయన తెలిపారు.గత ఏడాదితో పోలిస్తే ఇది పది శాతం అధికమని జానయ్య పేర్కొన్నారు. అత్యధిక విస్తీర్ణంలో పంటలు విత్తిన జిల్లాల్లో యాదాద్రి భువనగిరి(57 శాతం), మేడ్చల్ మల్కాజ్ గిరి (54 శాతం ),జనగామ (51 శాతం) తొలి మూడు స్థానాల్లో ఉన్నాయని ఆయన వివరించారు.అదే విధంగా అతి తక్కువ విస్తీర్ణంలో విత్తనాలు నాటిన జిల్లాల్లో ఖమ్మం( 16 .5 శాతం), వనపర్తి (17.3 శాతం),వరంగల్ (20.1 శాతం) చివరి మూడు స్థానాల్లో ఉన్నాయన్నారు.పంటల వారీ వివరాలు పరిశీలించినట్లయితే గత ఏడాది వలే ఈ ఏడాది కూడా వరి,పత్తి,మొక్కజొన్న పంటలు సాగు విస్తీర్ణం లో సింహ భాగం ఆక్రమించాయని జానయ్య తెలిపారు

## సంతకాన్ని ఫోర్జరీ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**హైదరాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** హైడ్రా కమిషనర్ సంతకాన్ని పోర్జరీ చేసి నకిలీ ఫైర్ ఎన్‌వోసిలను ఇంటర్ బోర్డుకు సమర్పించిన ప్రైవేటు, కార్పోరేట్ జూనియర్ కళాశాలల వ్యవహారం రాష్ట్ర విద్యా వ్యవస్థను కుదిపేసే అత్యంత తీవ్రమైన నేరమని ఎఐవైఎఫ్ తెలంగాణ రా ష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ అధికారుల సంతకాలను నకిలీ చేసి అనుమతులు పొందే స్థాయికి విద్యా మాఫియా బరితెగించిందంటే ప్రభుత్వ పరిరక్షణ ఎంత దారుణంగాఆ విఫలమైందో అర్థమవుతుందని సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరి ధర్మేంద్ర విమర్శించారు. అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## సెప్టెంబరు 8,9,10 తేదీలలో ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

**హైదరాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** దేశ సంపద కొద్ది మంది కార్పోరేట్లకు కాదు దేశ ప్రజలకే హక్కుగా దక్కాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. దేశాన్ని పాలించే ప్రభుత్వాల ప్రధాన బాధ్యత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రతి యువకుడికి ఉపాధి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడం, అలాగే ప్రతి కుటుంబానికి అందుబాటులో వైద్యం, రైతులకు గిట్టుబాటు ధర, కార్మికుడికి గౌరవప్రదమైన జీవనం, మహిళలకు భద్రత, ప్రజాస్వామ్య హక్కులకు రక్షణ కల్పించడమని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.వలిఉల్లాఖాద్రీ, కల్లూరి ధర్మేంద్ర స్పష్టం చేశారు. సెప్టెంబరు 8,9,10 తేదీలలో యాదగిరిగుట్టలో జరిగే ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌లను బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో వారు ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. ఈ సభలలో కీలకంగా వివిధ అంశాలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

# కోటిన్నర విలువైన గంజాయి స్వాధీనం

**ముగ్గురు నిందితుల రిమాండ్**

**మరో 8మంది పరార్..**

**కూసుమంచి, ఆగస్టు 5 (ప్రభాతవార్త )** కూసుమంచి మండలం ఖమ్మం సూర్యాపేట నేషనల్ హైవే జీలచెరువు సమీపంలో కూసుమంచి పోలీసులు ఈగల్ టీం సంయుక్త ఆపరేషన్ లో భాగంగా మంగళవారం భారీ ఎత్తున నిషేధిత గంజాయిని పట్టుకున్నారు. ఈ ఆపరేషన్ కు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... మంగళవారం మధ్యాహ్నం వాహన తనిఖీలలో భాగంగా తనిఖీలు చేపడుతున్న సందర్భంగా హైవే రహదారిపై ఓ బొలెరో వాహనం, ఒక కారు, ఒక మోటార్ సైకిల్ ను ఆపగా వాహనదారులు అనుమానాస్పదంగా వ్యవహరిస్తూ పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని నిలువరించగా ఈ వాహనాల్లో సుమారు 331 కిలోల గంజాయి బయటపడింది. ఈ గంజాయి తరలిస్తున్న వ్యక్తులు వంతల గోపీనాథ్, ఎం నాగరాజు, కిలో లక్ష్మణ్ లను అదుపులోకి తీసుకొని విచారించగా తాము ఒరిస్సా నుండి గంజాయిని తరలిస్తున్నట్టు తెలిపారు అన్నారు. ఈ సందర్భంగా పోలీసులు వారి వద్ద నుండి గంజాయి తరలిస్తున్న వాహనాలను రెండు సెల్ ఫోన్లను పదివేల రూపాయలు నగదు మోటార్ సైకిల్ ను స్వాధీనపరచుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు ఒక కోటి 65 లక్షల 50 వేలు ఉంటుందని తెలిపారు. ఇంకా ఈ గంజాయి తరలింపు తో సంబంధం ఉన్న బురిడీ సీతారాం, అలంగి లైసెన్ శివప్ప, మనోజ్ కుమార్, దొండో అలియాస్ రాజు, కుర్ర లోకోన్, మల్లికార్జున్, మన్యం కార్తీక్ కుమార్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఈ ఆపరేషన్లో కూసుమంచి పోలీస్ సిబ్బందితోపాటు ఈగల్ టీం సభ్యులు పాల్గొన్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

# అమెరికాకు షాక్ ఇచ్చిన ఇజ్రాయెల్

**ట్రంప్ ప్రతిపాదనను అంగీకరించని నెతన్యాహు**



**టెల్ అవీవ్, ఆగస్టు 5:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు షాకిచ్చారు. గాజా కోసం అమెరికా మద్దతుతో రూపొందించిన ప్రణాళికకు ఇజ్రాయెల్ తిరస్కరించింది. అమెరికా ప్రతిపాదనను అంగీకరించలేదని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. హమాస్ పూర్తిగా నిరాయుధీకరణకు అంగీకరించిన తర్వాతే గాజాలో ప్రస్తుతం ఉన్న ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి వెళ్లేలా హామీలు ఇచ్చినప్పటికీ ఈ ప్రణాళికపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని వెల్లడించారు. తన సోషల్ మీడియా ఖాతాల్లో విడుదల చేసిన వీడియోలో నెతన్యాహు ఈ అంశంపై స్పందించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బృందం హమాస్‌ను నిరాయుధీకరించడం, గాజాను సైనిక రహిత ప్రాంతంగా మార్చడం సాధ్యమవుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రణాళికను మేం పరిశీలిస్తున్నాం. వారు మాకు ఒక ముసాయిదాను పంపారు. అయితే దానికి మేం అంగీకరించలేదు. అది మా ముసాయిదా కాదు. మా అభిప్రాయాలు, సూచనలను వారికి పంపించాం అని నెతన్యాహు స్పష్టం చేశారు.అమెరికా మద్దతుతో ఏర్పాటైన బోర్డ్ ఆఫ్ పీస్ ప్రతినిధులతో నెతన్యాహూ సమావేశమయ్యారు. హమాస్ నిరాయుధీకరణ పూర్తయిన తర్వాతే గాజాలో ప్రస్తుతం ఇజ్రాయెల్ సైన్యం ఉన్న ప్రాంతాల నుంచి ఉపసంహరణ చేపట్టాల్సి ఉంటుందని ఈ సమావేశంలో హామీలు లభించినట్లు సమాచారం. ఈ ఒప్పందాన్ని తిరస్కరించాలంటూ నెతన్యాహుపై ఆయన పాలక కూటమిలోని వామపక్ష అతివాద వర్గాల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఈ ప్రణాళికపై మరోసారి ఓటింగ్ నిర్వహించాలని ఇద్దరు అతివాద మంత్రులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రతిపాదన తొలుత చర్చించిన అంశాలకు అనుగుణంగా లేదని వారు అభిప్రాయపడ్డారు. ఈ ఇద్దరు మంత్రులు సభ్యులుగా ఉన్న ఇజ్రాయెల్ భద్రతా కేబినెట్ ఇప్పటికే ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళికలో భాగంగా గాజా స్ట్రిప్‌లో అంతర్జాతీయ శాంతి పరిరక్షక దళాలను మోహరించే అంశం కూడా ఉన్నట్లు సమాచారం. అక్టోబర్ 27న జరగనున్న ఎన్నికలకు ముందు నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీలో ప్రాథమిక ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో నెతన్యాహుకు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఇజ్రాయెల్ ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్, సెటిల్మెంట్స్ మంత్రి ఒరిట్ స్ట్రూక్ మరోసారి ఓటింగ్ నిర్వహించాలని కోరడాన్ని కేవలం ఎన్నికల ప్రచార వ్యూహంగా చూడాలని ఇజ్రాయెల్‌కు చెందిన థింక్‌ట్యాంక్ పరిశోధకుడు టాల్ ఎలోవిట్స్ అభిప్రాయపడ్డారు. నెతన్యాహుపై ఒత్తిడి పెంచేందుకే ఈ డిమాండ్ చేశారని పేర్కొన్నారు. కొసోవో, ఇండోనేషియా వంటి దేశాల సైనికులు గాజాలో మోహరించిన తర్వాత ఇజ్రాయెల్ సైన్యం వ్యవహరించే తీరు భిన్నంగా ఉండే అవకాశం ఉందని ఎలోవిట్స్ వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా గాజాపై దాడులను తగ్గించాలని ఇజ్రాయెల్‌పై అమెరికా చేస్తున్న ఒత్తిడి ఫలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రణాళికలో భాగంగా ఇజ్రాయెల్ సైన్యం పాక్షికంగా వెనక్కి తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో గాజాలో సైనిక చర్యలను నియంత్రించాలంటూ అమెరికా ఒత్తిడి పెంచినట్లు సమాచారం. ఇజ్రాయెల్ మీడియా కథనాల ప్రకారం సైనికులు గాజాలో దాడులు నిర్వహించాలంటే సాధారణ పరిస్థితుల్లో సైన్యాధిపతి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని కొత్త ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. సైనికులకు తక్షణ ప్రమాదం ఎదురైతే మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపు ఉంటుందని సమాచారం. గతంలో ప్రాంతీయ కమాండ్ అధిపతి అనుమతితో దాడులు నిర్వహించే అవకాశం ఉండగా ఇప్పుడు అనుమతి ప్రక్రియను మరింత కఠినతరం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై స్పందించాలంటూ ప్రశ్నించగా ఇజ్రాయెల్ సైన్యం రాజకీయ నాయకత్వాన్ని సంప్రదించాలని సూచించింది. నెతన్యాహు కార్యాలయ ప్రతినిధి మాత్రం ఈ అంశంపై వ్యాఖ్యానించేందుకు నిరాకరించారు.

## రికగ్నిషన్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న కెడిసిసిబి

**విజయవాడ, ఆగస్టు 5, ప్రభాతవార్త :** అత్యధిక టర్నోవర్ సాధించిన కృష్ణాజిల్లా కేంద్ర సహకారబ్యాంకు ప్రతిష్టాత్మక రికగ్నేషన్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు దక్కించుకుంది. ఆప్కాబ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు విజయవాడలోని బసవపున్నయ్య ఆడిటోరియంలో నిర్వహించారు. 2025-26 ఆర్థికసంవత్సరానికి రూ.15వేలకోట్ల టర్నోవర్ సాధించిన కృష్ణా కేంద్రసహకార బ్యాంకు అత్యుత్తమ సేవలతో ఉత్తమ పురస్కారం అందుకుంది. ఈమేరకు ఆప్కాబ్ చైర్మన్, వీరాంజనేయులు, బాబు.ఎ, ఆప్కాబ్ యండి వి.రామకృష్ణల చేతుల మీదుగా కెడిసిసిబి చైర్మన్, రఘురామ్‌కు పురస్కారానికి అందచేసారు.

## ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆటో డ్రైవర్లు నిరవధికంగా సమ్మె



అభివాదం చేస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, బి.వెంకటేశం, వి.మారయ్య తదితరులు

**సైఫాబాద్, ఆగస్టు 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని లక్షలాది మంది ఆటో, క్యాబ్, లారీ, బస్సు తదితర వాహనాల డ్రైవర్ల సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి ఆటో డ్రైవర్లు నిరవధికంగా సమ్మె చేపడతారని తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జెఏసి ప్రభుత్వాన్ని హెచ్చరించింది. డ్రైవర్లు ఏ పార్టీకి చెందినవారైనప్పటికి ముందుగా శ్రమజీవులేనని, వారిని కార్మికులుగా గురి ంచి సంక్షేమ చర్యలు చేపట్టాలని జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. జెఏసి ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆటో, క్యాబ్, లారీ, బస్సు డ్రైవర్ల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బిఆర్‌టియు ఆటో యూనియన్ అధ్యక్షుడు వి.మారయ్య అధ్యక్షత వహించగా సమావేశంలో బిఆర్ఎస్ నాయకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, జెఏసి అధ్యక్షుడు బి.వెంకటేశం, నాయకులు ముఖేష్, రవిశంకర్, శ్రీకాంత్, ప్రవీణ్, మల్లేష్, సలీం, మాజీద్ సత్తిరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ట్రాఫిక్ చలానాలు తగ్గించడంతోపాటు ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పెన్షన్, సామాజిక భద్రతా పథకాలను అమలు చేయాలని ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల సాధనకు తమ బిఆర్ఎస్ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందన్నారు. బి.వెంకటేశం మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే తమ డిమాండ్లను అమలు చేయకపోతే ఆగస్టు 15 తరువాత జరిగే అసెంబ్లీ రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు సదస్సు నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తారని హెచ్చరించారు.



# ఊబకాయం ఉలికిపాటు !

మార్కెట్లలో విరివిగా లభించే ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో అధిక కార్బోహైడ్రేట్లు, అనారోగ్యకర మైన కొవ్వులు, శుద్ధి చేసిన చక్కెరలు ఉంటాయి. వీటితో కడుపు నిండాయాన్న నిండిన విషయాన్ని హెచ్చరించే లక్షణం అసలే లేదు. దీని ఫలితంగా ఊబకాయం, ఫ్యాటీ లివర్, మధుమేహం వంటి సమస్యలు పిల్లల్లో ఊబకాయం 15 నుంచి 18 శాతం వరకు పెరిగిందని ఐసీఎంఆర్, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాలు చెబుతున్నాయి. గర్భధారణ సమయంలో తల్లి అధిక బరువుతో ఉండటం, పిల్లలపై చదువుల ఒత్తిడి, పాఠశాలల్లో ఆటస్థలాలు లేకపోవడం వంటి కారణాల వల్ల వారు కౌమార దశలోనే జీవక్రియ సమస్యల బారిన పడుతున్నారని తెలిపారు. ఊబకాయాన్ని ఒక బహుళఅవయవ జీవక్రియ సమస్యగా గుర్తించి, దానికి సమగ్రమైన చికిత్స అందించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం పెరగడం, శారీరక శ్రమ లేని జీవనశైలి కారణంగా ప్రజల జీవక్రియల (మెటబాలిక్) ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని ఏఐజీ (ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ) ఏఐజీ సెంటర్ ఫర్ ఒబెసిటీ అండ్ మెటబాలిక్ థెరపీ డైరెక్టర్ డాక్టర్ కపాల హెచ్చరించారు. స్థూలకాయాన్ని కేవలం బరువు పెరగడంగా మాత్రమే కాకుండా, తల నుంచి కాలి వరకు ప్రతి అవయవాన్ని ప్రభావితం చేసే ఒక సంక్లిష్టమైన జీవక్రియ వ్యాధిగా పరిగణించాలని ఆయన సూచించారు. శాకాహారులు, ధూమపానం, మద్యపాన అలవాట్లు లేని వారిలో కూడా ఈ జీవక్రియ రుగ్మతలు కనిపిస్తున్నాయని, దీనికి ఆహార మార్పులు, వ్యాయామం లేకపోవడం , ఒత్తిడి ప్రధాన కారణాలని స్పష్టం చేశారు.

# పాలే తల్లికి మేలు



తల్లి పాలు తాగడం వల్ల పాపాయికే కాదు.. పాలిచ్చే తల్లికీ ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. అవేంటంటే..

★ బిడ్డ రొమ్ము పట్టినప్పుడు తల్లి మెదడు నుంచి సంకేతాలు వెలవడి..ఆక్సిటోసిన్ హార్మోన్ విడుదలవుతుంది.ఇది పాలు పడడానికే కాకుండా గర్భాశయం త్వరగా సంకోచించడానికీ దోహదం చేస్తుంది. దీంతో కాన్పు తర్వాత రక్తస్రావమూ తగ్గుతుంది. ఎందుకంటే మాతృ మరనాల్లో చాలావరకు రక్తస్రావం ఆగకపోవడమే ప్రధాన కారణమట. కాన్పు తర్వాత ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు.. వంటివి బిడ్డకు పాలివ్వడం వల్ల తగ్గుముఖం పడతాయి. బిడ్డకు పాలివ్వడం వల్ల ప్రెగ్నెన్సీలో పెరిగిన బరువు సైతం సులభంగా తగ్గే అవకాశం. ఉంటుందట. అదెలాగంటే. పాపాయికి పాలు పట్టే క్రమంలో తల్లి శరీరంలోని క్యాలరీలు ఎక్కువగా ఖర్చువుతాయి. తద్వారా తల్లులు ఈజీగా బరువు తగ్గేయచ్చు. పాలు పట్టడం వల్ల తల్లి మధుమేహం, అధిక రక్తపోటు బారినపడే అవకాశం చాలావరకు తగ్గుతుంది. పాలివ్వడం వల్ల నిద్ర కూడా హాయిగా పడుతుంది. చక్కటి మానసిక ఆరోగ్యానికి భావోద్వేగాల నియంత్రణకూ ఈ ప్రక్రియ తోడ్పడుతుంది. బుజ్జాయికి పాలు పడుతున్నప్పుడు నెలసరి కాస్త ఆలస్యంగా వస్తుంది. తద్వారా ఆ వెంటనే గర్భం ధరించే అవకాశమూ చాలావరకు తగ్గుతుంది. బిడ్డకు పాలిచ్చే మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ ముప్పు తక్కువని.. గుండె జబ్బులు, ఎముకలు గుల్లబారే అవకాశం కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.

# 'టీ'తో తేలికగా..



సాధారణంగా బరువు తగ్గడానికి భోజనాన్ని తగ్గించడమో, వ్యాయామం చేయడమో చేస్తుంటాం. కానీ, ఈ మధ్య కొన్నిరకాల టీలు తాగితే కూడా వెయిట్ తగ్గొచ్చనే ప్రచారం పెరిగింది. అయితే ఇది పూర్తిగా నిజం కాదంటారు నిపుణులు. సాధారణంగా భోజనానికి ముందో, తరవాతో ద్రవ పదార్థాలను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల మనం తినాలనుకున్న ఆహార పరిమాణం తగ్గుతుంది. ఇలా కొన్ని రోజులు చేస్తే కొంత బరువు తగ్గినట్లే కనిపిస్తుంది. కానీ, శరీరంలోని కొవ్వు నిల్వలు కలిగినట్లు కాదట. అలానే, కౌచ్ గ్రాస్, బుచు, డాండలైన్, ఉర్సి, బ్రూమ్ వంటి కొన్ని రకాల టీలలోని పోషకాలు.. ఒంట్లోని అదనపు నీటిని మూత్రం రూపంలో బయటకుపంపిస్తాయి. దీనివల్లా సన్నబడ్డామేమో అనిపిస్తుంది. అయితే, గ్రీన్, బ్లాక్, ఉలాంగ్ టీలలో ఉండేకొన్ని రకాల సమ్మేళనాలు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు సాయపడతాయి. అయితే, తక్కువ కాలంలో బరువు తగ్గడానికి మాత్రం పనికిరావు. సమతులాహా రాన్ని తీసుకోవడం, తగినంత నిద్రపోవడం, కనీసం రోజూ ఓ గంటైనా వ్యాయామం చేయడం వంటివి చేస్తూనే ఈ టీలు తాగితే ఆరోగ్యకరంగా బరువుని తగ్గించుకోవచ్చుట.



మా అమ్మాయి బీటెక్ రెండో సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా చదువంటే భయపడుతోంది. కొత్తవారిని చూస్తే చాలా బిడియంగా ఉంటుంది. ఎవరితోనూ కలవదు. ఎవరైనా మాట్లాడితే బిగుసుకుపోయి ఒక్కోసారి మాట కూడా తడబడుతుంది. చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో పెంచాం. ఇప్పుడు ఆమె ప్రవర్తన చూసి చాలా బాధగా ఉంది. పెళ్లి తర్వాత కూడా ఇలాంటి సమస్యలు వస్తాయేమోనని భయపడుతున్నాం. ఆమెకు ఎలా సహాయం చేయాలి? - ఒక సోదరి, విజయనగరం

ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

# వ్యథ బిడియం లోపమేమీ కాదు !



జవాబు: అమ్మా, మీ కుమార్తె విషయంలో మీరు ఆందోళన చెందడం సహజమే. అయితే ముందుగా ఒక విషయం గుర్తుంచుకోండి. బిడియం, కొత్తవారితో మాట్లాడటానికి సంకోచించడం, చదువు పట్ల భయం వంటి లక్షణాలు కనిపిం చాయని వెంటనే ఆమె వ్యక్తిత్వంపై లేదా భవిష్యత్తుపై ప్రతికూల నిర్ణయానికి రావద్దు.మీరు వివరించిన లక్షణాలను బట్టి చూస్తే ఆమె సామాజిక ఆందోళన లేదా ఆత్మవిశ్వాస లోపంతో బాధపడుతూ ఉండే అవకాశం ఉంది. కొన్నిసార్లు పరీక్షల ఒత్తిడి, అపజయం భయం, ఇతరులతో పోల్చడం, పరిపూర్ణంగా ఉండాలనే ఒత్తిడి లేదా గతంలో ఎదురైన ఏదైనా చేదు అనుభవం కూడా దీనికి కారణం కావచ్చు.ముందుగా ఆమెను మందలించడం, ఇతర పిల్లలతో పోల్చడం లేదా "ఇలా ఉంటే జీవితంలో ఎలా రాణిస్తావు?" అనే మాటలు చెప్పడం మానేయాలి. అలాంటి వ్యాఖ్యలు సమస్యను మరింత పెంచే ప్రమాదం ఉంది. ఆమెతో ప్రతిరోజూ కొంత సమయం ప్రశాంతంగా గడపండి. ఆమె భావాలను విమర్శించ కుండా వినండి. కుటుంబ సభ్యులతో, బంధువులతో చిన్నచిన్న సంభాషణలు చేయడానికి మెల్లగా ప్రోత్సహించండి. ఒక్కసారిగా అందరి మధ్యకు వెళ్లమని ఒత్తిడి చేయకండి. ఆమె చేసిన చిన్న ప్రయత్నాన్నైనా అభినందించండి. అది ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. నిత్యం కొంత వ్యాయామం, యోగా, ధ్యానం, సరిపడా నిద్ర, సమతుల ఆహారం కూడా మానసిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయి. చదువులో మార్కుల కంటే నేర్చుకునే ప్రక్రియపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించండి. మౌలిక అంశాలు నేర్చుకునేలా ప్రోత్సహించండి. అయితే ఈ లక్షణాలు చాలాకాలంగా కొనసాగుతున్నా, చదువుకు లేదా రోజువారీ జీవితానికి ఆటంకం కలిగిస్తున్నా ఆలస్యం చేయకుండా కౌన్సెలింగ్ సైకాలజిస్టును సంప్రదించడం మంచిది. అవసరమైతే సైకాలజికల్ అసెస్‌మెంట్ చేసి, కౌన్సెలింగ్ ద్వారా సమస్యను అధిగమించేలా మార్గనిర్దేశం చేస్తారు. అవసరమైన సందర్భాల్లో మాత్రమే మానసిక వైద్యుడి సలహా తీసుకోవాల్సి ఉంటుంది. బిడియం ఒక శాశ్వత లోపం కాదు. సరైన సమయంలో కుటుంబ సహకారం, ప్రోత్సాహం, కౌన్సెలింగ్ లభిస్తే చాలా మంది పూర్తిగా ఆత్మవిశ్వాసంతో సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు. కాబట్టి ఆమె భవిష్యత్తు గురించి ఇప్పుడే భయపడకుండా, ప్రేమతో అండగా నిలవండి. అదే ఆమెకు గొప్ప బలం.

# రాఘవేంద్రుని మహిమలు

దుర్మతి నామ సంవత్సరంలో .. ఫాల్గుణ శుద్ధ విదియనాడు రాఘవేంద్ర స్వామిగా సన్యాసాశ్రమం స్వీకరించారు.ఆ తరువాత ఆయన తన శిష్య బృందంతో కలిసి అనేక ప్రాంతాలలో పర్యటిం స్తున్నప్పుడు ఎదురైన ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపారు.



తన భక్తుడి కుమారుడు మామిడి రసం నింపిన గంగాళంలో పడి మరణించినప్పుడు, స్వామి మూల రాముడిని స్మరించి ఆ కుర్రవాడిని బతికిస్తారు. అలాగే ఎవరి సహాయ సహకా రాలు అందని ప్రదేశంలో తన భక్తుడి భార్య ప్రసవ వేదన అనుభవిస్తూ వుంటే .. ఆమెకి సుఖప్రసవం కలిగేలా చేస్తారు. ఇక పశువుల కాపరి అయిన వెంకన్నను ఆయన ఆశీర్వదించి తన అనుగ్రహ హస్తంతో 'దివాను'అయ్యేలా చేస్తారు.ఒక వ్యక్తి అహంభా వాన్ని సమూలంగా నశింపజే యడం కోసం .. ఆ గ్రామంలో యజ్ఞయాగాదులు జరిగేలా చూడటం కోసం 'రోకలి' చిగురించేలా చేస్తారు. తన శక్తిని పరీక్షిం చాలనుకున్న నవాబుకు తగిన విధంగా సమాధానమిచ్చి, 'మంచాల' గ్రామాన్ని బహుమతిగా పొందుతారు. ఒక ప్రాంతంలోని ప్రజలంతా కరవు కాటకా లతో నానా బాధలు పడుతుంటారు. ఆ రాజు అభ్యర్థనమేరకు ఆ ప్రాంతంలో అడుగు పెట్టిన రాఘవేంద్ర స్వామి, వర్ష ధారలు కురిపించి కరవు కాటకాల నుంచి ప్రజలను కాపాడతారు.

# 'సొనలు వేరుగా ..



పొద్దున్నే బ్రెడ్ టోస్ట్, అనే ఆమ్లెట్, ఇలా ఏది చేయాలన్నా గుడ్లే కదా కావాలి. కానీ కేక్స్ లాంటి వాటిల్లో తెల్ల సొన వరకే అవసరం. అలాంటప్పుడు పచ్చసొనను చితకకుండా వేరుచేయడం కొంచెం కష్టమైన వ్యవహారమే. ఆ శ్రమను తగ్గించడానికే 'యోక్ సెపరేటర్' వచ్చింది. రెండు అరల టిఫన్ డబ్బాలా ఉంటుందీ పరికరం. పై డబ్బా మధ్యలో క్రాకర్ టూల్ ఉంది. కొనదేలి ఉన్న దాని మీద గుడ్డు పగలగొడితే చాలు తెల్లసొన కిందికి జారి, యోక్ మిగులుతుంది. ఇలా ఒక్కోసారి ఐదింటిని విడగొట్టవచ్చు. గుడ్లు ఉపయోగించే ప్రతి ఇంట్లో ఉండాల్సిన సాధనం ఇది..

# తెర

# 'కరికాల' ఆసక్తిరేపిన టైటిల్ పోస్టర్



రెండు పార్టులుగా రాబోతోన్న 'కరికాల' 2027 జూలై 2న మొదటి చాప్టర్, 2027 అక్టోబర్ 28న రెండో చాప్టర్ 'శంబాల' బ్లాక్ బస్టర్ తరువాత దర్శకుడు యుగంధర్ ముని సందీప్ కిషన్‌తో ప్రకటించిన ప్రాజెక్ట్ మీద భారీ అంచనాలు ఏర్పడిన సంగతి తెలిసిందే. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద మహీధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ ప్రకటన నుంచే ప్రేక్షకుల్లో ఉత్కంఠను రేకెత్తిం చింది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన కాన్సెప్ట్ పోస్టర్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ మూవీకి సంబంధించిన టైటిల్‌ను రివీల్ చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు.కరికాల అంటూ ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రాబోతోంది. ఈ పోస్టర్‌లో సందీప్ కిషన్ కనిపిస్తున్న తీరు చాలా కొత్తగా ఉంది. గుర్రంపై హీరో, చేతిలో ఖడ్గం, సింహాన్నే పరిగెత్తిస్తున్నట్టుగా ఆ రాజసం అన్నీ కూడా సినిమాపై ఉత్సుకతను పెంచేలా ఉన్నాయి. ఈ టైటిల్ పోస్టర్‌తో ఒక్కసారి అంచనాల్ని రెట్టింపు చేసేశారు. ఈ మూవీని రెండు పార్టులుగా మేకర్లు ప్లాన్ చేశారు. మొదటి చాప్టర్ 2027 జూలై 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, రెండో చాప్టర్ 2027 అక్టోబర్ 28న రానుంది. రెండు పార్టుల రిలీజ్ డేట్‌లను ఒకే సారి ప్రకటించడం చూస్తుంటే.. ఇది ఈ ప్రాజెక్ట్ వెనుక ఉన్న స్థాయిని, ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తున్నట్టుగా కనిపిస్తోంది.శంభాల విజయం తర్వాత, దర్శకుడు యుగంధర్ ముని, షైనింగ్ పిక్చర్స్ బృందం ఈ కరికాల ప్రాజెక్ట్‌ను మరింత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు

# 'కొరియన్ కనకరాజు' 7న విడుదల

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు'తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హారర్ కామెడీ సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్, నవ్వులు పంచే వినోదంతో గొప్ప థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్‌ను అందిం చనుంది. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. . 'కొరియన్ కనకరాజు ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ భీమవరంలో గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో వరుణ్ తేజ్ మాట్లాడుతూ... అందరికీ హాయ్. 'కొరియన్ కనకరాజుతో ఆగస్టు 7న థియేటర్లలో నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉండబోతోంది. డెఫినెట్‌గా మీరందరూ ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు. . తప్పకుండా ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది." మంతెన రామరాజు మాట్లాడుతూ.. 'కొరియన్ కనకరాజు టీమ్ అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. నిశాంత్ మాట్లాడుతూ:వరుణ్ తేజ్ 'తొలిప్రేమ సినిమా కోసం ఇక్కడికి వచ్చారు. ఆ సినిమా పెద్ద హిట్ అయింది. దానికంటే పెద్ద బ్లాక్‌బస్టర్‌గా 'కొరియన్ కనకరాజు' నిలవాలని కోరుకుంటున్నాను. తమన్ మాట్లాడుతూ: భీమవరం నాకు చాలా స్పెషల్. తొలిప్రేమ సినిమా కోసం ఇక్కడికి వచ్చాం. ఇప్పుడు మళ్లీ రావడం చాలా ఆనందంగా ఉంది. నల్గొండ గద్దర్ మాట్లాడుతూ: ఈ సినిమాలో ఒక మంచి పాట పాడే అవకాశం ఇచ్చినందుకు హీరో వరుణ్ తేజ్‌కి, సంగీత దర్శకుడు తమన్ కి, అలాగే మా నిర్మాతలకు ధన్యవాదాలు.




# 14న రిలీజ్ కాబోతోన్న విశాల్ 'మకుటం'



సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం మకుటం. స్వర్గీయ ఆర్‌బీ చౌదరి నిర్మాణంలో రాబోతోన్న ఈ మూవీలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తు న్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటి వరకు వచ్చిన టీజర్, పాటలు అన్నీ కూడా అందరిలోనూ అంచనాలు పెంచేశాయి. మ్యూజికల్ ప్రమోషన్స్ జోరుగా సాగుతున్న ఈ తరుణంలో మేకర్లు అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించడమే కాకుండా.. ఆగస్ట్ 7న ట్రైలర్‌ను విడుదల చేస్తామని అప్డేట్ ఇచ్చారు. ఇప్పటికే విశాల్ మకుటంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. విశాల్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తుండటం.. పైగా దర్శకుడిగా మొదటి సినిమా అవ్వడం, జీవీ ప్రకాష్ ఇచ్చిన మ్యూజిక్ అందరినీ ఆకట్టుకోవడంతో అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. ఇక ఇప్పుడు సినిమా రిలీజ్ డేట్‌ని కూడా ప్రకటించడంతో ప్రమోషన్స్‌లో మరింత స్పీడ్ పెంచేలా కనిపిస్తున్నారు.ఈ సినిమాకి రిచర్డ్ ఎం. నాథన్, అభినందన్ రామానుజం కెమెరామెన్లుగా, వి.తీ. శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఇక ఈ మూవీని ఆగస్ట్ 14న భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు.

# 'పళ్ళబురుసు'నుంచి 'ఇచ్చి పడేద్దాం' సాంగ్ రిలీజ్



ఇప్పటికే 'కొత్త సోకు' పాటతో ప్రేక్షకులను అలరించిన 'పళ్ళబురుసు' టీమ్, ఇప్పుడు మరో ఎనర్జిటిక్ సాంగ్ 'ఇచ్చి పడేద్దాం'ను విడుదల చేసింది. ఈసారి పెళ్లి వేడుకల సందడిని తెరపైకి తీసుకొస్తూ, దావత్, బారాత్ సంబరాలను ఫుల్ జోష్‌లో సెలబ్రేట్ చేసే పాటతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. "ఇచ్చి ఇచ్చి ఇచ్చి పడేద్దాం..." అనే క్యాచీ హుక్‌తో ప్రారంభమయ్యే ఈ పాట మొదటి వినికిడిలోనే ఫెస్టివల్ మూడ్‌ను క్రియేట్ చేస్తుంది. "దావత్ అయినా... బారాత్ అయినా..." అంటూ సాగే సాహిత్యం పెళ్లి వేడుకల్లోని ప్రతి ఆనంద క్షణాన్ని సెలబ్రేట్ చేస్తుంది. "ఎవడిది వాడికి ఇచ్చి పడేద్దాం" అనే రిఫ్రైన్ పాటకు మరింత ఎనర్జీని తీసుకొచ్చి, అందరినీ డ్యాన్స్ ఫ్లోర్‌పైకి తీసుకొచ్చేలా రూపొందింది. మనీషా ఈరబత్తిని, నితేష్ అహేర్ తమ ఎనర్జిటిక్ వోకల్స్‌తో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. పవన్ సీహెచ్ అందించిన పెప్పీ ట్యూన్, క్యాచీ సాహిత్యం, ఉత్సాహభరితమైన బీట్స్ ఈ పాటను వెంటనే ఆకట్టుకునేలా చేశాయి.విష్ణు అందించిన కోరియోగ్రఫీ పెళ్లి వేడుకల సందడిని అద్భుతంగా ఆవిష్కరించింది. ఈ పాటలోని రిథమ్, ఫెస్టివ్ వైబ్ చూస్తే రాబోయే రోజుల్లో పెళ్లిళ్లు, వేడుకల్లో తప్పకుండా మారుమోగే సాంగ్‌గా నిలిచే అన్ని లక్షణాలు కనిపిస్తున్నాయి.ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న 'పళ్ళబురుసు' చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్ యాద్మా, గోమతి రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.

# అ'పూర్వ'ం ఆపురూపం



తాను చదువుకున్న పాఠశాలకు నటుడు ధనుష్ విలువైన కానుక అందించాడు. చెన్నైలోని సాలిగ్రామంలో ఉన్న తాయ్ సత్య మెట్రిక్యులేషన్ పాఠశాలకు మూడు అంతస్తుల కొత్త భవనాన్ని నిర్మించి విరాళంగా ఇచ్చాడు. ఈ కొత్త భవనానికి 'ధనుష్ బ్లాక్' అని పేరు పెట్టడం విశేషం. ధనుష్ పదో తరగతి వరకు ఇదే పాఠశాలలో చదివాడు. ఇటీవల కొత్త భవనం ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ధనుష్ తన స్కూల్ సహచరుడు, సినిమాటోగ్రాఫర్ కుమరన్‌తో కలిసి హాజరయ్యాడు. ఇద్దరూ 1999 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు. ఈ సందర్భంగా ధనుష్ తన ఉపాధ్యాయు లందరి పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నాడు. ఆ వారితో కలిసి ఫొటోలు దిగాడు. ఆ దృశ్యాలు అక్కడున్న వారిని భావోద్వేగానికి గురిచేశాయి.

# 'చిరంజీవి' స్నీక్ పీక్ 28నరిలీజ్



కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా "చిరంజీవి". ఈ చిత్రంలో ఈశ్వరి రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాను కికు ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. శుభ సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు."చిరంజీవి" సినిమా ఈ నెల 28న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ చిత్ర స్నీక్ పీక్ ను మేకర్స్ రిలీజ్ చేశారు.



# 'హ్యాపీ జర్నీ' మెలోడీ సాంగ్ రిలీజ్

రొటీన్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, మహిళల భావోద్వేగాలను ప్రధానంగా తీసుకుని రూపొందుతున్న చిత్రం 'హ్యాపీ జర్నీ ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జీనీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ల పై బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న 'హ్యాపీ జర్నీ' చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫస్ట్ సింగిల్, టీజర్‌తో భారీ అంచనాలను రేకెత్తించిన చిత్ర బృందం, ఇప్పుడు సీతాకోకలా సాంగ్ విడుదల చేసింది. శేఖర్ చంద్ర అందించిన స్వరాలు హార్ట్ టచ్చింగ్ వున్నాయి. సురేష్ బానిసెట్టి రాసిన సాహిత్యం మీనింగ్ ఫుల్ గా వుంది. చిన్మయి శ్రీపాద వోకల్స్ మెస్మరైజింగ్‌గా వుందిమహిళలందరికీ తమకు ఎటువంటి బౌండరీలు లేవని గుర్తుచేసే ఈ పాట విన్నవెంటనే కనెక్ట్ అవుతుంది. పారిస్, మాంట్‌పెలియర్, ఇతర అందమైన యూరప్ ప్రాంతాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా, అద్భుతమైన విజువల్స్‌తో పాటు హృదయానికి దగ్గరైన భావోద్వేగాలను కూడా అందించబోతోంది. కథ విదేశీ నేపథ్యంలో సాగినా, అందులోని మనుషుల అనుబంధాలు, భావాలు ప్రతి ఒక్కరికీ దగ్గరగా అనిపించేలా ఉంటాయి

# కృష్ణ-పృథ్వీ సంచలనం



**న్యూఢిల్లీ:** భారత జంట కృష్ణ గరగ ప్రసాద్-పృథ్వీ కృష్ణమూర్తి రాయ్ కొరియా మాస్టర్స్‌లో అతిపెద్ద సంచలనం సృష్టించారు. పురుషుల డబుల్స్ పోటీలో అగ్రశ్రేణి థాయ్ జంట చలోఎంపోన్ చరోయెన్‌కిటమోర్న్-వొర్రాపోల్ థోంగ్సాంగానను ఓడించి రెండో రౌండ్‌కు దూసుకెళ్లారు. ఈ ఈవెంట్‌లో పోటీపడిన సీడింగ్ లేని ఈ భారత జంట, 42 నిమిషాల్లో జరిగిన పోరులో 21-16, 21-18 తేడాతో విజయాన్ని నమోదు చేసింది. దీంతో ఈ జోడీ ఇప్పుడు తమ రెండో రౌండ్‌కు చేరుకుంది. ఇక మిగిలిన భారత బృందానికి మిశ్రమ ఆరంభం లభించింది. పురుషుల డబుల్స్ మొదటి రౌండ్‌లోనే దొడ్డవరపు అచ్యుతాదిత్యరావు-పోచన అర్జున్‌రెడ్డి ద్వయం కొరియాకు చెందిన చోయ్ సోల్ గ్యూ-మలేషియాకు చెందిన గో వి షెమ్‌ల చేతిలో 3-21, 10-21 తేడాతో ఓడిపోయి టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. మహిళల డబుల్స్‌లో, జపాన్‌కు చెందిన రెండో సీడెడ్ జోడీ రిరినా హిరామోటో-కోకోనా ఇషికావాల చేతిలో 15-21, 13-21 తేడాతో ఓటమి పాలైన ప్రియా కొంజెంగ్‌బామ్, శృతి మిశ్రాలు కూడా టోర్నమెంట్ నుండి నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్ క్వాలిఫైయర్స్‌లో, తుషార్ సువీర్ కెనడాకు చెందిన శౌర్య గుల్లయ్యపై 21-15, 21-12 తేడాతో ఘనవిజయంతో ప్రారంభించాడు, కానీ తదుపరి క్వాలిఫైయింగ్ రౌండ్‌లో జపాన్‌కు చెందిన షోగో ఒగావా చేతిలో 10-21, 17-21 తేడాతో ఓడిపోవడంతో మెయిన్ డ్రాకు అర్హత సాధించలేకపోయాడు.

# కొరియా మాస్టర్స్.. తొలి రౌండ్‌లో తన్వి గెలుపు




**న్యూఢిల్లీ:** భారత్ టీనేజ్ షట్లర్ తన్వి శర్మ చైనాకు చెందిన యువాన్ ఆన్ క్విని ఓడించి కొరియా మాస్టర్స్ 2026 రెండవ రౌండ్‌లోకి ప్రవేశించగా, పురుషుల సింగిల్స్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన డానిల్ దుబోవెంకో చేతిలో మాజీ ప్రపంచ ఛాంపియన్ భారత్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్‌తో ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించాడు. 17 ఏళ్ల మూడో సీడ్ టీనేజ్ క్రీడాకారిణి తన్వి బుధవారం ఆసన్‌లో జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌కు చేరుకోవడానికి చైనాకు చెందిన యువాన్ ఆన్ క్విని 21-16, 21-15 తేడాతో ఓడించింది. చైనీస్ తైపీకి చెందిన పై యుపోను 21-15, 21-14 తేడాతో ఓడించిన శ్రియాంశి వాలిశెట్టితో ఈ భారతీయ టీనేజర్ తదుపరి తలపడనుంది. మహిళల సింగిల్స్‌లో కూడా భారత్ మరో విజయాన్ని నమోదు చేసింది. మాన్సీ సింగ్ వెనుకబడినప్పటికీ పుంజుకుని దక్షిణ కొరియాకు చెందిన కిమ్ జూ యున్‌ను 14-21, 21-19, 21-9 తేడాతో ఓడించింది. ఇక పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఇజ్రాయెల్‌కు చెందిన డానిల్ దుబోవెంకో చేతిలో 22-20, 21-14, 21-12 తేడాతో ఓడిపోవడంతో, కిదాంబి శ్రీకాంత్ కొరియా మాస్టర్స్ 2026 ప్రయాణం తొలి అడుగులోనే ముగిసింది. శ్రీకాంత్ తన లయను కనుగొనడానికి చాలా ఇబ్బంది పడి పునరాగమనం చేయలేకపోయాడు, దీంతో దుబోవెంకో ఈ పోటీని సునాయాసంగా ముగించాడు. ఈ ఓటమితో సూపర్ 300 ఈవెంట్‌లో శ్రీకాంత్ ప్రస్థానం ముగియగా, భారత పురుషుల సింగిల్స్ ఆశలకు గట్టి దెబ్బ తగిలింది.

### వన్డే ప్రపంచకప్..

## ఫిబ్రవరి 22 నుండి క్వాలిఫైయర్స్ మ్యాచ్‌లు

### అక్టోబరు 4 నుండి మెయిన్ వరల్డ్ కప్

**న్యూఢిల్లీ:** వచ్చే ఏడాది సౌతాఫ్రికా వేదికగా జరగనున్న ప్రతిష్టాత్మక 2027 వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్‌కు సంబంధించి ఐసీసీ కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఈ టోర్నీకి అర్హత సాధించేందుకు నిర్వహించే క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ల తేదీలను ఐసీసీ బుధవారం అధికారికంగా ప్రకటించింది. 10 జట్లు పాల్గొనే ఈ క్వాలిఫైయర్ రౌండ్ 2027 ఫిబ్రవరి 22 నుంచి మార్చి 23 మధ్య జరగనుంది. ఈసారి జరగబోయే వన్డే ప్రపంచకప్‌ను ఐసీసీ సరికొత్త ఫార్మాట్‌లో నిర్వహించబోతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 14 జట్లు పోటీపడనున్నాయి. క్వాలిఫైయర్స్ పాయింట్ల పట్టికలో రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే జట్ల మధ్య సూపర్ సిరీస్ పోరు జరుగుతుంది. ఇది ప్రపంచకప్ మొదటి రౌండ్‌గా పరిగణించబడుతుంది. ఈ రౌండ్‌లో విజయం సాధించిన జట్లు ఆ తర్వాత టాప్12 లోకి అడుగుపెడతాయి. ఈసారి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ మూడు ఆఫ్రికన్ దేశాలు సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. టోర్నీలోని



మొత్తం మ్యాచ్‌లను 12 వేర్వేరు స్టేడియంలలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. క్వాలిఫైయర్ రౌండ్‌లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయి.

సెప్టెంబర్ 30, 2026 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో చివరన ఉండే రెండు ఫుల్ మెంబర్ జట్లు (ఆతిథ్య దేశాలైన సౌతాఫ్రికా, జింబాబ్వేలు మినహా) ఈ క్వాలిఫైయర్‌లో ఆడాల్సి ఉంటుంది. వీరితో పాటు సిడబ్ల్యూసి లీగ్ 2లో టాప్4 లో నిలిచిన జట్లు, అలాగే వరల్డ్ కప్ క్వాలిఫైయర్ ప్లేఆఫ్స్ లో టాప్4 లో నిలిచిన జట్లు కలసి మొత్తం 10 జట్లు ఈ క్వాలిఫైయర్స్ లో తలపడతాయి. మెయిన్ ప్రపంచకప్ మ్యాచ్‌లు 2027 అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు జరగనున్నాయి.



### శ్రీలంక మ్యాచ్‌లో..

## అత్యధిక వికెట్ల హీరోలు

**న్యూఢిల్లీ:** టీమిండియా ఈ నెల 15 నుంచి శ్రీలంకలో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో తలపడనుంది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో భారత్‌కు ఈ సిరీస్ అత్యంత కీలకంగా మారింది. డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో నిలవాలంటే శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా ఈ సిరీస్‌ను ఖచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ ప్రస్తుతం ఐదో స్థానంలో, శ్రీలంక ఆరో స్థానంలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత్, శ్రీలంక టెస్ట్ చరిత్రలో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్ల వివరాలు ఆసక్తికరంగా మారాయి. భారత్, శ్రీలంక మధ్య 1982 నుంచి టెస్ట్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ రెండు దేశాల మధ్య జరిగిన టెస్ట్ సిరీస్ చరిత్రలోనే అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా శ్రీలంక స్పిన్ దిగ్గజం ముత్తయ్య మురళీధరన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆయన భారత్‌పై 22 టెస్టుల్లో ఏకంగా 105 వికెట్లు పడగొట్టి ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే 18 టెస్టుల్లో 74 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇటీవలే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ 11 మ్యాచ్‌ల్లో 62 వికెట్లతో మూడో స్థానంలో నిలిచాడు. నాలుగో స్థానంలో హర్భజన్ సింగ్ (53 వికెట్లు), ఐదో స్థానంలో కపిల్ దేవ్ (45 వికెట్లు) ఉన్నారు. యాక్టివ్ ప్లేయర్లలో ఒక్కడే ఉండటం విశేషం. ఈ హెవీవెయిట్ బౌలర్ల జాబితాలో ప్రస్తుతం ఆడుతున్న ఆటగాళ్లలో భారత స్టార్ ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ఒక్కడే చోటు దక్కించుకోవడం విశేషం. 37 ఏళ్ల జడేజా ఇప్పటివరకు శ్రీలంకపై 7 టెస్టులాడి 33 వికెట్లు పడగొట్టి ఎనిమిదో స్థానంలో ఉన్నాడు. రాబోయే లంక పర్యటనకు జడేజా భారత జట్టులో ఎంపికయ్యాడు. ఈ జాబితాలో ఆరో స్థానంలో ఇషాంత్ శర్మ (36 వికెట్లు), ఏడో స్థానంలో శ్రీలంక మాజీ స్పిన్నర్ అజంతా మెండిస్ (34 వికెట్లు), తొమ్మిదో స్థానంలో రంగన హేరత్ (33 వికెట్లు), పదో స్థానంలో చమిండ వాస్ (30 వికెట్లు) నిలిచారు.

# వెస్టిండీస్ గడ్డపై విధ్వంసం

### పట్టు బిగించిన పాకిస్థాన్

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌పై అబ్దుల్లా షఫీక్ 160 పరుగులతో చరిత్ర సృష్టించాడు. 49 ఏళ్ల తర్వాత కరేబియన్ గడ్డపై పాక్ బ్యాటర్ 150 ప్లస్ స్కోరు సాధించాడు. బాబర్ ఆజంతో 183 పరుగుల భాగస్వామ్యం, పాక్ ఆధిక్యంతో పట్టు బిగించడంతో విండీస్ ఓటమి అంచున నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు కోల్పోయింది. క్వీన్స్ పార్క్ ఓవల్ మైదానంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ మూడో రోజు బుధవారం పాకిస్థాన్ జట్టు అత్యంత బలమైన స్థితికి చేరుకుంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ తన రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంతో 6 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడింది. కరేబియన్ గడ్డపై వెస్టిండీస్‌పై టెస్టుల్లో 150 కంటే ఎక్కువ పరుగులు సాధించి ఏకంగా 49 ఏళ్ల క్రితం నాటి రికార్డును అబ్దుల్లా షఫీక్ తిరగరాశాడు. పాకిస్థాన్ ఇన్నింగ్స్ ప్రారంభంలో ఓపెనర్లు అజాన్ అవైస్ (55), ఇమామ్ ఉల్ హక్ (14) కలసి 98 పరుగులు జోడించి అవుట్ అయ్యారు. మూడో వికెట్‌కు బ్యాటింగ్‌కు వచ్చిన షఫీక్, కెప్టెన్ బాబర్ ఆజమ్‌తో కలిసి కొండంత భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 183 పరుగులు జోడించారు. కెప్టెన్ బాబర్ ఆజం ఎంతో నిలకడగా ఆడి సెంచరీ దిశగా సాగినప్పటికీ, బ్రాండన్ కింగ్ వేసిన అద్భుతమైన త్రోకి 88 పరుగుల వద్ద రనౌట్ అయ్యాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా అబ్దుల్లా షఫీక్ చివరి వరకు నిలబడి 160 రన్లతో పాకిస్థాన్‌ను 387 పరుగుల మార్కుకు చేర్చాడు ఈ మ్యాచ్‌ను గెలిచి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1 తో సమం చేసే అవకాశాన్ని పాకిస్థాన్ చేజిక్కించుకుంది. పాక్ సాధించిన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం తర్వాత రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆటగాళ్లు పాక్ బౌలర్ల ధాటికి నిలవలేకపోయారు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి కేవలం 103 పరుగులు మాత్రమే చేసింది. ప్రస్తుతం విండీస్ చేతిలో 4 వికెట్లు మాత్రమే ఉండగా, కేవలం 60 పరుగుల స్వల్ప ఆధిక్యంలో ఉండి ఓటమి అంచున నిలిచింది. అంతకు ముందు తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 344 పరుగులు చేసింది.





# ఆర్‌బిఐ రెపో రేటు యధాతథం

### 5.25 శాతంగానే కొనసాగింపు



**ముంబయి, ఆగస్టు 5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిట సమావేశం అనంతరం రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగిస్తూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఎంపీసీ ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటును 5 శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్‌ఎఫ్), బ్యాంక్ రేట్లను 5.5 శాతం వద్ద కొనసాగించింది. ద్రవ్య విధాన వైఖరినితటస్థలంగానే కొనసాగించింది.16 నెలల తర్వాత వినియోగదారుల ధరల సూచీ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతాన్ని దాటి జూన్‌లో 4.4 శాతానికి చేరి ఆర్‌బీఐ అంచనాల కంటే 30 బేసిస్ పాయింట్లు తక్కువగా ఉందని పేర్కొంది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయికి చేరి, అనంతరం క్రమంగా తగ్గుముఖం పడుతుందని ఎంపీసీ అంచనా వేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సీపీఐ ద్రవ్యోల్బణ అంచనాను 10 బేసిస్ పాయింట్లు తగ్గించి 5 శాతానికి సవరించింది. త్రైమాసికాల వారీగా రెండో త్రైమాసికంలో 4.7 శాతం, మూడోత్రైమాసికంలో 5.9 శాతం, చివరి త్రైమాసికంలో 5.5 శాతం, 2027-28 తొలి త్రైమాసికంలో 5.3 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. అలాగే 2026-27లో కోర్ ద్రవ్యోల్బణం 4.3 శాతంగా ఉండనుందని, విలువైన లోహాలను మినహాయించిన కోర్ ద్రవ్యోల్బణం 4.3 శాతం కంటే తక్కువగానే కొనసాగే అవకాశముందని తెలిపింది.దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం, ఆర్థిక కార్యకలాపాలు అంచనాల కంటే మెరుగ్గా ఉండటంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 10 బేసిస్ పాయింట్లు పెంచి 6.7 శాతానికి సవరించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు పలు ప్రమాదాలు ఉన్నాయని గవర్నర్ సంజయ్ మల్హోత్రా హెచ్చరించారు. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాల లోపం, అసమాన వర్షపాతం, అంతర్జాతీయ ముడి చమురు ధరల అస్థిరత, పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ప్రధాన దేశాల ఆర్థిక పరిస్థితుల బలహీనత, ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, గ్లోబల్ వాణిజ్య విధానాలపై అనిశ్చితి వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా పేర్కొన్నారు.ప్రస్తుతం ద్రవ్యోల్బణం పెరుగుదల ప్రధానంగా ఆహార, ఇంధన సరఫరా సంబంధిత ఒత్తిళ్ల వల్లేనని, వృద్ధి రేటు కూడా ఆశించిన స్థాయిలో లేదని, పరిస్థితులపై మరింత స్పష్టత వచ్చిన తర్వాతే ద్రవ్య విధానంలో మార్పులపై నిర్ణయం తీసుకుంటామని గవర్నర్ తెలిపారు. ద్రవ్యోల్బణం, వృద్ధి పరిస్థితుల పరిణామాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే భవిష్యత్తులో విధాన రేట్లను పునఃసమీక్షించే అవకాశం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.



## క్లోజింగ్ ఆక్షన్‌లో ఎన్‌ఎస్ఇదే ఆధిపత్యం

**ముంబయి,ఆగస్టు 5:** మార్కెట్ ముగింపు ధర నిర్ణయానికి ఇటీవల అమల్లోకి వచ్చిన క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఆగస్టు 5న సీఏఎస్‌లో ఎన్‌ఎస్‌ఈ రూ.1,383.8 కోట్ల టర్నోవర్ నమోదు చేసి 99.1 శాతం మార్కెట్ వాటాను దక్కించుకుంది. బీఎస్‌ఈలో రూ.12.5 కోట్ల టర్నోవర్ నమోదై 0.9 శాతం వాటా మాత్రమే లభించింది. రెండు ఎక్స్ఛేంజ్‌ల కలిపి టర్నోవర్ రూ.1,396.3 కోట్లుగా నమోదైంది.సీఏఎస్ ప్రారంభమైన తొలి రోజున ఎన్‌ఎస్‌ఈలో రూ.1,276.2 కోట్లు, బీఎస్‌ఈలో రూ.10.8 కోట్ల టర్నోవర్ నమోదవగా ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, భారతి ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, టీసీఎస్, సీజీ పవర్, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో అధిక లావాదేవీలు జరిగాయి. ఈ 10 షేర్లే ఎన్‌ఎస్‌ఈ క్లోజింగ్ ఆక్షన్ టర్నోవర్‌లో సుమారు 30 శాతం వాటా కలిగి ఉండటం విశేషం.సెబీ సవరించిన ముగింపు ధర నిర్ణయ విధానంలో తొలి దశగా క్లోజింగ్ ఆక్షన్ సెషన్‌ను అమలు చేసింది. గతంలో అమలులో ఉన్న వాల్యూమ్ వెయిటెడ్ యావరేజ్ ప్రైస్ విధానానికి బదులుగా, కొనుగోలు-అమ్మకాల ఆర్డర్లకు సమతుల్య ధరను నిర్ణయించే వేలం విధానంలో ముగింపు ధరను ఖరారు చేస్తున్నారు. నిఫ్టీ50, సెన్సెక్స్ ముగింపు స్థాయిల్లో కనిపించిన వ్యత్యాసం పూర్తిగా మార్కెట్ శక్తుల ప్రభావమేనని, సాంకేతిక లోపాలు కారణం కాదని స్పష్టం చేశాయి. ప్రస్తుతం ఈ విధానం ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌కు అనుబంధంగా ఉన్న అర్హత గల నగదు మార్కెట్ షేర్లకు వర్తిస్తుండగా, దశలవారీగా మరిన్ని సెక్యూరిటీలకు విస్తరించాలని సెబీ యోచిస్తోంది.

### ఎయిర్ ఇండియాకు కొత్త సిఇఒగా


## టెవోల్డే గెబ్రెమారియం

### విస్తరణకు సిద్ధమైన టాటా గ్రూప్ సంస్థ..

### క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో నియామకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 5:** టాటా గ్రూప్‌కు చెందిన ఎయిర్ ఇండియా కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ), మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)గా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ మాజీ అధినేత టెవోల్డే గెబ్రెమారియంను నియమించింది. సంస్థ పునరుద్ధరణ ప్రక్రియను పూర్తి చేసి, అంతర్జాతీయ స్థాయిలో వేగవంతమైన విస్తరణ దిశగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. బుధవారం జరిగిన డైరెక్టర్ల బోర్డు సమావేశంలో గెబ్రెమారియం నియామకానికి ఆమోదం తెలిపినట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పలువురు ప్రముఖ విమానయాన నిపుణులను పరిశీలించిన అనంతరం ఆయనను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపింది.టాటా గ్రూప్‌కు ఎయిర్ ఇండియా తిరిగి వచ్చిన తర్వాత సంస్థ పునరుద్ధరణ కార్యక్రమాలకు నాయకత్వం వహించిన క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో గెబ్రెమారియం బాధ్యతలు చేపట్టనున్నారు.ఎయిర్ ఇండియా ఛైర్మన్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మాట్లాడుతూ విల్సన్ నాయకత్వంలో సంస్థ స్థిరీకరణ, విలీన ప్రక్రియ, భారీ విమానాల కొనుగోలు వంటి కీలక కార్యక్రమాలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం సంస్థ వృద్ధి, విస్తరణకు సంబంధించిన అమలు దశలోకి ప్రవేశించిందని, ప్రపంచ స్థాయి విమానయాన సంస్థను నిర్మించడంలో గెబ్రెమారియం అనుభవం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.